
# ఆంధ్రజ్యోతి

SEPT. '45
6 as



# ఈస్ట్ అండ్ వెస్ట్

పురాతనమై, గౌరవము పొందిన ఇండియా భీమా కంపెనీలలో ఇది ఒకటి

. . . ఈ విషయం అంకెలే చెప్పుతాయి . . .

| | |
|---|---|
| అమలులో ఉన్న జీవితభీమా | రు. 3,50,00,000 |
| కంపెనీ యావదాస్తులు | 85,00,000 పైన |
| ఆదాయం | 18,00,000 .. |
| జీవిత నిధి | 60,00,000 .. |
| చెల్లించిన క్లైములు | 25,00,000 .. |

## ది ఈస్ట్ అండ్ వెస్ట్ ఇన్సూరెన్సు కంపెని లిమిటెడ్,

ఈస్ట్ అండ్ వెస్ట్ బిల్డింగ్, అపోలోస్ట్రీట్, ఫోర్టు, బొంబాయి.

జీవితము...అగ్ని...నావిక...దుర్ఘటన

శ్రీ వి. వి. నాగరెడ్డి
చీఫ్ ఏజంట్
ఆదోని

శ్రీ జె. యస్. రెడ్డి
బ్రాంచి సెక్రటరీ
ఈస్ట్ అండ్ వెస్ట్ బిల్డింగ్
377, ఎస్ప్లనేడ్, మద్రాసు.



## కీర్తిశేషులైన హాజీ జె. జీ. ముహమ్మద్ సయ్యద్ సాహిబ్ గారి జ్ఞాపకార్థము ఈ ప్రేమాంజలి



వీరు ఇండో-చైనాలోని హానోయ్ నగరమందలి వణిక్ప్రముఖులలో నొకరు. ఆగస్టు 6-వ తారీఖున తమ స్వగృహమందు (నెం. 69 కజిషూన్ వీధి, పుదుచ్చేరిలో) హృదయరోగము వలన కొద్దిరోజులు బాధపడి ప్రశాంతముగా మరణించినారు. వీరియాత్మకు శాంతి చేకూరుగాత.

ఈ ప్రకటనను వీరి సోదరుడగు హాజీ జె. జీ. ముహమ్మద్ సుల్తాన్ సాహిబ్‌గారు ముద్రణకిచ్చి తమకు, యీ విపత్సమయమున సానుభూతి సందేశములంపిన యనేక మిత్రులకు కృతజ్ఞత తెలుపుచున్నారు.

**SPECIMEN COPY**



## ఈ సంచికలో కొందరు రచయితలు

| | |
|---|---|
| ఖాసా సుబ్బారావు | చలం |
| బుచ్చి సుందరరామశాస్త్రి | నార్ల |
| యజ్ఞన్నశాస్త్రి | క. స. |
| కె. కృష్ణమూర్తి | రావు |
| పద్మావతి | శ్రీ. శ్రీ. |
| వనమాలి | శరత్‌బాబు |
| శిష్ట్లా | ప్రేమచంద్ |

---

## ఆంధ్రజ్యోతి నిబంధనలు

● చందాదారులకు: ఆంధ్రజ్యోతి సంవత్సరం చందా ప్రత్యేక సంచికతో రు 5-0-0. అర్ధసంవత్సరం రు 2-12-0. వి. పి. ద్వారా అయితే మూడణాలు ఎక్కువ అవుతుంది. మాదిరికాపీ కావాలంటే ఆరణాల తపాలా బిళ్లలు పంపాలి.

● వ్యాసకర్తలకు: వ్యాసకర్తలు తమ వ్యాసంతోపాటు 0-0-9. బిళ్ల పంపితే ప్రకటించదలచని వ్యాసాలు తిప్పి పంపుతాము. ప్రకటించదలిస్తే తెలుపుతాము.

● ఏజంట్లకు: ఏజంట్లు కాగోరువారు ఆఫీసు మేనేజరుకు వ్రాసి ఏజంట్లఫారం తెప్పించుకోవచ్చును. ఆ నిబంధనలకు ఒప్పుకున్న మీదటనే వారి ఏజన్సీ ధృవపరచబడును.

● ప్రకటనదారులకు: ఆంధ్రజ్యోతిలో ప్రకటన చేయదలచుకున్న వారు మేనేజరుకురాస్తే ప్రకటనలరేట్లు పంపుతాము. కాని ప్రకటన చూసినమీదటనే అది వేయదగినదీ లేనిదీ నిర్ణయించబడుతుంది.

మేనేజరు: ఆంధ్రజ్యోతి,

43. ఆచారప్పన్‌స్ట్రీట్, జి. టి. మద్రాసు.

## యువ ప్రచురణలు

| | | | |
|---|---|---|---|
| 1. | పాపం! | 'చలం' | 0-12-0 |
| 2. | కన్నీటికాలవ | .. | 0-12-0 |
| 3. | అరుణ | .. | 0-12-0 |
| 4. | హంపీ కన్యలు | .. | 0-12-0 |
| 5. | బ్రాహ్మణీకం | .. | 0-12-0 |
| 6. | మైదానం | .. | 1-0-0 |
| 7. | మారుపేర్లు | కుటుంబరావు | 0-12-0 |
| 8. | కులంలేని మనిషి | .. | 0-12-0 |
| 9. | వరప్రసాదం | .. | 0-12-0 |
| 10. | కవిరాట్టు | .. | 0-12-0 |
| 11. | నీకేం కావాలి | .. | 0-12-0 |
| 12. | బడదీదీ | 'శరత్‌బాబు' | 0-12-0 |
| 13. | పరిణీత | .. | 0-12-0 |
| 14 | పతివ్రత | .. | 0-12-0 |
| 15. | వారీర్ మూల్య | .. | 0-12-0 |
| 16. | దేవదాసు | .. | 1-8-0 |
| 17. | పల్లీయులు | .. | 1-8-0 |
| 18. | తోకచుక్క | 'చక్రపాణి' | 0-12-0 |
| 19. | పాతమంగలి | .. | 0-12-0 |
| 20. | వనఫూల్ రచనలు | .. | 0-12 0 |
| 21. | ప్రగల్భప్రేతము | .. | 0-12-0 |
| 22. | బెంగాలీ కథలు | .. | 0-12-0 |
| 23. | పరాజయం | .. | 0-12-0 |
| 24. | నారీద్వేషి | .. | 1-8-0 |
| 25. | మూగజీవాలు | గోఖలే | 0-12-0 |
| 26. | మంగమ్మ | చలం | 1-0-0 |
| 27. | చిత్రాంగి | .. | 1-8-0 |
| 28. | కదంబం | నార్ల | 0-12-0 |
| 29. | అనావీలరు | శౌరీస్ | 0-12-0 |
| 30. | సుందర్ | .. | 3-0-0 |

ప్రతులకు

# యువ బుక్ డిపో

43 ఆచారప్పన్ స్ట్రీట్: జి. టి. మద్రాస్.




జెమిని చిత్రము.. తయారుచేసినవారు.రామనాథ్.. డైరెక్షన్. కొత్తమంగళం సుబ్బు....

# ఆంధ్రజ్యోతి

.....సచిత్ర మాస పత్రిక.....

సంపాదకుడు : చక్రపాణి

సంపుటి 5] సెప్టెంబరు 1945 [సంచిక 3


## వి. వి. గిరి

సమ్మెను జయప్రదంగా సాగించడం ఎలాగో, భారతదేశంలో చాలా కొద్దిమంది కార్మిక నాయకులకే తెలుసును. వారిలో శ్రీ వి. వి. గిరి ఒకరు. అధికారులను ఒళ్లు తెలియని ఆవేశంలో ధిక్కరించి, అంగవల్ల వచ్చే దారుణ నష్టాలను భరించవలసిన అవసరంలేకుండానూ, యజమానుల అడుగులకు మడుగులొత్తుతూ, వారు ఎంత నీచంగా చూసినా భరించి దాస్యం చేయవలసిన అవసరంలేకుండానూ, కార్మికులు సరియైన పద్ధతిలో నడిచేటట్లు చెయ్యడం ఆయనకు తెలుసు.

ఏదో తిరుగుబాటు చేశామంటే, చేశామనే పేరుకోసం చేసే నాయకులు, భారతదేశపు కార్మికులకు శనిగ్రహాలలాటివారు. వీరు ఉద్రేకం రెచ్చగొట్టే సిద్ధాంతాలను కార్మికులకు చెప్పి,—వారికి కొత్త హక్కులను సంపాదించి పెట్టకపోయినా, వారిలో క్రమశిక్షణను అలవరచకపోయినా—కార్మికులలో ఒక విచ్చలవిడిగా ప్రవర్తించే భావాన్నిమాత్రం తెచ్చిపెట్టారు. పెట్టుబడి విధానంవల్ల, కార్మికుల శ్రమఫలితాలను అనుభవించడానికి పట్టుదలతో పనిచేసే ఒకరకపు యజమానులు తయారయిన మాట వాస్తవం. ఈ యజమానులు జలగలవంటివారు. ఇలాటి జలగలను అంతమొందించడము, కేవలము మన సంఘానికే కాక, మన పరిశ్రమల అభివృద్ధికికూడా చాలా గొప్పసేవ అవుతుంది. కాని యీపని, సగంవరకు సాగి, మధ్యనే నిష్ఫలమైపోయే సమ్మెలవల్ల జరుగదు. ఇలాటి సమ్మెలవల్ల, ఆ సమ్మెలలో పాల్గొన్న కార్మికులు మరింత అణచివేయబడటం జరుగుతుంది. ఆందోళనలు జరపడమే వృత్తిగా పెట్టుకున్నవారు కొందరు, సమ్మె జరిపితే అది జయప్రదంగా సాగుతుందా సాగదా, అనే విషయాన్ని ఆలోచించకుండానే, సమ్మెను ప్రారంభిస్తారు. ఇలాటివారు, అననుకూలమైన కాలంలో, తగిన సన్నాహంలేకుండా, సమంజసమైన కారణంలేకుండా కార్మికులచేత సమ్మె చేయించి, నడిమధ్యలో ఆ కార్మికులగతిని కార్మికులకే వదలివేసి, వారికి

తగినసలహా చెప్పేవారు యెవరులేకుండా, వారి నైతికబలాన్ని విధ్వంసనంచేసి, కార్మికులకు చాలా అపకారంచేశారు. ఇలాటి నీతి నియమాల లక్ష్యంలేని ఆందోళనకారులు, తమ మాటలువిని రంగంలో దిగినవారిని మోసంచేసి, తాము బాగు పడుతూ వుంటారు.

సమర్థులైన కార్మిక నాయకులు ఎవరూ అంటే, శ్రీ గిరి ఒక చక్కని తార్కాణం. క్రమశిక్షణ అంటే ఏమిటంటే, తమ హక్కులను వదలుకోకుండా, తమ విధులను సక్రమంగా నిర్వహించేటట్టు చెయ్యడం. ఇది అంత సులువైన పని కాదు. కాని, శ్రీగిరి, దృఢమైన నిర్ణయంతో, మృదువైన బోధలతో యీ పని చేయగలరు. షేక్స్పియరు సూక్తి ఒకటి ఉంది. "పోట్లాటలోకి జారబడకు. ఒక వేళ జారబడితే, శత్రువు నిన్నుగురించి భయపడవచ్చుననే విషయాన్ని మనసులో వుంచుకో" అని. ఈ సూక్తిలోని ప్రయోజనాన్ని ప్రతిఫలింపజేసే ఒక ప్రత్యేక పద్ధతిలో శ్రీ గిరి, తమ కార్మిక నాయకత్వాన్ని సాగిస్తున్నారు. కార్మికుల ఇబ్బందులు బాగా ఎక్కువ అయేదాకా ఆయన కనిపెట్టుకొని వుంటారు. అప్పుడు, చాలా మోతాదుగా తమ కోర్కెలను బైటపెడతారు. అప్పుడు యజమానులు కాదనలేరు. మాట్లాడకుండా ఒప్పుకోవలసిందే. కార్మికుల ఇబ్బందులు తప్పని సరిగా తొలగి తీరవలసిందే. కాంగ్రెసు మంత్రిత్వాలు నిర్వహించిన రోజులలో, శ్రీ గిరి, కార్మిక, పరిశ్రమ శాఖలకు మంత్రిగా ఉన్నారు. ఈ రెండు శాఖలకూ ఒకే వ్యక్తి మంత్రిగా వుండటం, కమ్యూనిస్టు ప్రభుత్వంలో సబబుగానే వుంటుంది కాని, పెట్టుబడిదారీ పద్ధతిలోవున్న ప్రభుత్వంలో ఇది అతికే కలయిక కాదు. పరస్పర విరుద్ధాలైన యీ రెండుశాఖలనూ కలపడం, పరిపాలనా చాకచక్యంలో శ్రీ సి. రాజగోపాలాచారికే చేతనయిన పని. కాని ఈ రెండుశాఖలకూగల కార్య భారాన్ని నిర్వహించడం శ్రీ గిరికి తప్ప, అన్యులకు సాధ్యంకాదు. కార్మిక శాఖకూ, పరిశ్రమశాఖకూ కూడా మంత్రిగావుండి, జయప్రదంగా తనపనిని నిర్వహించుకోవాలంటే, పరస్పర విరోధులై, ఒకరిమీద ఒకరు సర్వదా నేరారోపణ చేసుకొనే, రెండువర్గాల విశ్వాసాన్ని పొందగలిగి వుండాలి. ఒకరికి అనుకూలంగా వున్న నిర్ణయం, మరొకరికి కేవలం విప్రాయంగా వుంటుంది. ఏ నిర్ణయంచేసినా, ఏ వర్గంవారో, అదొక అవతల వాళ్లకి పక్షపాతం చూపిస్తున్నారు అని ఆరోపణ చేస్తారు. ఇక, ఉభయుల్లోనూ ఎవరికీ అనుకూలం గాక, తటస్థంగా వుండే నిర్ణయాలను చేస్తే, అది పరిపాలనా విధానంలో పురోగమనాన్ని అరికట్టడమే అవుతుంది. ఇన్ని చిక్కులువున్నా, శ్రీ గిరి, పరస్పర విరుద్ధమైన రెండుశాఖల మంత్రిత్వాన్ని నిర్వహించి, ఉభయుల విశ్వాసాన్ని పొందగలిగారు. ఇది ఆయనకు ఎలా సాధ్యమైనదంటే మాత్రం చెప్పలేము. అది బహుశా, కేవలం కొద్దిమందికి మాత్రమే లభ్యమైన వ్యక్తిత్వంవల్ల సాధ్యమై వుండవచ్చును.

కాంగ్రెసు మిత్రమండలి, వివిధప్రజ్ఞావంతుల జట్టు. వారిలో ప్రాముఖ్యత నిరంతర కార్యనిమగ్నత కలిగినవారు గిరిగారే. గొప్ప ప్రణాళికలు, గొప్ప ఉద్దేశాలు గల వ్యక్తిగా ఆయన ప్రజల మనసులోకి యెక్కాడు. దక్షిణదేశపు వాతావరణంలో, ఉత్తరదేశీయుని ఉత్సాహంతో, మదరాసు మోస్తరుకు భిన్నమైన దుస్తులతో ఆయన రాష్ట్రీయతత్వంలోనూ, రాష్ట్రీయ రాజకీయాలలోనూ నిమగ్నుడైనవానివలె కనపడడు. దానికి కారణము అంతరరాష్ట్రీయ జాతీయభావం కావచ్చును; లేదా అంతర్జాతీయ విశాల దృక్పథము కావచ్చును. ఈ ధోరణి మాత్రం ఆయనలో స్పష్టంగా కనపడుతుంది. ఏమంటే ఎంతో ఉద్రిక్తపరిసరాల మధ్యకూడా ఆయన ఏమీ ఉద్రిక్తుడుకాకుండా కొంతవరకు తనకు సంబంధించనట్టే వుండగలడు. చాలమంది నాయకులు ప్రాంతీయసమస్యలలో తీవ్రంగా పాల్గొని, వాట్లలో మునిగితేలుతూవుంటారు. శ్రీ గిరిమాత్రం ప్రాంతీయపోరాటాలకు అందని ఉన్నతశిఖరాలమీదనే ఎప్పుడూ వుంటారు. కేంద్రశాసనసభలోను, దేశంమొత్తంమీదను కార్మికనాయకుడుగా ఆయనకుగల స్థానమే మదరాసు మంత్రివర్గంలోనికి ఆయనను లాగుకొని వచ్చినది. అతిస్వల్పవిషయాల పరిశీలనలోకూడా ఆయన చూపే విశాలదృక్పథానికి కారణం అదే.

ఆయన ఆంధ్రుడు; అయినా స్వప్రధానత్వాన్ని ప్రదర్శించడం, రాష్ట్రీయ పరిమితిలోనే రాజకీయాలను ఆలోచించడం మాత్రం ఆయనలో కానరావు. ఆయన మంచి కలుపుగోలుతనం కలవారు. ఏసభలోనైనా మనసు మెప్పించగలవారు. అతిథిసత్కారంవిషయంలో విస్తారమైన పేరుపడ్డ వంశంలో ఈయన జన్మించారు. వీరికుటుంబంలో ఒకరితో ఒకరు స్నేహితులలాగ మెలగుతారుగాని సాధారణంగా యితరకుటుంబాలలోలాగ దాపరికాలు వుంచుకోరు.


శ్రీ గిరి, ఆయనతండ్రి స్వర్గీయ జోగయ్యపంతులు, ఒకరినొకరు ఎంతో ప్రేమతో గౌరవించుకొనేవారు. ఇద్దరూ మంచి స్నేహితులలాగ వుండేవారు. వీరిలో తండ్రిపట్ల కుమారునికి ఎక్కువ ప్రశంసాభావం వుండేదా, కుమారుని పట్ల తండ్రికి ఎక్కువ ప్రశంసాభావం వుండేదా అనేవిషయం నేను చెప్పలేను.

శ్రీ గిరి, దయాభావం కలవారు. దానబుద్ధిగలవారు. ప్రతివ్యక్తీ జీవితంలో కష్టంలేకుండా సుఖంగా జీవించాలని. కోరేవారు. ఆయన పరోపకారపారీణత ఒక్కొక్కప్పుడు ఆయనకు మించిన లోతులో ఆయనను దించుతూవుంటుంది.

ఇటీవల కాంగ్రెసుపడిన అన్నిరకాల చికాకులల్లోను తన గౌరవానికి ఏమాత్రం లోపంలేకుండా ఆయన బైటపడ్డారు. ముందుముందు ఆయన చాలా గొప్ప దశను అనుభవించగలడు.

—ఖాసా సుబ్బారావు.

# శ్రద్ధాంజలి




భారతరాజకీయాకాశంలో ఒక ప్రజ్వలతారగా భాసిల్లిన
శ్రీ సుభాసచంద్రబోసు, విమానప్రమాదంవల్ల గాయపడి,
జపానులో ఒక ఆస్పత్రిలో మరణించాడని టోకియోవార్త.



ఈవార్త భారతీయులందరికీ దుఃఖప్రదమైనది. పండిత జవహర్‌లాల్ నెహ్రూ వచించినట్లు, సుభాసబోసు, యిటీవల అవలంబించిన విధానాలతో మేముకూడా ఏకీభవించజాలము. కాని, ఏదారి త్రొక్కిన సుభాసబోసు తన జీవిత పరమార్థంగా, భారతదేశ స్వాతంత్ర్యాన్నే లక్షించాడనే సత్యాన్ని ఎవరూ కాదనజాలరు. ఈలక్ష్య సిద్ధికి, ఆయన ఇటీవల ఒక పెడదారినే త్రొక్కి వుండవచ్చును. అది కేవలము, అక్షరాజ్యాల ప్రవర్తనపట్ల భ్రమజనితమైన విశ్వాసంవల్లనే, అనటంలో సందేహాము వుండజాలదు. ఇండియన్ సివిలు సర్వీసులో ఉద్యోగానికి రాజీనామాయిచ్చి దేశస్వాతంత్ర్య సమరంలోదిగి, విశేష త్యాగాలనుచేసి, కాంగ్రెసు అధ్యక్షుడుగా మన్నలనుపడసిన సుభాసుబాబు, ఒకానొక సందర్భంలో పొరపాటుదారిన నడిచినా, తన సోదర దేశీయుల గౌరవమన్ననలను కోల్పోజాలడు. ఆయన మృతికి చింతించని భారతీయుడు వుండడు. భారతస్వాతంత్ర్య సంపాదనకు, జపానువల్ల ఏదో ప్రయోజనము వుంటుందనుగొని, జపాను పక్షమునచేరి నప్పుడు సుభాసుబాబు చర్యను, దేశభక్తులగు భారతీయు లెవరును హర్షించలేదు. అటులని, ఆయన దేశభక్తి శంకించవలసినదీ కాదు. ఇంతకును కారణము 'ప్రమాదోధీమతామపి!'

దేశీయ రాజకీయ రంగంలో ప్రఖ్యాత, ప్రముఖస్థానాన్ని అలంకరించిన సుభాసుబాబు జీవితచరిత్ర నెరుగని భారతీయుడుండడు. చిన్నతనము నుంచీ, ఆయన జీవితము త్యాగమయమే. దేశభక్తి పూరితమే. దేశస్వాతంత్ర్య సంపాదనా పరత్వమే. చిట్టచివరకు జపాను సహాయమును అర్థించుటలో కూడా ఆయన లక్ష్యమదే. ఈ ఒక్క సందర్భములో తప్ప, మరెన్నడూ ఆయన పెడదారిని త్రొక్కలేదు.

పండితనెహ్రూ చెప్పినట్లు, ఆయన ఇంకను జీవించినచో, తన జీవితమునకు సంబంధించిన అనేక సమస్యలను యెదుర్కొనవలసివుండేది. తన సమస్యలను విరగడచేసుకొని, స్వాతంత్ర్య సమరానికి తన జీవితాన్ని అర్పణచేసిన, యీ భారతీయ వీరునికి ఇదే మా శ్రద్ధాంజలి.



# జపాన్ పతనం

నార్ల వెంకటేశ్వరరావు

జపాన్ పరాజయాన్ని చెందింది; పరాభవాన్ని పొందుతున్నది.

అది చేసిన పాపాలు అనేకం. వాటి ఫలితాలనే నేడు అనుభవిస్తున్నది.

అది పోయినవి దురాశలు. అది నడిచింది వక్ర మార్గం. దురాక్రమణను ఆశించి, దౌష్ట్యాలను జరిపింది. పాపం పండగా నేడు పాతాళానికి పడిపోయింది. వాస్తవానికి జపాన్ అధఃపతనమైపోయింది—ఆగస్టు 11-వ తేదీని పరాజయాన్ని అంగీకరించి, మిత్ర రాజ్యాలను సంధికై వేడినప్పుడు కాదు; అంతకు పూర్వమే—పెక్కు సంవత్సరాలకు పూర్వమే—అది పతనం చెందింది.

ప్రాచ్యఖండానికి నైతిక నాయకత్వాన్ని వహించగల మహదవకాశాన్ని జాత్యహంకారాని కేమి, సామ్రాజ్య నిర్మాణకాంక్ష కేమి ఏనాడు జపాన్ బలిపెట్టిందో, ఆనాడే అది అధోగతి పాలై పోయింది.

ఆసియాఖండంలో ఓం ప్రథమంగా జాగృతినందిన దేశం జపాన్.

80 సంవత్సరాలకు పూర్వం ప్రపంచంతో సంబంధం లేకుండా, కూపస్థ మండూకంవలె, అది జీవిస్తూ వుండేది. విదేశీయులను అది తన గడ్డపై అడుపెట్టనిచ్చేది కాదు; తన పౌరులను విదేశాలకు వెళ్ళనిచ్చేది కాదు. ప్రపంచంతో సంబంధం పనికిరాదన్న పట్టుదలతోనే అది నౌకానిర్మాణాన్ని బహిష్కరించిందికూడా. అప్పటిలో జమీందారీపద్ధతి దాని సాంఘిక, ఆర్థిక రాజకీయ వ్యవస్థలకు ప్రాతిపదిక. సామురాయ్ అనే క్షత్రియవంశీకులదే భూమి, వారిదే భాగ్యం; వారిదే భోగం. క్షత్రియవంశీకులలోని సద్గుణాలతో పాటు, దుర్గుణాలుకూడా వారిలో పూర్తిగావుండేవి. ప్రతిష్ఠకోసం వారు పడిచచ్చేవారు. వంశమర్యాదను నిలుపుకోడానికి వారు ఎంత సాహసమైనా చేసేవారు. చంపడమో, చావడమో—ఇవి రెండే వారికి తెలుసు. ఏదో ఒక మాట పట్టింపుకొద్దీవారు తమలో తాము ఎల్లప్పుడు కలహిస్తూవుండేవారు. దేశం అంతఃకలహాలతో భీభత్సంగావుండేది. పేరుకు ఒక చక్రవర్తి...మికడో—వుండేవాడు. కాని, అతని అధికారం నామమాత్రం. తత్కాలానికి ఏసామురాయ్ నాయకుడు బలవంతుడో అత

డిదే వాస్తవానికి రాజ్యం. దేశంలో శాంతివుండేదికాదు; సుభిక్షం వుండేది కాదు. ఉదయభానుని రాజ్యం దారిద్ర్య, దైన్య, దౌర్భాగ్యచ్ఛాయలతో అంధకారబంధురంగా వుండేది.

తుట్టతుదకు సామురాయ్ వంశీకులలో—ఒక కొత్తతరం వారిలో—నవచైతన్యం పొడసూపింది. తక్కిన ప్రపంచంతో పాటు తాముకూడా అభివృద్ధిచెందితేనే తమకు భవితవ్యమని, వారుగుర్తించారు. దీని ఫలితంగా 1867 లో జపాను తన కూపంనుంచి వెలుపలికి వచ్చింది. ఆధునిక, సాంఘిక, ఆర్థిక, రాజకీయ భావాలను శీఘ్రగతిని పరిగ్రహింప నారంభించింది. సామురాయ్ వంశీకులు తరతరాగతమైన తమ హక్కుభుక్తాలను పెక్కింటిని స్వచ్ఛందంగా వదులుకున్నారు. జమీందారీ పద్ధతి తొలగించబడింది. భూమిని పండించే రైతే భూమిఖామందు అయ్యాడు. విదేశాలతో వర్తక వ్యాపారాలేమి, అన్యవిధ సంబంధ బాంధవ్యాలేమి ప్రారంభమైనాయి. కొత్తకొత్త పరిశ్రమలు స్థాపించబడ్డాయి. చక్రవర్తి అధికారం నామమాత్రంగా కాక, వాస్తవంగా నెలకొల్పబడింది. దాని అధికారాలు పరిమితమే అయినప్పటికీ, ఒక పార్లమెంట్ ఏర్పరచబడింది. నిర్బంధ ప్రాథమికవిద్య ప్రవేశపెట్టబడింది. పాశ్చాత్యవిజ్ఞాన సముపార్జనకై యూరప్, అమెరికాలకు పెక్కుమంది పంపించబడ్డారు. ఒక్కమాటలో జపాన్ ఆధునిక రాజ్యమైంది.

దాస్యంతో, దారిద్ర్యంతో, అజ్ఞానంతో, అంతఃకలహాలతో క్రుంగి కృశిస్తున్న మిగిలిన ఏషియాటిక్ రాజ్యాలకు జపాన్ 19-వ శతాబ్దితుది భాగానికి ఒక ఆశాజ్యోతివలె పరిణమించింది. ఇక 1905 లో జారిస్ట్ రష్యాపై పొందిన విజయంతో అది సమస్తప్రాచ్య ప్రజాకోటిలో ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మగౌరవాన్ని మోసులెత్తించింది.

ఆధునిక చరిత్రలో ఒక పాశ్చాత్య రాజ్యంపై ఓంప్రథమంగా ఒకప్రాచ్య రాజ్యం పొందిన విజయం 1905 లో జారిస్ట్ రష్యాపై జపాన్ పొందినట్టిదే. నాటి యుద్ధం ప్రధానంగా జారిస్ట్ రష్యా సామ్రాజ్య తత్వానికి, జపాన్ జాతీయతకు మధ్య. ఆ యుద్ధఫలితాన్ని చూచిన పిదప ఏషియాటిక్ ప్రజలందరికీ తాము నైరాశ్యాన్ని చెంద నవసరంలేదనీ, జపాన్ వలె తాముకూడా ఆధునిక పద్ధతుల నవలంబిస్తే, కాలంతోపాటు, పరిస్థితులతోపాటు, ప్రపంచంతోపాటు పరివర్తనం చెందితే, తాముకూడా శక్తివంతులమై, పాశ్చాత్య సామ్రాజ్యశక్తులను జయప్రదంగా ప్రతిఘటించి, స్వాతంత్ర్యాన్ని కాపాడుకోగలమని ధైర్యోత్సాహాలు కలిగాయి!

అయితే, జాతీయైక్యతా విధానంతోనేమి, సర్వతోముఖమయిన దేశాభివృద్ధి కృషితోనేమి జపాను సంతృప్తి చెందలేదు. అది పాశ్చాత్యవిజ్ఞానంలోని, సంస్కృతిలోని, వ్యవస్థలోని ఉత్తమ విషయాలతోపాటు అధమ లక్షణాలను సయితం అనుకరించింది.

పాశ్చాత్య పద్ధతులపై జాతీయైక్య తను సాధించుకొని కేంద్రప్రభుత్వాన్ని నిర్మించుకొనడంతోపాటు, అది కొన్ని వర్గాలతో సైనిక, ధనిక వర్గాలతో— రాజ్యాధికారాన్ని కేంద్రీకృతంచేసింది కూడా. పాశ్చాత్య పారిశ్రామిక పద్ధతులను అభ్యసించడంతోపాటు, కూలి డబ్బులకు అమ్ముడు పోవలసిన బానిస వర్గాన్ని సృష్టించుకున్నది కూడా. పాశ్చాత్య పద్ధతులపై సాంఘిక, ఆర్థిక వ్యవస్థలను పునర్నిర్మాణం చెసుకోవడంతో పాటు విపణివీధులకై అన్యదేశాలపై దురాక్రమణకు దిగవలసిన— దౌష్ట్యాలు జరపవలసిన అగత్యాన్ని కల్పించుకున్నది కూడా. దానితో ఆసియాఖండానికి నైతిక నాయకత్వాన్ని వహించదగు మహాద్భాగ్యాన్ని జపాన్ కోల్పోయింది. ఇంతేకాదు. సామ్రాజ్య తృష్ణలో, పరపీడనలో, హింసా కాండలో అది పాశ్చాత్య రాజ్యాలను సైతం అధిగమించిపోయింది. ఒక మహాఖండానికి, అనేక ప్రాచీన జాతులకు అభ్యున్నతి పథాన్ని నిర్దేశిస్తూ అగ్రస్థానాన్ని అలంకరించవలసిన జపాను ఒక జెయిలర్‌గా, ఒక తలారిగా, ఒక పెను భూతంగా పరిణమించింది.

తననైతిక ధర్మాన్ని విడిచిపుచ్చి, బ్రహ్మరాక్షసి రూపాన్నిధరించి, కొరియాలో, మంచూరియాలో, చైనాలో, మరికొన్ని యితర ఏషియాటిక్ రాజ్యాలలో అది సాగించిన నీచ, కఠోర పశు కృత్యాలు అత్యంత జుగుప్సాకరం.

"ఆసియాఖండ ప్రజల సుహృద్భావాన్ని జపాను సంపాయించుకొనలేకపోయింది. ఇది ఎంతైనా శోచనీయం" అని నేడు (ఆగష్టు 26 వ-తేదీని) టోకియో రేడియో వ్యాఖ్యాత విలపిస్తున్నాడు. విజేతను ఎవరు ఆహ్వానిస్తారు? నిరంకుశ ప్రభువుకు ఎవరు స్వాగతమిస్తారు? జాత్యహంకారంతో, సామ్రాజ్య నిర్మాణతృష్ణతో విశృంఖలంగా, పశుప్రాయంగా వర్తించేవారి పట్ల ఎవరికి సుహృద్భావం వుండగలదు? జపాను ఇప్పుడు తనపట్ల ఆసియాఖండ ప్రజలకు లవలేశమైనా అభిమానం లేకపోయిందని విలపించడం అర్థరహితం కాదా?

స్థూలదృష్టితో కాక సూక్ష్మదృష్టితో పరిశీలించినప్పుడు జపాన్ నేడు యుద్ధరంగంలో పొందిన పరాజయం కంటె నైతికరంగంలో అది ఏనాడో చెందిన పతనం అత్యంత ఘోరమైనట్టిది. ఈవిషయాలను ఇండియాలో, చైనాలో ముఖ్యంగా గుర్తించవలసివున్నది. ఆసియాఖండానికి నైతిక నాయకత్వాన్ని వహించడానికి లభించిన ఏ మహదవకాశాన్ని జపాన్ పోవిడిచిందో, దాన్ని చైనా ఇండియాలు స్వీకరించాలి. ఐతే చైనా జాతీయైక్య తను సాధించిననాడే, ఇండియా స్వరాజ్యాన్ని సంపాయించుకొనగలిగిననాడే, అవి తమ మహత్తర కర్తవ్యాన్ని— ఈ స్వధర్మాన్ని—సముచితంగా నిర్వహించగలవు.

# వివాహ సంస్కారము

## మహాత్మాగాంధీ

మహాత్మాగాంధిగారు ఆచార్యకత్వం వహించి డాక్టర్ ఏ. జి. టెండూల్కర్ గారికిని శ్రీమతి ఇందుమతి గుణజీగారికిని సేవాగ్రామం లోని కస్తూరిబా కుటీరంలో వివాహం చేశారు. ఈ వివాహ విధి నిర్వహణంలో గాంధీజీ అవలంబించిన పద్ధతినిబట్టి వివాహమంటే వారికున్న అభిప్రాయాలను వ్యక్తమవుతున్నాయి. ఈ అభిప్రాయాలను పాఠకలోకానికి అందించటానికిగాను అప్పుడు జరిగిన కార్యకలాపాన్ని ఇక్కడ ఇస్తున్నాము.

మహాత్ముడు ఆచార్యకత్వంవహించి మొదట ఇలా అన్నారు.

టెండుల్కర్‌కును ఇందుమతికిని వివాహం జరుపుతున్నాను. ఈ వివాహానికి సదస్యులుగా వచ్చి చూస్తున్నవారు వధూవరులు తీసుకొంటున్న ప్రమాణాలు నిష్కళంకమై నెరవేరటానికి తోడ్పడాలని కోరుతున్నాను.

తర్వాత గాంధీజీ వధూవరులను ఇలా ప్రశ్నించారు :

1. సుస్థిరమనస్కులై ఆలోచించివమీదట మీరు దంపతులు కాగోరుతున్నారా ?
2. మీరు సప్తయజ్ఞాలు నిర్వహించారా ?
   [ఈ యజ్ఞాలలో గోపూజ, జలపూజకూడా ఉన్నాయి.]
3. వివాహం కేవలం కామతృప్తికోసంమాత్రమేకాదని మీరుహృదయపూర్వకంగా విశ్వసిస్తున్నారా ?

4. సేవాత్యాగ ధర్మాయత్త మనస్కులై మీరు గృహస్థజీవములో అడుగిడుతున్నారా ?

5. జీవిత లక్ష్యసాధనంలో ఒండొరులకు అడ్డురాక పరస్పర సహాయం చేసుకుంటానికి మీరు పూనుకుంటారా ?

6. మనోవాక్కాయకర్మలయందు మీరు ఒండొరులకు బాసటగా ఉంటారా ?

7. భరతవర్షం స్వాతంత్ర్యం పొందనంతవరకు సంపూర్ణ బ్రహ్మచర్యవ్రతం పాలించటానికి మీరు హృదయపూర్వకంగా ప్రయత్నిస్తారా ?

8. అస్పృశ్యు లనబడుతున్నవారితో సహపంక్తి భోజనాలూ, అంతర్వివాహాలూ ఉండాలని మీరు విశ్వసిస్తున్నారా?

9. స్త్రీ పురుషులు సమానులని భావిస్తున్నారా?

10. యజమానీ సేవకురాలూ అన్నవిభేద దృష్టిలేకుండా కేవలం మిత్రులుగా జీవయాత్ర సాగించాలని మీరు కోరుతున్నారా?

11. సప్తపదికి బదులుగా సప్తయజ్ఞాలు అమలులోకి రావటానికి మీరు అంగీకరిస్తున్నారా?

ఈ ప్రశ్నలకు వధూవరులు సమాధానంచెప్పిన తర్వాత మహాత్ముడు ఇలా ముగించారు:

నేను స్వయంగా వడికిన ఈ నూలుతో మీరిద్దరినీ దాంపత్యబద్ధులను చేస్తున్నాను. అతిజాగరూకులై మీ రుభయులూ ఈ ధర్మవావిహితమైన బంధాన్ని కాపాడుకోండి. ఇది ఎన్నడూ విచ్ఛిన్నంకాకూడదన్న విషయాన్ని విస్మరించకండి. ఇప్పుడుచేసిన ప్రమాణాల కనుగుణంగా నడుచుకొంటానికి ఈపవిత్ర వివాహవిధులు సదా స్మృతిపథాలు పాయక మెలగటానికీ భగవంతుని ప్రార్థించండి.

# కబుర్లు

★ కె.స.

అస్సీ, చిమూర్ కేసులోను, కులశేఖరపట్నం కేసులోను ఉరిశిక్షలు పడ్డ యువకుల్ని ఉరికంబంనుంచి, రాజప్రతినిధి వేవెల్ ప్రభువు రక్షించాడు. వారి వురిశిక్షలు యావజ్జీవ ఖైదుశిక్షగా మార్చబడ్డాయి. ఈవార్త భారతదేశ ప్రజలందరికీ, అన్నివర్గాలవారికీ ఆనందం కలిగించిందనడంలో సందేహంలేదు.

ఈనిందితుల ఉరిశిక్షలను రద్దుపరచవలసిందని మహాత్ముడుకూడా ఒక ప్రకటనచేస్తూ అన్నమాట లివి:

"1942 ఆగస్టు 8 తేదీనను, ఆ తరువాతను ప్రజలు యేమైనా చెయ్యరాని పనులను చేసి వున్నట్లయితే, అవన్నీ ఉద్రేకంవల్ల చేసినవే. దానికి, ఇప్పుడు ఉరిశిక్షలు అమలు జరిపినట్లయితే, అది కేవలం పట్టుదలతో, ఆలోచనమీద నిండుప్రాణాలను తీసెయ్యడం అవుతుంది. అంతేగాక, యీపనిని చట్టం పేరుతో చెయ్యడం మరింత దారుణమైన సంగతి. దీని ఫలితం ఏమిటి? ఇప్పుడున్న ద్వేషభావం మరింత ఎక్కువ కావడమేకదా! ఈ వురిశిక్షలను అమలు జరపడం మానివేస్తే యెంతో బాగుండునుకదా అని అనుకుంటున్నాను."

మహాత్ముని కోరికప్రకారం అయితేనేమి, దేశంలోని ప్రజలందరి కోరిక ప్రకారమైతేనేమి యీ శిక్షలు రద్దుచేయబడ్డాయి. ఇలా చెయ్యడం వేవెల్ ప్రభువు రాజనీతిలో ఒక యెత్తు కావచ్చును, లేదా దేశమంతటి కోరికనూ మన్నన చేద్దామనే మర్యాద కావచ్చును; లేదా, ఆ యువకులపట్ల దయాభావమే కావచ్చును. ఏమైనా, జరిగినపని చాలామంచిది. హర్షించవలసింది.

ఈ ఉరిశిక్షలు పడటానికి, ఆ యువకులు చేసినపని మంచిదా, చెడ్డదా అనే సంగతినిగూర్చి నేనేమీ అనదలచుకోలేదు. కాని, చాలా సంవత్సరాలుగా నామనస్సును వేధిస్తూవున్న సమస్య ఒకటివుంది. ఉరిశిక్షలు వెయ్యడం అవసరమా?

మాటకిమాట, దెబ్బకిదెబ్బ, కన్నుకి కన్ను, ప్రాణానికి ప్రాణం బదులుతీసుకొనే ముష్కరన్యాయం అమలులో వున్న రోజులలో ఉరిశిక్షలు వెయ్యడం ప్రారంభమైంది. ఒక మనిషిని చంపినవాడికి శిక్ష, వాడి ప్రాణాలు తీసివెయ్యడమే.

ఇప్పుడు మనం చాలా నాగరికతను అలవరచుకున్నామని చెప్పుకుంటున్నాము. నాగరికతలక్షణంగా అనేకపాత ఆచారాలనూ, సాంప్రదాయాలనూ, చట్టాలనూ మార్చుకున్నాము; మార్చుకుంటున్నాము. అనేకదేశాలలోని ధర్మ

శాస్త్రకారులు, నేరాలకు విధించే శిక్షలవిషయమై పునర్విమర్శనలనుచేసి శిక్షలను మారుస్తూవున్నారు. చాలా దేశాలలో ఉరిశిక్ష రద్దుపరచబడింది. మనదేశంలోకూడా కొన్ని స్వదేశ సంస్థానాలలో వురిశిక్షలు రద్దుపరచబడ్డాయి.

న్యాయశాస్త్రాలు కాలానుగుణ్యమైనవి. ఒకనాటి ఆచారం మరొకనాడు వుండదు. ఒకనాటి విశ్వాసం మరొకనాడు వుండదు.ఒకనాడు ఘోర నేరమైన ప్రవర్తన మరొకనాడు ప్రజల సాంప్రదాయం అవుతుంది. న్యాయశాస్త్రం ఏమిటి? దేశప్రజలక్షేమాన్నీ, వారి పౌరస్వత్వాలనూ దృష్టిలోవుంచుకొని, వీటిపట్ల అపచారం చేసినవారిని శిక్షించడానికి ఏర్పరచే నిబంధనలే కదా? ప్రతిదేశంలోనూ, ప్రతికాలంలోను వర్తమాన ధర్మంపట్ల అపచారం చెసే వ్యక్తులు కొందరు వుంటూనే వుంటారు. అలాటిఅపచారాన్నే మనం శిక్షార్హమైన నేరంగాపరిగణిస్తున్నాము. శిక్షలు వేస్తున్నాము. కాని, ప్రతి నేరాన్ని విచారించేటప్పుడు నేరస్తుని ప్రవర్తనకు ఏశిక్ష విధించాలని మనం న్యాయశాస్త్రంలో ఏర్పాటుచేస్తామో, ఆశిక్ష విధించడంతో మన న్యాయబుద్ధి న్యాయరక్షణాశీలత పరిపూర్ణం కావు. ఒకవ్యక్తికి మరొకవ్యక్తి, స్వలాభం, స్వసౌఖ్యంచూసుకొని నష్టంకలిగించడం తప్పు. అదే నేరము. కాని దానికి శిక్షగా ఆనేరస్తుణ్ణి ఇలా చెయ్యాలి అని ఒక నిబంధన వ్రాసుకొని ఎల్లకాలమూ అలా జరపడం ధర్మంకాదు. నేరస్తుణ్ణి విచారించే న్యాయాధిపతి ప్రధానధర్మం యెప్పుడూకూడా ఆ నేరస్తుడు ఎందుచేత ఆతప్పుచేశాడు, అనే విషయాన్ని జాగ్రత్తగా పరిశీలించడమై వుండాలి. మాటవరసకు చెప్పుకుందాము. సుబ్బయ్య, పుల్లయ్యను చంపాడనుకోండి. పుల్లయ్య ఏంచేస్తే సుబ్బయ్య ఆపని చేశాడు. ఆ విషయాన్ని ఎక్కువగా ఆలోచించాలి. ఇలా ఆలోచించి నట్లయితే సుబ్బయ్య తనబాధను విరగడ చేసుకోడానికి పుల్లయ్యను చంపాడని స్పష్టం కాకపోదు. అలాటప్పుడు సుబ్బయ్య ఏంచెయ్యగలడు? అయితే తనకు పుల్లయ్యవల్ల ఎంతబాధకలిగినా న్యాయమైన పద్ధతిలో ఆబాధను తొలగించుకోవాలిగాని పుల్లయ్యను చంపడానికి సుబ్బయ్యకు హక్కువున్నదా? లేదు. కాని అవివేకంవల్ల, ఉద్రేకంవల్ల సుబ్బయ్య ఆపని చేసివుంటాడు.అలాంటి వాణ్ణి స్వేచ్ఛగా వదలివేస్తే తక్కిన వారుకూడా 'సుబ్బయ్యను ఏంచేశారులే మనల్నిమాత్రం ఏంచేస్తారు' అని విచ్చలవిడిగా తమకు పగవున్నవాళ్ళను అంతమొందించడం జరుగుతుంది. అందుచేత సుబ్బయ్య చేసిన తప్పుపనికి తగిన దండన చేశేవారున్నారనీ, మరొక రెవరైనా అలాటి తప్పుపనిచేస్తే వారికి కూడా దండనజరుగుతుందనీ ప్రజలంద

ర్థికి ఒక జాగ్రత్తవుండడం అవసరం. అలాటి జాగ్రత్తను వర్తింపచెయ్యడం మాత్రమే ప్రభుత్వవిధి.

ఈవిషయాన్ని చాలా తీవ్రంగా ఆలోచించి, చాలా చర్చలు జరిపినమీదట ఖూనీ నేరాలు చేసినవాళ్ళకుకూడా ఉరిశిక్షలను విధించడం చాలా దేశాలలో విరమించబడింది.

సాధారణంగా ప్రతిదేశంలోనూ కూడా మామూలు నేరస్తులను ఒకవిధంగానూ, రాజకీయ నేరస్తులను మరొకవిధంగానూ పరిగణిస్తారు. దానికి కారణం రాజకీయంగా నేటిప్రభుత్వానికి విరుద్ధమైనపని రేపటి ప్రభుత్వపు ధర్మమే కావచ్చును. అంచేత నేటి ప్రభుత్వం తనకు కిట్టనివారిని తనకు ప్రతికూలంగా పెద్ద ఆందోళన లేవదియ్యకుండా ప్రజాజీవితరంగంలోనుంచి తప్పించడం కద్దు, అంటే జెయిలులో వుంచటం, లేదా ఫలాని ఊరుదాటి బైటికి వెళ్ళకూడదు అని నిషేధాజ్ఞలను అమలుజరుపడం మొదలైనవి. అంతకుమించి రాజకీయ నేరస్తులకు ఉరిశిక్షలను విధించడమే ఉచితం కాదు.

రాజకీయంగా ఒకదేశంపట్ల ద్రోహంగా పరిగణించబడేచర్య మరొకదేశంపట్ల భక్తిప్రదర్శనగా పరిగణించవచ్చును, జర్మనీ ఆక్రమణలో వున్న కాలంలో జర్మనులతో సహకారం చేశారనే కారణంగా ఫ్రాన్సు, నార్వే మొదలైనదేశాలలో చాలామంది పైన



'యుద్ధమైపోయింది!'
'నీకూ తెలిసిందే! ఆ సంగతి నీకు చెప్పాలనే ఊరంతా తిరిగాను.'

దేశద్రోహ నేరాలు ఆరోపించి, ఇప్పుడు విచారణలు చేస్తున్నారు. బ్రిటిష్‌ప్రభుత్వంతో సహకారంచేశారనే కారణంగా, మనదేశంలోని ప్రముఖులను మనం నేరస్తులుగా విచారించగలమా!

అంచేత ఒకకాలంలో ఒప్పయినది మరొకకొంతకాలానికితప్పు కావచ్చును; తప్పు, ఒప్పు అనేది కేవలం వర్తమాన దేశాచారాలమీద ఆధారపడివుంటుందని యిదివరకే చెప్పాము. కాబట్టి మనం యీనాడు శిక్షలు - విధించేటప్పుడు ప్రతి నేరాన్నీ పరిశీలించడంలో, శీఘ్రకాలంలోనే ఆ నేరం నేరం కాదని అనుకునే పరిస్థితులు వస్తాయా అని జాగ్రత్తగా పరిశీలించడం అవసరం. ఇక శిక్ష విధించడంలో ఏశిక్ష విధించినప్పటికీ ఒక నిండుప్రాణాన్ని ఆప్రాణి ఎంత దుర్మార్గుడైనా తీసివెయ్యడానికి నిర్ణయించడం మానవులలో వుండవలసిన దయాభావానికి విరుద్ధం.

# కాంగ్రెసు కర్తవ్యం

ఈ రోజున ప్రపంచ రెండవ మహాయుద్ధంలో సన్నిహిత సంబంధమున్న ప్రతిదేశమూ విజయోత్సవాన్ని చేసుకుంటున్నది. కాని భారతదేశంలో ఇంకా ఇల్లు అలకలేదు. మానవప్రకృతికి విరుద్ధంగా భారతీయులలో భేదాభిప్రాయాలు లేకపోయినప్పటికీ, బ్రిటిషువారి చలవవలన, మన తెలివితక్కువవలన భారతీయులలో భేదాభిప్రాయాలు అసహజంగా వర్ధిల్లి, ఈ రోజున భారతీయ సమస్య పీట ముడిపడింది. సిమ్లా సమావేశానంతరం ఇకముందు చెయ్యవలసిన పని ఏమిటి అని ఒక విలేఖరి ప్రశ్నిస్తే నెహ్రూ నాలుగుమార్గాలు సూచించాడు, భారతీయ సమస్య పరిష్కారం కావటానికి: (1) బ్రిటిషువారు భారతదేశాన్ని వదిలిపెట్టి పోవటం (2) పార్టీలు ఏకగ్రీవం కావటం (3) భేదాలు తొలగిపోవటానికి పార్టీని బలపరచటం (4) విప్లవం.—విప్లవం రావటానికి అనుకూలమైన వాతావరణం ఏర్పడుతున్నదని నెహ్రూ అభిప్రాయం.

బ్రిటిషువారు భారతదేశాన్ని వదిలిపోవటం—ఇది వినటానికి శ్రావ్యంగానే వుంటుంది కాని మనం అనుకున్నట్టు జరగదు. బ్రిటిషువారు యుద్ధంలో గెలిచారు. దీని ఫలితం బ్రిటను అధీనంలోవున్న బానిసదేశాలకు వ్యతిరేకంగా వుంటుంది కాని అనుకూలంగా వుండదు.

యుద్ధం ముగిసింది కాబట్టి బ్రిటనుకు కలిగిన సమస్యలు మరోవిధంగా వున్నాయి. అంతర్జాతీయ పేచీలలో బ్రిటిషువారి ఎత్తులు చప్పగావుంటయి. రష్యా, అమెరికా ఎంత గొప్ప వయినయ్యంటే మళ్ళీ జరగబోయే మహాసంగ్రామం (పార్టీలు మారటమే గాని సంగ్రామాలు తప్పవల్లే వుంది) అమెరికా, రష్యాల మధ్యనే జరుగుతుందని పుకారేకాని బ్రిటను గొడవేలేదు. ఇదివరకు యుద్ధం జరిగితే బ్రిటను ఎవరిపక్షం చేరుతుందో అనే దానిమీద నిర్ణయం అయివుంటేది ఫలితం. ఇకనుంచి బ్రిటను ఎటుచేరినా ఒకటే అన్నట్టుగా వుంది. అమెరికనులదీ మాదీవకటే భాష—మాపి రాజుగారినీ వెయ్యి ఆవులు—అని బ్రిటను తృప్తిపడితే చెప్పలేం. ఆసంగతి ఎలావున్నా రష్యా థర్డ్ ఇంటర్నేషనల్ రద్దుచేసినా, రష్యా వక్కటే జర్మనీని గెలిచినా, రష్యాతత్వం ప్రపంచం అంతటా పాతుకుపోయిందనీ, రష్యాతత్వం (రష్యాలో అమలులోనున్నతత్వం) ప్రపంచం అంతటా గెలిచినట్టేననీ మటుకు భావించవచ్చు. చిత్రమేమిటంటే ఇది బ్రిటను ఎన్నికలలోనే బైటపడింది. ఎన్నాళ్ళనించో పాతుకుని ఉన్న టోరీపార్టీ తుడుచుకుపోయింది.

---

✲ కొడవటిగంటి కృష్ణమూర్తి ✲

ఇప్పుడు లేబర్ పార్టీ అధికారంలోకి వచ్చింది కనక పరిస్థితులు ఇంకో విధంగా వుంటయి. చెరుకుశాస్త్రి అన్నట్టు ఈ లేబర్ పార్టీలో మళ్ళీ రెండు రకాలు! టోరీ హృదయం కలిగి (కవి హృదయంవలె) నామ, రూపభేదంగా వున్న శాఖ ఒకటీ, అసలు కచ్చితంగా "లేబర్"కు చెందిన శాఖ ఒకటీ, కలిసివున్న మిశ్రమం ఈ లేబరుపార్టీ. ఈ పార్టీ బ్రిటనులో కొన్ని కొత్త ఏర్పాట్లను చేస్తామని వాగ్దానం చేసింది. అందులో మూలపరిశ్రమల్ని ప్రభుత్వపరంగా చెయ్యటం ఒకటి. పెట్టుబడివర్గం మూలపరిశ్రమలకు కావలిసిన మెషీన్లు మొదలైనవి తక్కువగాచేసి అధికలాభాల్ని తియ్యటం మామూలు. ఇప్పుడు మూలపరిశ్రమల్ని ప్రభుత్వపరంగా చెయ్యటంవలన పరిశ్రమ సామగ్రి ఎక్కువగా తయారయి, విదేశాలకుకూడా ఎగుమతి చెయ్యాలిసి వస్తుంది. ఈ పరిశ్రమ సామగ్రిని వెనకపడివున్న వలసదేశాలు వుపయోగించుకోలేవు—ఆయాదేశాలలో పరిశ్రమాభివృద్ధికి అనుకూలమైన పరిస్థితులు ఏర్పడితే తప్ప. అందువలన లేబర్ పార్టీ బానిస దేశాలలో కొత్తపంథా తొక్కుతుంది. అయితే భారతదేశానికి ఈ పరిశ్రమ సామగ్రి లభించటంవలన మూలపరిశ్రమలు స్థాపింపబడతయి. కాని ఈ మూలపరిశ్రమలు భారతదేశంలోని పెట్టుబడివర్గం సహాయంతోనే స్థాపితం అవుతయి. మూలపరిశ్రమలు ఇంగ్లండులో ప్రభుత్వపరం కావటం, భారతదేశంలో పెట్టుబడివర్గం పరం కావటం ఇందులోవున్న కిటుకు! అదీకాక భారతదేశంలో వున్న పెట్టుబడివర్గంలో ఒకరకం బ్రిటిషు పెట్టుబడితో ఏకీభవించైనా భారతదేశంలో పరిశ్రమాభివృద్ధి చేయటానికి సంసిద్ధంగావుంది. లేబర్ పార్టీవారు కలిసేది ఈ వర్గంతో. దీనివలన భారతదేశానికి తోకపోయి కత్తివచ్చె నన్నట్లవుతుంది.

ఇప్పుడు బ్రిటన్‌లో లేబర్ పార్టీ ప్రభుత్వం వచ్చింది కనక, మన దేశంలో ఆశ ప్రబలంగా వుంది. మాటలవల్ల ప్రయోజనంలేదు క్రియల్లోనే బైటపడాలని అనేకమంది అనుకుంటున్నా, విశేషంగా ముఖ్యనాయకుల దగ్గర్నించీ అదుగో పులి అంటే ఇదిగో తోకనటం ఆచారమైపోయింది. పంజాబులో ఒక గుర్రం బండివాడు లేబరుపార్టీని నమ్ముకుని 'వా[illegible] దగ్గర పెట్టుకో'మని ఒక పోలీసును కొరడాతో వాయించాడు. లేబరుపార్టీ చెయ్యాలిసిన పని ఇంగ్లండులోనే బోలెడువుంది. భారతీయ సమస్య పరిష్కారం చెయ్యటానికి వారికి వ్యవధి లేకపోయినా మనం ఆశ్చర్యపడాలిసిన అవసరంలేదు. ఎన్నికల ఆవేశంలో ఇండియా ఆఫీసు తీసేస్తామని చాటిన లేబర్ పార్టీవారికి ఆపని చెయ్యకుండా ఇతర డొమినియన్లు అడ్డం వచ్చినై—దేముడు వరమిచ్చినా పూజారి ఇయ్యడు. బైటవుండి చెప్పే మాటలు అధికారంలోకి వచ్చింతరువాత అమలులో పెట్టటానికి ఒక్క లేబర్ పార్టీకేగాదు, ఎవరికైనా కష్టమే—దొంగకే తాళం ఇస్తే దొంగతనం ఎలా జరుగుతుంది? ఇండియా ఆఫీసు తీశెయ్యనప్పుడు దానికో శెక్రటరీ ఆఫ్ స్టేట్ ఫర్ ఇండియా కావాలి. ఈ పదవికి అదివరకల్లా అవీ ఇవీ చేస్తాం అన్న ఏ లేబర్ పార్టీ నాయకుడినీ నియమించక పెథిక్ లారెన్స్‌ను నియమించటం ఒక విశేషం. ఈయన అధికారంలో లేనప్పుడే భారతదేశానికి ఏ విధమైన భరవసా ఇయ్యక



యుద్ధం జరుగుతున్న క్షణం వరకూ

పోవటంవలన ఆడి తప్పాడు అనే నిందేరాదు. భార్యను సమానంగా భావించి తన శరీరంలో ఆమెకు సమానభాగం ఇచ్చిన ఈ "అర్ధనారీశ్వరుడు" అంత న్యాయ బుద్ధితోనే భారతదేశాన్ని "చెరిసగం" చేస్తే మనం అనుకోవలసిన పనేలేదు. ఈయన జైలుకు పోయినవాడు కావటంవల్ల కాంగ్రెసుకూ ఈయనకూ బాదరాయణ సంబంధం వుంది. ఇంద్రుడనీ, చంద్రుడనీ భారతదేశం పొగడినా ఈయన మోసపోయేటట్టు కనపడదు.

బ్రిటిషువారికి పట్టుకున్న పెద్దసమస్య ఏమిటంటే వారీదేశాన్ని విడిచిపెట్టి పోతే దేశంలో అరాజకం ప్రబలి, మైనారిటీల హక్కులు మెజారిటీవర్గంవారి చేతుల్లో అడుగంటిపోతై అని ? అందుకని ఏ పార్టీకీ సమ్మతం గాని రాజ్యాంగ విధానం అమలులోకి తేవటానికీ వీల్లేదనీ, మైనారిటీలకు ఇష్టంలేని ఏర్పాట్లు చెయ్యబడవనీ బ్రిటిషువారు మడిగట్టుకుని కూచున్నారు. కాని భావి భారత రాజ్యాంగ విధానానికి మీరంతా ఏకీభవించండి, మీ దేశాన్ని మీకు అప్పగించి పోతామని వారు భరవసా ఇస్తున్నారు. క్రిప్స్ ప్రణాళికను దేశంలో అన్ని పార్టీలూ తిరస్కరించినై. భారతీయ సమస్య ఒక్కసారి పరిష్కారం కాదనీ, అది క్రమేపీ కావలసినదేననీ ప్రధాన మంత్రి అట్లీ వాదన. పక్వానికి వస్తున్న భారతీయ జాతీయత అణచిపెట్టితే అది తీవ్రంగా ఎదురు తిరుగుతుందని లార్డ్ లిస్టొవెల్ భయం. భారతీయులు ఏదో ఒక కనీస ఏర్పాటుకు వస్తే లేబర్‌పార్టీ



యుద్ధం ఆగిన మరుక్షణం

సహాయం చేస్తుందని ఆయన సలహా—ఆ గాన వుంటే ఈ గతి లేదు అందిట ఒకామె! భారతీయపార్టీలు ఏకగ్రీవం కావాలనటం బాగానేవుంది; కాని భారతీయపార్టీలు ఏకం కావటానికి లేబర్ పార్టీ వారేమి చేస్తారు? బ్రిటిషువారు ప్రతిపాదించే ప్రతి ప్రణాళికవల్లా భారతీయులలో చీలికలు ఎక్కువవుతున్నాయి కాని సమస్య పరిష్కారం కావటం లేదు. భారతీయుల సహకారం లేనిది ఏ లేబరుపార్టీ ఏమీ చెయ్యలేదు. బ్రిటిషువారి ప్రణాళికల ఫలితంగా ఈ రోజున భారతీయులు తమలో తాము ఏ విధమైన వొడంబడికా చేసుకునే స్థితిలో లేదు. లేబరుపార్టీ ప్రభుత్వంలోకి వచ్చింతరువాత ఇక తాత్కాలిక ఏర్పాట్లు చేయటం అవసరమనీ, భారతీయ సమస్య ఒక్కసారే శాశ్వతంగా పరిష్కారం చెయ్యటానికి లేబర్ పార్టీ ప్రయత్నం చేస్తుందనీ క్రిప్స్ కొత్త ఆలోచన. లేబర్ పార్టీ ఆలోచనలన్నీ రోగికి పంచభక్ష్య పరమాన్నం పెట్టినట్టు విషతుల్యమయి, భారతీయ సమస్య పరిష్కారం కావటానికి మరి రెండువందల సంవత్సరాలు పట్టినా భారతీయులు ఆశ్చర్యపోవాలసిన పనిలేదు. ఎత్తైన మేడమీదినించి కింద పడుతున్నవాడు కింద పడేవరకూ "ఇంకా ఫర్వాలేదు" అన్నట్టుగా వుంటుంది బ్రిటిషు ప్రభుత్వపు వైఖరి. కాకపోతే వేవెలు ప్రణాళిక ప్రకారం తాత్కాలికంగా ఏర్పాటయ్యే గవర్నమెంటు అసలు రాజ్యాంగ విధానాన్ని అమలులోకి తేవటానికి సహాయపడుతుందన్న అభిప్రాయం ఇంత త్వరలోనే మారిపోవటం దేనికి? రాజాజీ అభి

ప్రాయంకూడా ఇదే. కాబట్టి లేబర్‌పార్టీమీద ఆశపెట్టుకోక భారతీయులు తమలో తామే ఈ సమస్యను పరిష్కారం చెయ్యటానికి మార్గాల్ని వెతకటం వుత్తమం. కాకపోతే లేబర్‌పార్టీ కాంగ్రెసుమీద అంతశ్ తొలగించి, కాంగ్రెసు ఖైదీలను విడుదలచేసి దేశీయుల సానుభూతిని కొంత సంపాదించవచ్చు.


అందుకని నెహ్రూ సూచించిన రెండోమార్గం పార్టీలు ఏకం కావటం. దీనికి అనేక అంతరాయాలున్నా అసాధ్యంమటుకు కాదు.

నెహ్రూ సూచించిన మూడోమార్గమైన 'భేదాలు తొలగిపోవటానికి పార్టీని బలపరచటానికీ, పార్టీలు ఏకగ్రీవం కావటానికి' సంబంధంవుంది. పార్టీని బలపరచటానికి ప్రస్తుతం జైళ్లల్లోఉన్న కాంగ్రెసు ఖైదీలు బైటికివచ్చి వుమ్మడి ప్రయత్నం జరగాలి. సిమ్లా సమావేశానికి పూర్వమే వీరి విడుదలకోసం ఆజాద్, నెహ్రూ మొదలైన ముఖ్యనాయకులు పట్టుపట్టక పోవటానికి కారణం ఈ పట్టుదలను నెపంగాపెట్టుకుని, కాంగ్రెసు సిమ్లా సమావేశాన్ని భగ్నం చెయ్యటానికి ప్రయత్నం చేసిందని ఈషన్మాత్రం నెపంకూడా కలగకుండా వుండటానికే. అయితే సిమ్లా సమావేశం నాటినుంచి కాంగ్రెసు బ్రిటిషువారితో అర్థంలేని సఖ్యత చూపుతున్నది. కాంగ్రెసులో విపరీతమైన మార్పు వచ్చిందనీ, మళ్ళీ కాంగ్రెసు ఎదురుతిరగక పూర్వమే ఇల్లు చక్కపెట్టాలనీ కాంగ్రెసు విమర్శకులే వొప్పుకున్నారు. బ్రిటిషువారి నాటకమే కాంగ్రెసు ఆడదలచుకుంటే ఎవ్వరికీ అభ్యంతరంలేదు. ఎదిరించిన హిరణ్యకశిపుడూ, ధ్యానించిన ప్రహ్లాదుడూ మోక్షాన్ని సాధించినట్టు పురాణాలు ఘోషిస్తున్నై! కాంగ్రెసు ఏపద్ధతి అవలంబించినా ఫరవాలేదు కాని కలగాపులగం కాకుండా వుండటం అవసరం. 1937 వరకూ విప్లవతత్వాన్ని ప్రకటించిన కాంగ్రెసు పదవీ స్వీకరణంచేసి ఇంకోదారి పట్టింది. ఇది నల్లమందులా పనిచేసింది. కార్యదీక్షగల విశ్వామిత్రుడు మేనకను వరించి, తపశ్శక్తిని కోల్పోయినట్లయింది. దిగ్గజాలవంటి కాంగ్రెసునాయకులు మారిపోయినారు.

గమ్యస్థానం చేరకుండా నిద్రపోయిన కుందేలు గతి పట్టింది దేశానికి. అహింసాతత్వం కేవలం ఎలక్షన్లలో ప్రకటించిన వారున్నారు. అహింసాతత్వంలో నూలుపోగంత నమ్మకంలేనివారు ఈ తత్వాన్ని రాజకీయాదర్శంగా పెట్టుకుని మెలుగుతున్నారు. కాంగ్రెసుతత్వం నాయకుల్ని విడిచి దేశంలో ప్రజలకు పాకింది. ఫలితం నాయకుల్లో బలంతగ్గటమూ, ప్రజలలో స్వాతంత్ర్య కాంక్ష ప్రబలం కావటమూ. ఈ స్వాతంత్ర్యకాంక్షను తీర్చేశక్తి కాంగ్రెసుకు లేకుండాపోయింది. ఈ చల్లారని స్వాతంత్ర్యకాంక్ష తీరాలంటే కాంగ్రెసుతో ప్రజలు ఏకీభవించి ప్రయోజనంలేదు—ప్రజలతో కాంగ్రెసు ఏకీభవించాలి!

యుద్ధారంభంలో పదవులలో వుండాలో లేక యుద్ధంమధ్య విప్లవం సాగించాలో నిర్ధారణ చేసుకోలేక, సరియైన కార్యక్రమం లేకుండా విప్లవాన్ని ప్రకటించింది కాంగ్రెసు. నాయకులను జైల్లో పెట్టటంమూలాన, కాంగ్రెసు సంస్థలో విశేష సానుభూతిగల ప్రజాసామాన్యం దేశంకోసం ప్రాణాలు అర్పించినప్పటికీ విప్లవం, జరగకూడని విధంగా జరగటంవలన నిష్ప్రయోజనమయింది. ఇంత కంటె దేశప్రజలు, కాంగ్రెసుయెడల తమకున్న అభిమానాన్ని ఏవిధంగా చూపగలరు? ప్రజలు చేసిన త్యాగం అతీతం. దీనివలన స్వాతంత్ర్యకాంక్ష, పట్టుదల మరింత తీవ్రం అయినప్పటికీ, ప్రజలు విశేషంగా రక్తాన్ని ధారపోశారు. ఈ విషయాన్ని కాంగ్రెసు గుర్తించటం చాలముఖ్యం.

ఇట్టిపరిస్థితులలో నెహ్రూ సూచించిన నాల్గవమార్గం అమలులోకి రావలసి వస్తుంది. విప్లవం కొన్ని పరిస్థితులలోనే వచ్చి, విజయవంతం కాగలదని ప్రపంచ చరిత్రను పట్టిచూస్తే తెలుస్తుంది. భారతదేశంలో ప్రస్తుతం ఆ పరిస్థితులు లేవు. బ్రిటిషువారు ఎప్పుడేది ప్రతిపాదించినా, కుక్కగొడుగులకు మల్లే అనామకమైన బోలెడు పార్టీలు ప్రాతినిధ్యం కావాలని మహజర్లు పెడతై. ఈ పార్టీలకు ఈ షణ్మాత్రం విలువలేక పోయినప్పటికీ, విదేశాలలో వారికి భారతదేశంలోని ఎన్ని పార్టీలు బ్రిటిషువారిమీద ఆధారపడి వున్నయ్యో విదితమవుతుంది. ఈ పరిస్థితులు మారాలంటే కాంగ్రెసు తన పార్టీని బలపరుచుకోవటం తప్ప గత్యంతరం లేదు. ప్రపంచ యుద్ధం అయిపోయింది కాని ఇకనించీ శాంతి సమరం ప్రారంభమవుతుంది. భారతదేశంలో అనేకమందికి నిరుద్యోగ సమస్య కలుగుతుంది. విపరీతమైన ప్రజాశక్తి వివిధమార్గాల్ని పట్టేస్థితి వస్తుంది. కాంగ్రెసు ముందరే జాగ్రత్తపడితే దీన్ని ఏకాభిముఖంగా చెయ్యొచ్చు. భారతదేశ దాస్యవిముక్తి అయినా ప్రజాయుద్ధరూపేణ జరక్కపోతే ప్రయోజనం లేదు. ఇంగ్లండు విప్లవాన్ని శాంతంగానే తేగలిగింది. ఇప్పుడు జరిగిన యుద్ధం భారతదేశానికి సంబంధించినంతవరకూ ప్రజాయుద్ధం అని నమ్మకం లేకపోతే ఇకముందు జరిగే శాంతి సమర్నాన్నైనా ప్రజాయుద్ధంగా చేసే బాధ్యత కాంగ్రెసుమీద వుంది. ఇది చెయ్యటానికి ఇన్ని సంవత్సరాలుగా అతీతమైన త్యాగంచేసి జాతీయతను పెంపొందించిన కాంగ్రెసుకే శక్తివున్నది. భారతీయ సమస్య ఇతరులవల్లెన్నడూ పరిష్కారం కాకూడదని గుర్తించి, భారతీయులవల్లనే అది సాధ్యం అవుతుందని గమనించి, దానికి తగిన సాధనసంపత్తి సమకూర్చితేగాని, భారతదేశానికి నఖశిఖపర్యంతమూ మంగళస్నానమయి, వివిధరాక్షస రూపాలతోవున్న అన్ని సమస్యలూ ఒక్కసారిగా పరిష్కారం కావు! అంతేకాని దేశంలో ప్రజాయుద్ధానికి బదులు పార్టీ నాయకుల యుద్ధము జరిగేటట్టయితే మటుకు భారతీయ సమస్య పరిష్కారం కాదు!




## ప్రథమ దశ

అందంగా, మధురస ని
ష్యందంగా, పఠితృహృదయ సంస్పందంగా
కందాలొక కంద రచిం
చిందికి మనసయ్యెనాకు సిరిసిరి మువ్వా!

"ఏవేనా కొత్తవి రా
శావా? చూపించు" మంచు చంపేవాళ్ళం
తా వినడానికి నేనీ
జీవత్కృతి నాలపింతు సిరిసిరి మువ్వా!

పెసలో, బొబ్బర్లో, వే
రుసెనగలో విక్రయించి రూపాయలు బొ
క్కసమున కెక్కించడమా
సిసలైన కవిత్వరచన? సిరిసిరిమువ్వా!

"పందిని చంపినవాడే
కందం రాయా" లటన్న కవి సూక్తికి నా
చందాయిస్తానా? రా
సేందుకయో షరతులేల? సిరిసిరి మువ్వా

కుర్చీలు విరిగిపోతే
కూర్చోడం మాననట్లు గొప్పరచనలన్
కూర్చేశక్తి నశిస్తే
చేర్పడను నాకింతచెత్త, సిరిసిరి మువ్వా!

మళ్ళీ ఇన్నాళ్ళకి ఇ
న్నేళ్ళకి పద్యాలురాయు టిదియెట్లన్నన్
పళ్ళూడిన ముసిలిది కు
చ్చిళ్ళన్ సవరించినట్లు, సిరిసిరి మువ్వా!

ఖగరాట్ కృషి ఫలితంగా
పొగాకు భూలోకమందు పుట్టెను, కానీ
పొగచుట్ట లెన్నియైనను
సిగరెట్టుకు సాటిరావు సిరిసిరిమువ్వా!

ఏంలాభం? పెరిగిన గ
డ్డంలా, దట్టంపు కారడవిలా మనదే
శంలో వ్యాపించిన ము
స్లింలీగును చూడరాదె; సిరిసిరి మువ్వా!

ఎప్పుడుపడితే అప్పుడు
కప్పెడుకాఫీ నొసంగగలిగిన సుజనుల్
చొప్పడిన యూరనుండుము
చొప్పడకున్నట్టియూరు చొరకుము మువ్వా!

ఆవురా! శ్రీరంగం శ్రీ
నివాసరావూ! బలేమనిషివే! ఇక నీ
కవితావాద్యం చాలిం
చి వెళ్ళిపొమ్మనకు నన్ను -సిరిసిరి మువ్వా!

శ్రీరంగం శ్రీనివాసరావు

# ఉమర్ ఖయ్యాం

మేనుననున్న ప్రాణమిను మిక్కిలిగా సుఖియించె చైత్రశే
షానిలుతోడి యీ పరిచయమ్మున జీవితశేషమందునఁ
జానరా ! ప్రొద్దు పశ్చిమదిశాముఖమైనటు తోటమట్టుకుఁ
మానసమేనియుఁ మరలె మారునిటుల్ మనదేహధర్మముల్.

ఆ నెలబాలు డాకసమునందలి మబ్బులతోడ నాడగా
ఖూనుటదేమిచూచెదవు బొట్టుమధుద్రవమానిచూడు మీ
మానిని ! యెట్టులఁ నిదుర మబ్బుపయిఁ గనుపాపలాడునో
యేనిముసానకానిముస మీహృదయమ్ము నవత్వమొందగన్.

నియతియెలేనిజీవికను నిద్దురతోనొక కొంతకాలముఁ
క్షయమొనరించుకొన్నయది చాలునులే;యికనైన ఈ రసా
శ్రయమున మేలుకొంచు నిదురఁ నిదురించుచు మేలుకొంటలో
పయనమొనర్త మన్యమగు పట్టనియట్టి మహాపథమ్ములఁ.

వ్రేలకిహమ్ముబట్టుకొని వ్రేలిడుకోక పరమ్ముకోస మె
వ్వేళను నోటిలోపలను విచ్చెడుపుష్పమునందు వేడ్కయుఁ
రాలెడిపూవునఁ గనికరమ్మును నీకిడుచున్నదేదొ త
న్మూలము మాత్రమేగొనుము ముద్దియ రుచ్యమగుఁ సమస్తమున్.

ఈ వరుదెంచు సవ్వడియె యెక్కుడుగాగ గరంచెడిఁ ననుఁ
నీ వచనమ్ముకన్న చెలి ! నీవనునట్టిదినాకు వ్యక్తమై
పోవగ లోని పొంగణగి పోవును వ్యక్తముగాకయుంట నే
దైవమునైతమింత మవంతఁ పురికొల్పెడి నేమొచూడగన్.

నీ సరసానులాప రమణీయత నీవునెఱుంగకుండనే
దూసుకపోవునే యెచటెదో యదియెయ్యెడకుం బ్రయాణమో
నాసకి ! నమ్మజాల చలనంబనిలేకయెయిట్లు గారడీ
వేసము వేయుచున్నదియొ వెళ్లుచునున్నటు వచ్చుచున్నటుల్.

---

మాధవపెద్ది బుచ్చి సుందరరామశాస్త్రి



# మిలన్

★

కోమలీనై జవుగులజ్జ కొంతసేపు
ఆమె సంకోచపడి యిట్టులనియె—"అవును
గాని పయనమ్ము తప్పదయేని, తోడ
దీసికొనిపొండు మీపదదాసి గూడ,—
నిలువజాలదు హృదయేశ నీదుచరణ
కణపునీత ధరాతలిగాని - మనగ
లేదు నీచిరసంగిని, నీదయావి
నిర్మితోపగూహనదుర్గ నిలయమందు
దక్క; అభిసరించును నీపదాలనంటి,
తోడవెన్నాడివచ్చు నీ నీడవోలె;
ప్రియతమా! నీవు నన్నిట విడిచిపుచ్చి
చనినచో నేను ఆ మరుక్షణమునందె
అసువులను బాయుదాన - ఏ విసమొ అని."
"దేవి! వినవేవి నా యుపదేశమీవు
పురుషవేషమ్ము ధరియించు. పోదమింక
వదలిపెట్టుము లజ్జయు భయము, బెరుకు,
తరుణివంచును అందాల బరిణవంచు
మరచిపో. సౌకుమార్యమ్ము మరచిపొమ్ము.
శత్రుపదతాడితంబైన జన్మభూమి
నుద్ధరింతము నడువుము యుద్ధభువికి
మానవులమై జనించిన మనము మనుజ

రామనరేష్ త్రిపాఠి

వారసత్వమ్ము లేటికి వదలవలయు ?"
అనెడు యువకునిమాటలు వినినయువతి
అంతరంగాన తనవాంఛితార్థమబ్బి
నందువలన కాబోలు - ఆనందవీచు
లల్లుకొనియెను - శుభ్రాణే నాన బొంగి
పుష్పభారావనత లతవోలె క్రుంగి
పతి దృఢాలింగనమునుండి వైదొలంగి
చెంగుమనిదూకె లోచనజిత కురంగి.—
పిఱుదులను దాటి మడమల మెరయు కురుల
మగనివలె కత్తిరించి యా మగువ మిన్న.
కాసె బిగియించి యంగరఖా ధరించి
కోర తలపాగ చుంగులు వారజుట్టి
వీర నారి పదారేండ్ల వీరుడయ్యె.
ఆత్మ వేషమ్ము దర్పణ మందుగాంచి
గురుతుబట్టగలేక అచ్చెరువు నందె;
శారదోపమ వదనాంబుజమ్మునందు
వెల్లి విరిసెను పొన్నారి పిన్న నవ్వు.
నవ్వు తొలుకాడ గజగమనమ్ముతోడ
దరియుచుండిన ఆ తలోదరిని చూచి
యువకు డెల నవ్వు మోమున నొలుక ననియె:
"కోమలీ నిన్ను గాంచి ముగ్ధుండనైతి
గాని నీ లోక సమ్మోహకమ్మలైన
కనుల సోయగమును దాచ గలవె నీవు;
మెరుపులను బోలి మిలమిల మెరయుచుండి
నీ రహస్యమ్ము వెలివెట్టి నిన్నుపట్టి
యిచ్చు సుమి నేర్పరికి; జాల మేల సకియ
పదవె పోదము దూర ప్రపంచమునకు.
ఈ మనోహర కానన సీమ సొంపు
మనసులో పెట్టుకొను, చెలీ! మాతవోలె

మనల సుఖపెట్టినట్టి యీ మధురపర్ణ
శాల విడి పోక తప్పదు. ఈ లతాని
కుంజముల పశు పక్షుల గూడి మరల
ఎపుడు విహరింతుయో యేమొ ? ఎవరు పలుక
గల"రటంచు నాతడు రుద్ధగళము, సజల
నయన యుగళముతోడ మౌనమ్ము దాల్చె.
విజయ అనియె "ప్రాణాధిక ప్రియుడ ! మనము
ఈ విపినసీమ విడచి పోయెద మటంచు
తలచినపుడెల్ల నా మది కలగిపోవు.
ఈ లతా వితానము లీ నికుంజ
తలములను వీడ మనము కొందలము నెందు.
ఆ సుదూర ప్రపంచమునందు వింత
కంటె నత్యంత శాంతి సౌఖ్యములు కలవొ.
అచటి మానవ హృదయమ్ము లందు ధన్య
సఖుల మరపించ జాలు సౌజన్య మహిమ
ఎసగునో యేమొ; దాని నే నింతవరకు
చూడగా నైన లేదు; ఈ సుందరాతి
సుందర లతా గృహమ్ములే మందిరాలు
నాకు ప్రాణేశ. కొంద రా లోకచరిత
పలుకగా విందు, నచటి జీవనము విషమ
మంచు నచ్చోటివారు దయా విహీను
లంచు కపటాత్ములంచుమీ రా ప్రపంచ
మునకు బోవగ తహతహ బొందనేల.
ఆత్మనాథుని యాజ్ఞను అనుసరించు
టతివ ధర్మంబు మీ దారి ననుగమింతు
నైన ఈ వనరామణీయకతముందు
దాని యందమ్ము నరక సమానమేమొ !"
"వలదు ప్రియురాల ! నీ'వటు పలుకవలదు
నరుని విలువ నా చోటనే యెరుగవలయు.

శ్రీవరుని సేవ మానవ సేవ యనుచు
పదము లవి రెండు గాని తాత్పర్యమొండు
అడవిలో నుండి మానవార్హమ్ములైన
పనుల జేయగ వశమె ! ప్రపంచసీమ
జేరి; శ్రమ కోర్చి, శక్తిని ధారపోసి
శాంతి సౌఖ్యాలు నెలకొల్ప జాలు గుణమె
మానవత్వము; దానికి మారు పేరె
ఈశ్వరుని సేవ; యీ బాల్య హితులమీద
వన్యజీవులపై ప్రేమ వదలుకొనుము.
ఈ వియోగమ్ము మనము సహించి తీర
వలయు"నని క్రొత్త యందమ్ము చిలుకు భూరు
హమ్ముల కవుంగిలించి, విహంగములను
హరిణశాబకములను కన్నారచూసి
మమతదివిచి ఆనంద కుమారు డపుడు
విపినమును వీడె విజయ వెన్వెంట నడువ
విపిన వీధుల వెంట నా వీర దంప
తులు గమించిరి మెలమెల్ల ఆలవికాని
వారి యెడబాటు నోర్వని వన కుమారి
పిలిచెనో వారి ఒకమారు వెనుకదిరిగి
గాంచి నిట్టూర్చి వనమును గడచిచనిరి.
జారె రాతిరి; చెంగావి చీరెగట్టి
వచ్చిన దుషస్సు. నది చేర వచ్చినారు
ప్రణయి యుగళము తటతరుబద్ధనౌక
కట్టు వదలించి నీటను నెట్టి యెక్కి
నడుపసాగిరి జయజయ నాద మెసగ.
నట్టనడి యేరు చేరుకొన్నారు వారు.
ఆ యగాధ నీల ప్రవాహమ్ములోన
నడచుచున్నది పడవ; ఉన్నట్టులుండి
ప్రకృతి శాంతమ్ము వదలి క్షోభమ్ము జెందె:
అలిక నేత్రుడు సలుపునో విలయనటన

వ్యోమవారి వనమ్ము లుబ్బాగిపోయె;
క్షణములోపల కాటుక కారుమొయిలు
గప్పె దిశలను కటిక చీకటులు గ్రమ్మె;
తాల వృక్షాలు కంపించి నేల గూల;
విషమ విక్షిప్త పవనమ్ము విక్రమించె;
ఆకసము చిల్లి వడినట్టు అంతులేక
కుండపోతగ జడి వాన కురియసాగె
పొంగిపొరలెత్తి తుంగ తరంగపాళి
పగలు డీకొనినట్టు లా పడవగవిసె.
ఎడతెగని గాలి వాన, నట్టేటిలోన
జిక్కుకొని దరిజేరెదు దిక్కుగనక
పడవ తల్క్రిందు లవుచుండె పట్టుతప్పి
అప్పుడో యిప్పుడో మున్గునట్లు తోచె,
అర్ధ జల మగ్న తరణిలో నద్రిధీర
వీర దంపతు లిక నదీ తీరమునకు
చేర లేమని ఎంచికొన్నా రగాధ
జలధి వాసమ్ము నిజ మని తలచినారు:
అతి భయంకర ప్రకృతి లక్ష్యమ్ము చేసి
సన్నగా పల్కె పతి "నమాసన్నమయ్యె
సుమ్ము ప్రియురాల! దేహ పాతమ్ము మనకు;
క్షణములో రాలి పోవు నీ తనువు విడువ
వ్యసనపడరాదు; జాగృతి స్వప్నములకు
భేదమెంతో జీవన మృతి భేద మంతె.
నా విచార మి దొక్కటే, నాదు తనువు
జన్మ భూ సేవ కర్పించి సంతసింప
గోరుచుంటిని; అది నెరవేరలేదు.
రమ్ము ప్రాణేశ్వరీ! చేరరమ్ము; బిగ్గ
కౌగిలించుము; ఆశలు ప్రోగుచేసి
ఆత్మలను దేహముల రెంటి నంటుగట్టి
అతల జల శయనమ్ముపై హాయిమీర

పరవసింతము రమ్మ ఇద్దరము గలసి!"
"నీవె నా భాగ్యమూర్తివి. నీదుతోడి
లోకమే స్వర్గ"మంచు నాలోలనయన
మందహాసమ్ముతో బాహు మాల లతని
మూపుల నలంకరించి, కెమ్మోవియాని,
కనుల మూయక నెమ్మోము గాంచి కొంత
తడవు. అరమోడ్పుగన్నుల దయితుమూర్తి
మనసులో బాదుకొలిపి సంస్మరణచేసి
మరల కన్దోయి మూసె నిర్భరతదోప.
అమర శాంతి విభూషితులైనవారి
జీవ నౌకలతో వారి నావకూడ
ముంచుకొని వచ్చు వరదల ముంపులోన
కలసిపోయెను; తరగ లేకమయి పారె.
ప్రకృతి శాంతించె, జడివాన వడి నశించె
కారు మబ్బులు వెలవెలవారి పరచె.
మోద మామోదమును పొంగి పొరలె, సకల
జీవరాసుల మానస సీమలందు.
సూర్యభగవాను డుదయించు శుభముహూర్త
మరుగు దెంచిన దని యెంచి సురలు గగన
వీథిలో దీపముల మల్పివేసినారు
బాల భానుని కిరణాలు పయికిలేచె.
దాలిచెను కెంపు బొట్టు ప్రాక్ తరుణినొసట
క్షణముక్రిందట నట్టేట మునిగినట్టి
వీర దంపతు లే మయినారొ యేమొ!
వరద తీసిన దెప్పటివలెనె యేరు
శాంతముగ పారుచున్నదే జాడగన్న
పడవయును గాని లోనున్న ప్రణయియుగము
గాని కనరారు. ఎంతటి కటికగుండె
లైన నీరయిపోవాకో, అపుడె విరియు
కలువపూవులు కలగి మొగాలు ముడిచె
సుమనసులు పరబాధలు చూడగలరె!

—సశేషం.

# లస్సీ విప్లవం

## సోమంచి యజ్ఞన్నశాస్త్రి

"ల్రి" నగరం—అంతర్జాతీయ విప్లవ పార్టీ అఖిల భారత సమావేశానికొచ్చిన కామ్రేడు సభ్యులతో కిటకిటలాడింది. సమావేశానంతరం ఆంధ్రదేశంలో విప్లవం చెలరేగించడానికిగాను సత్యనారాయణా, వెంకన్నా, నేనూ దీనికి సభ్యులుగా హాజరయాము. నాకూ వెంకన్నకీ మా సత్యనారాయణ మనీపర్సు.

సత్యనారాయణకి ఎందుకో ఈ లోకాన్ని బాగుచెయ్యాలని దుగ్ధ. అతి సున్నితమయిన మనిషి. ఎవరి కష్టమూ చూసి ఓర్చుకో లేకపోయేవాడు చిన్నప్పుడుకూడాను. ఎవరో, ఎప్పుడో ఉపదేశించారు వాడిచెవుల్లో, ఈ కష్టాలన్నిటికీ కారణం వర్గవిభేధాలనీ, అవిపోతేనే గాని ఏ కష్టమూ పోదనీ. అంచేత వాడు విప్లవకారుడై కూచున్నాడు.

నా కేమో ఫలానివి కావాలని గట్టి కోరిక లేమీ వుండేవికావు ఎప్పుడూను. హంసతూలికాతల్పంమీద శయనించాను; కటికినేలనీ నడుం వాల్చాను—అయ్యో అని ఒక్కపద్యమయినా చదివే నాధుడు లేకపోడంవల్ల! అలాటి నన్ను ఏదో లోకమంతా తల్లకిందులుచేసి, భూలోక స్వర్గం స్థాపించడానికి గొంతుకబద్ధలయే "నినాదాలిచ్చి" పాటుపడాలంటాడు మా సత్యనారాయణ. సత్యనారాయణంటే నాకు ప్రాణం. అంచేత ఈ విప్లవాలు నా కర్థంకాకపోయినా, వాడిమీద ప్రేమ కొద్దీ వాడితో నేనూవొచ్చాను, "విప్లవం వర్ధిల్లుగాక" అని అరుచుకుంటూ.

వెంకన్న నిమ్నజాతుడు. వాడిదివరకు యుగయుగాలనించీ జరిగిన అన్యాయాలన్నిటికీగాను అగ్ర జాతుల్నందరినీ తనివితీరా తిడుతూ వొచ్చేవాడు. అగ్రజాతులన్నా ధనికవర్గాలన్నా వాడికి నఖశిఖపర్యంతం మంట. వీలైతే అందరినీ నంజుకు తినెయ్యా లన్నంత కక్ష! అది వీల్లేదుకనక, వీలైనంత లాగెయ్యాలని దీక్షకాబోలు! ఎప్పుడూ సిగరెట్లు కొనుక్కోడానికి ఓరూపాయి తక్కు వడిగే వాడుకాదు. ఎప్పుడైనా చిల్లర లేదు తరవాత ఇస్తానన్నాడనుకోండి సత్యం, వెంటనే అగ్రజాతుల్నీ, ధనికవర్గాలనీ తిట్టడం ప్రారంభించేవాడు వెంకన్న. విప్లవంరాగానే, అధికారమంతా నిమ్న జాతుల కొచ్చేస్తే, వాళ్లు అగ్రజాతులై పోయి, ఇప్పటి అగ్రజాతుల్ని నిమ్న జాతులు చేసిపారెయ్యాలంటాడు. ఇప్పటి నిమ్నజాతులు "తాత్కాలికంగా" కొన్నాళ్లు అగ్రజాతులయి అధికారం చలాయిస్తేనేకాని విప్లవం పూర్తికాదుట!

జాతి మత వివక్షలూ, వర్గభేదాలూ నశిం చడానికి ఇదే మార్గం అట. వెంకన్న మా ముఠాలో ఛేరడంవల్ల విప్లవం ఖరీదు ఇప్పటికే పెరిగి పోయింది. విప్లవం కావాలని అందరం ఒక్కమాటు అనేసు కుని త్వరగా ఇళ్లకు చేరుకుంటేనే గాని మాట దక్కేటట్టులేదు మాకు!

మాకు విడిదికిచ్చిన గదిలో ఆంధ్ర కామ్రేడ్సుకి ముగ్గురికే కాక, బెంగాలీ కామ్రేడ్ సచ్చిదానంద చటర్జీకి కూడా ఆశ్రయ మిచ్చారు. మమ్మల్ని ఒక్కొ క్కర్ని ఆయనకి పరిచయం చెయ్యగానే విప్లవాభివందనం ఒకటి పారేసి, "విప్లవం వర్ధిల్లుగాక" అని ఇంటికప్పెగిరి పోయేలాగు ఆయన అరిచాడు. విప్లవం ఆ అదుటికి ఉలిక్కిపడేలాగ!

కామ్రేడ్ సచ్చిదానందచటర్జీకి భగవం తుడు ఎక్కడలేని ఉత్సాహమూ, ఉద్రేక మూ యిచ్చాడు. మెళుకువగాఉన్నప్పుడు సాధారణంగా అతని నో రూరుకోదు. మెళుకువగా వుండని సమయం చాలా తక్కువ; లోకంలో విప్లవపార్టీ ఎందు కవసరమో, విప్లవం ఎలావొచ్చితీరాలో ఎందు కొచ్చి తీరుతుందో, చెప్పడం ప్రారంభించాడు మాకు వెంటనే, చెన్న పట్టణంబీచిలోఉపన్యాసాలిచ్చే జాజిపెట్టె నాయకులంత పెద్ద గొంతుకతోటీ, ధాటీ తోటీని. మాకు రైలు ప్రయాణంవల్ల మూడు రోజుల్నించీ నిద్దర్లేదు. కళ్లు మూరుకుపోతున్నాయి. విప్లవం ఎందుకు అవసరమో చెబుతా నంటాడు చటర్జీ. "ఇప్పటి పరిస్థితులు ఆలోచించండి. విప్లవం కొద్దిరోజుల్లో రాక తప్పదు" అని ప్రారంభించాడు చటర్జీ. "అవును. తప్పదు..కొద్దిరోజుల్లో వొచ్చితీరుతుంది. అప్పటికి కాస్త తయారు తిని వుండాలి మన మందరమూను. అంచేత కొంచెం నిద్దరోనియ్యవయ్యా బాబూ" అని బతి మాలుకున్నాను నేను. వింటేనా? ఒకటే లెక్చరు. పక్కకి తిరిగి పడుకున్నాను. గదిలో ఉక్కబోస్తోంది. బైట హోరు మని గాలి ఏం చెయ్యడానికీ తోచక నిద్దరట్టడంలేదు వాడికి. చెవుల్లో చేరి, విప్లవంకావాలంటాడు చటర్జీ! వెంకన్న గుఱ్ఱుపట్టి నిద్ర!! నాకు కునుకట్టే సరికి భళ్లున తెల్లారింది.

పొద్దున్న తొమ్మిదిగంటలకి సమా వేశం ప్రారంభం, అంచేత నిద్దరకళ్ల తోనే లేచి పోయి మొహం కడుక్కు న్నాం. విప్లవ ముహూర్తం దాటిపో కుండా అందుకోవా లని.

"ఎక్కడన్నా టిఫిను తీసుక వెళదా" మన్నాడు వెంకన్న. ముందు పనులు ముందుకానిస్తేనేకాని వాడు అడుగెట్టడు, ఎంత ప్రమాదమొచ్చినా! "టిఫినికి వేళ లేదు, సమావేశానికి టైము దాటిపోతుం దన్నాడు చటర్జీ. "మరేం దాటదు. టిఫిను తినే వెళ్లా" లన్నాడు వెంకన్న. వాడు నిమ్నజాతుడు. యుగ యుగాల నించీ వాళ్లజాతి అణగారిపోయింది. వాడిని ధిక్కరించి ముందుకి సాగడానికి చటర్జీకీ చొరవలేకపోయింది! మాకూ, టిఫిను కాకపోయినా, ఏదైనా ద్రవపదార్థమయినా పడాలిగా. అంచేత, ముభావంగా వూరు కున్నాం. కాఫీ తాగి పోదాం రండి అన్నాడు సత్యనారాయణ చివరికి. సరిగ్గా వేళకి వెళ్ళవలసిన ఆవశ్యకతని గురించి చటర్జీ ఉపన్యాస మిచ్చుకుంటూ వెనక

రాగా మే మందరమూ కాఫ్యాదులకోసం బయలుదేరాం.

సత్యనారాయణ కాఫీయేగాని మరేమీ తాగడు. అసలువాడు దేంట్లోనూ గడుపు కోలేడు. అన్నీ యింటిదగ్గర జరిగినట్టు జరగాలని వాడి కోరిక. జరక్కపోతే, అల్లరిచెయ్యక నోరు మూసుకున్నా!

ఆ వూళ్లో ఎవరూ కాఫీ ఎప్పుడూ తాగినట్టు లేదు. ఎక్కడడిగినా కాఫీ లేదన్నవారే. ఓ మిఠాయిదుకాణం దగ్గిర అకస్మాత్తుగా ఆగిపోయాడు చటర్జీ, ఇక్కడ ఏదో ఒకటి తినేసి వెళదామని పట్టుపట్టాడు—కాఫీకోసం వెతకడంలో ఓగంట అప్పుడే గడిచిపోయింది కనక, మిఠాయికొట్టులో తెలుగువాళ్లు, పొద్దున్న తినేందు కే ముంది కనక! మిఠాయి పంచదార బూందీ, బర్ఫీ, జిలేబీ, రొస గుల్లాలూను! సాయంత్రంగాని కారపు వస్తువు లేమీ చెయ్యడుట వాడు.

రొసగుల్లాల్ని చూసినతరవాత అసలే కదలనన్నాడు చటర్జీ. సమావేశానికి తొందరయి పోతోం దని ఆ ర కా లు రొసగుల్లాలు కొనుక్కొని, గుటుకుగుటుక్కని మింగేశాడు. పొద్దున్నే తీపి ఎలా తినమంటావయ్యా అంటూ, పక్క కూరలదుకాణంలో పచ్చి మిరపకాయ లుండటం కనిపెట్టి, ఓ అర్ధణాపెట్టి అవి కొనుక్కొచ్చి, జిలేబీ, బూందీలు కొని, అవన్నీ తాపీగా పచ్చిమిరపకాయ నంజుడుతో తినడం ప్రారంభించాడు వెంకన్న.

చటర్జీ తినేసి, మంచినీళ్లు తాగేసి, త్రేన్చేసి, అందర్నీ మళ్లీ తొందరపెట్టడం ప్రారంభించాడు. వెంకన్న ఇంకా ఆరంభంలో వున్నాడు, నాకూ, సత్యానికీ ఇంకా గొంతుకల్లో ఏమీ పడనేలేదు.

చటర్జీ సతాయింపు ఎక్కువయిపోయింది. డబ్బెట్టిన సత్యానికి కాఫీ దొరికి కడుపు చల్లబడకముందే! ఇంక కాఫీకోసం చూసి లాభంలే దని, షాపువాణ్ణి టీ లాటివేమయినా దొరుకుతాయా అనిఅడిగాము. లస్సీదొరుకుతుందన్నాడు దుకాణదారుడు. "లస్సీ" అంటే మన "చల్లే"నని తెలుసుకుని వెంకన్న, ఏమీ లేనిదానికంటె నయం కనక, ఏదోఒకటి తెమ్మని, లస్సీ అంచుకున్నాడు వెంకన్న. ఎలాగా ఆలిశ్యమయింది కనక, మమ్మల్ని తిడుతూనే చటర్జీకూడా ఓగ్లాసు లస్సీ పుచ్చుకుని ఒక్కగుక్కలో పీల్చేశాడు. నాకూ ఏదో ఒకటి కడుపులో పడాలి. చూసిచూసి జిలేబీ తిన్లేకపోయాను. నాకూ ఆ లస్సీ యేదో యిమ్మన్నాను.

సత్యం ఒక్కడూ మిగిలిపోయాడు ఏమీ పుచ్చుకోకుండా. పరగడుపున మజ్జిగ తాగడమేమిటంటాడు. దానిమీద చటర్జీకీ సత్యానికీ పెద్దదెబ్బలాట? పరగడుపున మజ్జితాగకూడదని శాసించింది సత్యం నాయనమ్మకాని, మార్క్సుకాదు: మార్క్సు సిద్ధాంతాల్నికాక, నాయనమ్మ సిద్ధాంతాలు అనుసరిస్తున్నావని చటర్జీ సత్యాన్ని తిట్టాడు లస్సీ తాగా లని కామ్రేడ్సుఅందరూ నిర్ణయించినతరవాత కూడా లస్సీ తాగకుండా వుండడమేకాక తాగడం మంచిదికాదని ఇంకా వాదిస్తున్నావుకనక "ట్రాట్స్కయిట్"వన్నాడు. పార్టీ డిసిప్లిన్‌కి కట్టుబడని రెనగేడ్ వన్నాడు.

"మా ఆంధ్రులకి పొద్దున్నే పరగడుపున మజ్జిగ తాగడం అలవాటు లేదు" అన్నాడు సత్యం.



"ఈ లోకంలో ధనికులూ, బీదలూ అని రెండే విభేధాలు. ఆంధ్రులూ గీంధ్రులూ అనే విభేధాలు లేవు. ధనిక, బీద విభేధాలు నశింపచెయ్యడానికే మనం పాటుపడుతున్నాం'' అని చటర్జీ ఉరిమాడు.

చివరికి, నిజమైన విప్లవకారు డౌనా కాదా అన్న నిర్ణయానికి "లస్సీ"తాగడం 'పరీక్ష' అయిపోయింది! విభేధాలన్నీ నశించాలి. అందరూ లస్సీ తాగాలని చటర్జీ లెక్చరు !!


ఈ విభేధాలు నశించవు. ఆమాత్రం రుచుల్లో సాంప్రదాయాల్లో విభేధాలుండకేం చేస్తాయని సత్యం.

నువ్వు "విప్లవవాదివి కావు. వొట్టి పెట్టీబూర్జువావి" అని చటర్జీ తీర్పు చెప్పేశాడు !! ముష్ఠి యుద్ధం కష్టంమీద తప్పించాం.

సత్యంలో, ఈ లస్సీ విప్లవం తెచ్చిపెట్టింది. విభేధా లన్నీ నశించా లన్న "నినాదం" మంచిదా అని తర్కించుకోడం ప్రారంభించాడు. దేశ కాలమాన పరిస్థితులకి అనుగుణంగా విప్లవం రావాలంటే, బాగుంటుందేమో అనుకున్నాడు.

"అందుకు అప్పుడే ఓపార్టీ ఏర్పడిపోయింది, దానికి వేరే ఓ గొప్ప నాయకుడూ ఉన్నాడు" అని ఎవరో వాడికి చెప్పారు.

" అలాగా " అని సత్యం, వెళ్ళి అమాంతంగా ఆ పార్టీలో చేరిపోయాడు,



మా కొత్తకాపురపు పోట్లాటలు చూస్తే, "సంసారం సాగరం" అన్న మాటల్లో నిజం లేకపోలేదని అని పిస్తుంది. రోజూ పార్వతి నేను ఎందుకో ఒకందుకు కనీసం పదిసార్లు అయినా పోట్లాడుకుంటూనే వుంటాం. తీరా విచారిస్తే "ఈదబోతే నీళ్ళు లేనట్లు" విషయం మాత్రం కనబడదు.

ఒకరోజు ఆఫీసునుంచి వస్తూవుంటే మూర్తి కలిశాడు. కాసేపు మాట్లాడి వాణ్ణి పంపించి యింటి ముఖం పట్టాను. గుమ్మం దగ్గరే పార్వతి ప్రత్యక్షమయి, "సినిమాకు తీసుకువెళ్తా నన్నా పెద్దమనుష్యులుకాదూ? లేనిపోని ఆశ ఎందుకు పెట్టాలి చెప్పండి? టైము తప్పించి యిప్పుడా రావటం?" అని యీసడింపుగా చూచింది.

ఆమె చూపు "ఎలక్ట్రిక్" షాక్ లాగ తగిలింది. ఆమె నిర్లక్షత కోపం తెప్పించింది. మామూలు ప్రకారం కాసేపు పోట్లాటకూడ జరిగింది. "ఇంటిలోని పోరు యింతింత కాదయా!" అన్నట్లు వుంది నా పని. ఈ బాధ తొలిగేందుకు యేదైనా సూత్రాలు వ్రాశాడా అని "వాత్సయన కామ సూత్రాలు" తీసి చదివాను. ఏవేవో వున్నై కాని మాకేం వుపయోగించేలాగ కనుపించలేదు. గత్యంతరంలేక రోజులట్లాగే గడుపుతున్నాను.

* * *

వేసవి శలవలకు పార్వతిని తీసుకుని అమ్మమ్మగారింటికి వెళ్లాను. అమ్మమ్మ తాతయ్య—వాళ్ళ దంపతీ నిష్ఠ, ప్రేమ చూస్తే ఆశ్చర్యం కలిగించింది. ఇన్ని సంవత్సరాలైనా వాళ్ళల్లో విరక్తిగాని మామూదిరిగా చీటికి మాటికి పేచీలు పడటంగాని వాళ్ళ మధ్య కనుపించలేదు. వాళ్లల్లో పోట్లాట లెందుకు రావటంలేదో గ్రహించటం బహు కష్టంగా వుండేది. ఒకర్నొకరు దెప్పుకోవటంగాని అగౌరవంగా చూసుకోవటంగాని వాళ్లకు చేతనైనట్టుగా నాకు తోచలేదు. అయితే వేళాకోళాలకేమన్నా తక్కువా అంటే యిద్దరూ కూడ, "వయసు చచ్చినా వయ్యారం చావలేదన్నట్లు"గా మాట్లాడుకుంటుంటారు.

ఆరోజు అమ్మమ్మ బజారు సరుకులు కావలసినవి చెప్తున్నది. తాత పట్టీవ్రాస్తూ, "అమ్మీ! (యిది అమ్మమ్మను తాత ముద్దుగా పిలిచే పేరు) వాసన నూనె దేనికే?'' అన్నాడు.

"అదేమిటండి! ఈ ఖర్చు యిదివర కెప్పుడూ తగల్లేదనా ఆలోచిస్తున్నారు? ఈకాలపు అమ్మాయిలు మాలాగ ఖర్జూరాలువేసి కాచిననూనె వాడుకుంటారా?" అన్నది.



తాత చిరునవ్వు నవ్వి వూరుకున్నాడు. నిజం చెప్పాల్సివస్తే యీ సంభాషణే నాకు, పార్వతికి జరిగివుంటే కనీసం ఒకగంటైనా పోట్లాడుకోకుండా వుండేవాళ్లంకాము.


మరొకరోజు చాల ప్రొద్దు పోయింది. బంధువొకాయన వచ్చాడు. తాత కాళ్ళకు నీళ్ళిచ్చి కుశలప్రశ్నలువేశాడు. అమ్మమ్మ వంటింట్లోకివెళ్లి తన పని ప్రారంభించింది. ఆయనా నేనూ మాటల్లోకిదిగటం చూచి, తాత గబగబావెళ్లి కూరలుతరిగి, నీళ్లుతోడి అమ్మమ్మకు వంటలో సాయం చేస్తున్నాడు. వాళ్ల ప్రేమ మర్యాదలకు, ముఖ్యంగా ఆ భార్యా భర్తలు ఒకరి కష్టాన్ని కనిపెట్టి మరొకరు చేసే సహకారం చూస్తే, నేను సిగ్గుతో కుంగిపోయాను.

"అరె! వీళ్లే పుస్తకాలు చదివి యింతటి ప్రేమను నేర్చుకున్నారు? వీళ్ళ దాంపత్య జీవనం చూస్తుంటే నే పొంద వలసిన ఆనందం ఈ ప్రపంచంలో యింకా ఎంతో వున్నట్లుందే! అదేలా వస్తుంది? మాలో అనురాగబీజాలు ఎలా మొలకలెత్తుతాయి? భగవంతుడేదైనా ప్రేమను కొలిచే యంత్రాన్ని యిచ్చిన ట్లయితే వీళ్ల ప్రేమనుకొలిచిచూసిఅయినా సంతోషించేవాణ్ణే!"....అని యింకా చాల అర్థంలేని ఆలోచనలు చేశాను. ఫలితం: ఆ రాత్రి నిద్రలేకపోవటం తప్ప వేరేమీ కనుపించలేదు.

ఆ మర్నాడు ధైర్యంచేసి నా బాధలు సందేహాలు అన్నీ అమ్మమ్మ దగ్గర ఏకరవుపెట్టాను.

"ఓరి పిచ్చి నాయనా: కొత్తలో కొన్ని వొడుదుడుకులు అందరికీ వుంట యిరా. ప్రేమపొంగు పాలపొంగు లాంటిది అంటారు. ఆ వేడి రోజుల్లో ఒకర్ని వొకరు అర్థం చేసుకోలేక మా చెయ్యి పైనంటే మా చెయ్యి పైన అని వాదించుకుంటారు. ఆవేశంతో ఒకళ్లుమాట్లాడే టప్పుడు రెండోవాళ్లు కాస్త పస్తాయించి ఆ తీవ్రతచల్లబడ్డాక నెమ్మదిగ మనస్సుకు అంటేటట్టు నచ్చచెప్పటం నేర్చుకుంటే రెండో తఫా మళ్లీ సాహసించ లేరు. ముందుముందు గాని బాధ్యత తెలియదు లేరా!....ఇవన్నీ హృదయంలో ఏమూలైనా ఆ....బీజమనేది వుంటేనేనోయి!" అని నవ్వింది.

కొన్ని నెలలు గడిచాయి. ఇప్పుడు పార్వతి నేను పండంటి కాపురం చేస్తున్నాం. కారణం....మా అమ్మమ్మ....






మూడుమొగాల వరిశిగాడు నా కన్న ఆర్నెల్లు సీనియరు. కంపెనీ పుట్టినప్పట్నుంచీ కంపెనీ కనిపెట్టుకున్నాడు. కొంచెం తమాసా మనిసి. రోసంతో ఏందైనా మాట్లాడుతుంటే మూడుమొగాలతో మాట్లాడుతాడు. మేమంతా ఆడ్ని మూడుమొగాలనే పిలుత్తాం.

కల్వెన్ ఓటలులో కూకున్నాం మేం ముగ్గురం. మూడోవాడు యారనుకున్నాయేం? నక్కాయిగాడే. ఆడ్ని నక్కాయని యెంగుకు పిలుత్తాం అంటే, ఆ కత తరువాత సెపుతాలే!

"పెదబొండాయి గాడికి దునియాలో సంగతులన్నీ తెలుసు" అన్నాడు మూడుమొగాలు. అంటూ లైంజూసు తాగేసిన గలాసు తలకిందుగా పెట్టాడు. మాట్లాడకుండా మేంగూడా మా గలాసులు తలకిందులుచేశాం.

"పెదబొండాయి చినబొండాయిల సంగతి ఇదివరకు సెప్పాను గాదురా అబ్బాయిగారి సుబ్బాయి?" అని నన్ను నూసి అన్నాడు మూడుమొగాలు.

నా కబ్బాయిగారి సుబ్బాయని పేరెందుకొచ్చిందో అదీ సెపుతాలే ఓనాడు.

మూడుమొగాలు కుర్చీమీద సేరగిల్లాడు. వత్తగువ్వలల్లే కళ్ళుపెట్టి ఆలోసిత్తా కూకున్నాడు.

పెదబొండాయి సంగతేందిరా — మిలిటరీలో సేరి ఎన్నాళ్ళున్నాడ్రా అని పుల్లేశాను.

వాడేం మాట్లాడ్లే! వేళ్ళతో బల్లమీద తబ్లావాయిత్తా "సిన్నపరెడ్డీ బంగారుకడ్డీ"! పాటయీలతో పాడుతూ కర్నాలపాటి డొంకలోంచి ఇంటికెళ్ళుతున్నాడిమాదిరిగా కళ్ళెగరేత్తుంటే బమ్మపుత్తర కద్దరి ఉన్నాం అని మరిసిపోయాం. కదంతొక్కటంలో కుమ్మరి గాడిదనిగాని పదంపాట్టంలో పట్నం సాని పక్కపాటగాడ్నిగానిమించేత్తాడు మూడుమొగాల్. మేంగూడా యనకాల సారగిలబడి ఊకొడుతూ ఊరకున్నాం. ఓటల్లో ఓళ్ళిద్దరు మా వంక చూత్తూ కళ్ళెగరేశారు. బైట లారీ ఒకటాగింది. డ్రైవరు మాణిక్యం

సరాసరి లోపలికొచ్చి "ఏక్ కవ్ చా" అంటూ మూలబల్లమీద సతికిలబడాడు. నిన్నపొద్దున్నే లాన్స్‌నాయకు పీతు పోయిందాడికి. మాతో మాట్లాడే— ఓటలాలనదుక్క మూడుమొగాలపాట యింటూ అదోమాదిరిగా పెట్టింది మొగం. దానికళ్ళల్లో మూడుమొగాల గాడు ముప్పైమొగాల గాడల్లే కన బడ్డాడేమో.

దడాలున పాట ఆపాడు. మూడు మొగాలమొగం ముక్కాలుమొగం అయింది. ఓరగా నూత్తూ "దాగం యేత్తుండదిరా" అన్నాడు.

లైమ్‌జూసు సెప్పనంట్రా అన్నాను నేను.

నీ లైముజూ సెవరికోయి పోదాం పా, ఖాసియాపాపుకు అన్నాడు మూడు మొగాలు.

ఖాసియాపాపులో యెనకయేపున గోనెపట్టాలమీద కూకున్నాం. ముందర రెండుబుడ్లు మూడు మట్టిగలాసులు తెచ్చిపెట్టింది ఖాసియాముసల్దికలాంచి. కలాంచి కాంచితల్లి. ఆళ్ళిద్దరి సంగతీ తర్వాత సెప్తా.

ఒక బుడ్డి కలాసు సేశాం. లయను సిగరెట్టు ఎలిగించా నేను. ఆడిమొగం రాసన్ సిగరెట్టు ఎవడిక్కావాల్రా అంటూ ఒసేయి కాంచీ ఏక్ విల్సు ప్యాకెట్ లావ్ అని డబ్బులిచ్చాడు,

*ఖాసీలు అస్సాములో షిల్లాంగు ప్రాంతాల ఒకజాతి. ఇటీవల చాలా పనికొస్తున్నారు.

మూడుమొగాలు—మా ఓసీ ఆడర్లీ రూములో అట్టాంటి గొంతుతోనే డబాయిత్తాడు.

రెండోబుడ్డిలో సగం పంచాం. మూడోబుడ్డి ఆడేరుచేశాం.

పద్దాలుగేండ్లున్నాడురా మిలిటరీలో అన్నాడు మూడుమొగాలు—చిగరెట్లు పొగఊత్తూ.

పద్దాలుగేం డ్లెవడురా — ఏందిరా అన్నాడు నక్కాయి — మిగతా అర బుడ్డీ ఒక్కమారే పోసుకుంటూ.

మూడో బుడ్డి వచ్చింది. కాంచి పెంపుడుపిల్లి నక్కాయిగాడి జేబులో చాపటిన్ను నాకుతూ 'దునియా అచ్చా హై' అన్నట్టుగా నూత్తోంది.

పెదబొండాయిగాడు మిలిటరీలో ఎన్నాళ్ళున్నాడ్రా అని అడగలేదంట్రా అబ్బాయిగారి సుబ్బాయి, అన్నాడు మూడుమొగాలు.

హా! ఓహో! నిజమేరా! అసలు ఆడిసంగతే సెప్పకుంటూ సెప్పకుంటూ ఏరే యవారంలోకి దిగాం. సరే చెప్పరా! అన్నాను నేను.

మూడోబుడ్డి ముగ్గురు గలాసుల్లో ఓడ్చేసి ఉంకోబుద్ది ఆడేరుచేశాం.

కానీరా — పెదబొండాయి సంగ తేంటిరా — దంచైరా — అన్నాడు నక్కాయి—ఆడి మూతి పగిలినమారేడు పండల్లే ఉంది.

పట్లు తెలీకుండా కుస్తీ పట్టకూడ దోయిఅనేవోడు పెదబొండాయిగాడు.

అంటూ బుజాలు నూసుకున్నాడు మూడుమొగాలు.

పట్లు తెలీకుండాను స్త్రీపడితే తటాల్న అవతలాడిసేతుల్లో సిక్కి పోతాం—అట్లాగే జాగొర్తగా లేక పోతే మిలిటరీలోగూడాసిక్కిపోతాం. సిపాయి దర్జాపోతుంది అనేవోడు పెద బొండాయి ఆరోజుల్లో.

లాన్సునాయకు డవడం అదీ మొదటి నూసెన—సన్నిపాతంలో నూసెనంటిది అన్నాడు.

సిక్కు రిపోర్టు తీసుకెళ్ళడానికి, దానికీ దీనికీ లాన్సునాయకు ల్లేకపోతే ఎట్టారా అన్నాను నేను.

అ స్నానం లో నక్కదోసకాయలు లేవురా అన్నాడు నక్కాయి. వాడి జేబులోంచి ఒకచాప టిన్ను తీసి కట కటా నముల్తున్నది మూలగా పిల్లి.

ఆ వాసనకు ఉదిరేకం వచ్చి నోడల్లే రెండో జేబులోంచి నాలుగుటిన్నులుతీసి ఊడగొట్టి ముందెట్టాడు.

కమ్మ నివాసన గుమ్మెత్తిపోతోంది. ఒక్కొక్కటే నముల్తున్నాం.

నిజానికి నూడరా, అన్నాడు మూడు మొగాలు. లాన్సునాయకు ల్లేకపోతే ఎవళ్లోంచి నాయకుల్ని సేస్తారు? అర్ద మయిందా? నిజమా కాదురా?

ఊ — నీ ... నిజమేరా! అన్నాను నేను.

అంటే ఉంకోమాట సెప్తా నూడు. నాయకు ల్లేకపోతే హవల్దార్ల నెట్లా సేస్తారు. అట్లా అట్లా పైదాకా అం తేగా? ఆ యవారం అంతా పెద బొండాయిగాడికి తెలుసు — పద్దాలు గేండ్లు సలీసులోపల సిపాయి దర్జా వొదిలెట్టలే ఆడు! పొమోషన్ పుచ్చు కోగూడదని శాసనం కట్టుకున్నోడురా! పొమోషన్ అంటే అసయ్యం. అంత కన్న అసయ్యం ఎఱ్ఱపట్టీ ఎం.పీ. లంటే.

ఎఱ్ఱపట్టీ 'ఎంపీ' లంటే ఎండ్రకాయ వంటోళ్ళురా అనేవోడు పెదబొండా యి. ఈమాట సెపుతూ త్రేన్చాడు మూడుమొగాలగాడు — తుమ్మేడు నక్కాయిగాడు — గూడయదవలు! బుడ్లన్నీ అయిపొయాయి. రెండు చాప టిన్నులుమాత్రం మిగిలాయి. ఒకదాన్లో ముక్కెత్తుకుంటూ బుసవొదిలాను.

అందర్ క్యా హై? కుచ్ కుత్తా మరాహువా హై క్యా? క్యారే ఓ బాసన్? అంటూ బైట్నుంచి ఎవడో మాదగ్గిరి కొచ్చాడు.

ఆడి సేతిసుట్టూ ఎఱ్ఱపట్టీఉంది. ఆడి తల్లి పాలు రాంబందులు పీక. ఆడు ఎంపీ గాడు.

ఆడ్ని నూడంగానే ఒరేయి పెద బొండాయిరా. ఎంపీల్లోకి ఎప్పుడు పోయావురాఅన్నాడు మూడుమొగాలు.

ఎంపీ అయితేనేం మనోడేగా అని మా పాణాలు పాణాల్లో కొచ్చాయి.



పెదబొండాయి! గిదబొండాయినై - ఆర్మీ బాస ఉర్దూ — తెలుచా — ఈ స్తళం అవుటా బవుస్దు అన్నాడు, పెద బొండాయి — ఆడికతే ఇందాకట్నుంచీ ఇంటున్నాం అనే ఇస్వాసంగూడా లేదు — ఎర్రకొమ్మువత్తే ఎద్దుగ్గూడా ఏదోకొండమీద ఉన్నట్టుంటుంది గామాల్రా!

ఏడ్చావులేరా అంటూ మిగిలిన చాప టిన్నులు రెండు రెండుచేతుల్లో పట్టుకుని పెదబొండాయి దగ్గిరికి పోయాడు — బావమరిదిదగ్గిరి కెళ్ళినట్టుగా మూడు మొగాలగాడు.

ఉర్దూమే బాత్ చిత్ కరో అంటూ పెదబొండాయిగాడు బైట మొగంపెట్టి "నాయక్ హుస్సేనుసాబ్! ఏ అద్మీకో అరెస్టు కర్నా!" అని బైట ఎవర్నో పలకరించాడు పెదబొండాయి.

ఓరి జపానుతొత్తుకొడకా అంటూ ఆడిమొగంమీద ఒకటీ వీపుమీద ఒకటీ చాపటిన్నులు విసిరికొట్టేడు గ్రెనేడు బాంబులల్లే — మూడుమొగాలగాడు.

అదేసందుగా ఎనకనుంచి ఎనగ్గా పరుగెత్తాం.

నా కాల్లో ఏదో గుచ్చుకుంది. కుంటుకుంటూపోయి మూలతిరుగుడున షాపుఎనకాల నక్కా న్నా.

ముందరగా రోడ్డుమీద విజిలేత్తూ పరుగెత్తాడు పెదబొండాయి. ఆడిని చూత్తే తిమింగిలం గుడ్డులోంచి పగులుచొచ్చాడా ఏంటి అన్నట్టు నాడు. రోడ్డంతా ఆడిమీదివాసనే!

పక్కగల్లీలోంచి పరుగో పరుగు నేను. ముల్లువాచి పెదబొండాయిగాడి గుండెంతలావైనాసరే — ఎంపీగాడు ఎంటడుతుంటే యనక్కి తిరిగి సూడ గూడదురా!




మన్మధ, మనోరధుడు, రధసప్తమినాడు, ఊర్వశి పసిపట్టి రొట్టె కాల్చి మరల్చి మరగనిచ్చి మసిమూకుళ్లని తోమి తోడి పీడి పాడి, వేడికళ్ళతో దొంగలాగ బారపళ్లతో ముళ్లల్లో నడచిపోతుంది.

గాధలన్నీ రాధతోనే రమ్యంగా రాజిల్లి జాబిల్లి వంక చూపించి నవ్వింది కలకల మని. పకపక మని వెకవెక లాడుతో వాయ్యారంగా గడియారంలాగ గర్వంగా నుంచుంది.

జాణ, బాణం, ఇంద్రధనస్సు, దఘ దఘ లాడే దేహకాంతిలో మురళీనాదం ఆలాపిస్తో ముద్దుముద్దుగా జాలిగా గాలిలాగ తేలి పోతోంది.

మేఘాలు, మబ్బులు మల్లెపూల్లాగున్నాయి. తేలుతో, పచ్చని ఆకాశంలో ఆకులమధ్య తొంగిచూస్తున్న మల్లెల్లాగ తిరుగుతున్నాయి. పెరుగుతున్నాయి పాకుతున్నాయి, పరిగెడతాయి. పంపిస్తాయి. సందేశాలు వేగంతో అతి తొందరగా. దొంగగా నవ్వుతాయి వాలతాయి. తేలుతున్నాయి మబ్బులు తెరచాపల్లాగ, తెల్లగా నల్లని గగనంలో. విహరిస్తున్నాయి విహంగాలు. గుహల్లో సింహాల్లాగ, మహర్షి భగవాన్‌లాగ భయం బెదురూ నదురూ లేక.

బొత్తిగా బుద్ధిలేదు లోకానికి.

కాపరం. సంతోషం. సౌఖ్యం. గంధరగోళం, భూగోళం. రసగోళం. తలుపుగొళ్లెం. అర్థం దీనికి. గుర్రానికి కళ్లెంపెట్టి సవారీ చేస్తారు మహానుభావులు, ఠీవిగా దర్జాగా.

దబాయిస్తూ, బాకావూది బైబై మని, నవ్వాడు, తెల్లగడ్డం లోంచి సాయెబు.

సంపూర్ణ కటాక్షమే వుంటే నామీద.

ఏమీలేదు, పోదు. రాదు.

నాదికాదు. ఈ జగత్తంతా జంఝూటన, నటన, నాటకం, బూటకం, పాతకం, ఏమీ లేదు.

పోనేపోదు, రానేరాదు.

వానేకాదు, జడేకాదు, మనమే కాదు, హృదయమేకాదు, నయమేకాదు కదా.

ఎందు కట్లాచూస్తావు? వ్రాస్తావు? వొచ్చిపోతావు?

మనస్తాపం, మనోవ్యాకులత, చంచలం.

అంచులు, అనురాగపుటంచులు, సంచులు, వెండికంచాలు, మంచాలు, మల్లెలు, విరజాజులు, గాజులు, పూలవాజులు.

మారాలి. పట్టిక మామిడాకులు మంకుతనంతో దెబ్బలు తిన్నాయి. బాగా తిన్నాయి. తాగాయి. వాయించాయి. బజాయించాయి. మజాగా, ముంజలు తిన్నాయి. మడితో వాడిగా నరసమ్మ నడుస్తోంది. పరిగెత్తు పద.

పద్మావతీ, పాడవూ?

పాదాల సొగసు. విగసు.

మనసు పట్టలేము, ముట్టలేము. లాభంలేదు, ఆఖరికి కట్టలేము. చాతకాదు.

రాదు, నిజంగా రాదు. నాతో, నీతోకూడా ఆఖరికి రానేరాదు. వొద్దు. మనకి వొద్దనే సంగతి చెప్పకు.

వొప్పుకో. నామాటనే నిలుపుకో. సిల్పములు. సిల్పిణి. పిల్చి మరిల్చి చీల్చి కాల్చి వేధించారు, పాపం.

పెల్లీ, నిన్ను కాల్చారు. రాల్చుకు తిన్నారు. పొగరుపట్టిన వెధవలు. దొంగ మాటలు చెప్పారు. నమ్మించారు. మత్తు పెట్టి కత్తితో, గొంతుకోశారు.

రాశారు నీమీద ఎన్నో పద్యాలు, పాటలు. ఏంలాభం నువ్వే లేనప్పుడు?

# కాలేజీ ప్రపంచం



బాగా చలివేస్తున్నా, చీకటితోనే లేచి స్టౌ వెలిగిస్తాడు జయరావు. ఆవేళనించి అతనికి ఓ వారంవరకు నైట్ షిఫ్టు. పగలంతా శుభ్రంగా విశ్రాంతి తీసుకోవొచ్చు ననుకుంటాడు.

కాఫీ పూర్తి కాకుండానే స్టౌ కిరసనాయిల్ కు నోరు చాపుతుంది. ముందు దాని తృప్తితీరుస్తూ 'యుద్ధ మయిపోతుందిలే!' అనుకొంటాడు, తను కిరసనాయిల్ కోసరం పడిన బాధ తల్చుకొని. పంచదారటిన్ కూడా బోసి నోరేసిందేమో నని భయపడతాడు. కాని ఫ్యాక్టరీ స్టోర్సు ధర్మమా అని అంతపని తటస్థించదు.

తర్వాత సిగరెట్ కాలుస్తూ ఎవో గాలిమేడలు పొగతో నిర్మిస్తుంటాడు. భార్యను తీసుకు వొచ్చి సుఖంగా కాపరం పెట్టడానికి యుద్ధ మయి పోయిందికదా!' అనుకుంటాడు. ధరలు తగ్గే సూచనల్ని చూస్తుంటాడు.

మళ్ళీ లేచి వూళ్ళోకిబయలు దేరుతాడు. ఏ ఉలెన్ కోటో బిగుతుగా పట్టుతుంది. 'యుద్ధమైందిగా! కొత్తది కుట్టించుకోగలను' అనుకుంటాడు.

ఇల్లు దాటి స్లోపు ఎక్కగానే ఏ ఊటినించో వొచ్చిన సరోజినో కలుస్తుంది.

"ఎక్కడికి ప్రయాణం?"

వెల్లింగ్టన్ వైపు వేలు చూపుతాడు. కాని వొకసారి ఊటిపోవాలనే కోరిక పోదు ఎంతకీ వీలుపడ్డంలేదు. చల్లని మేఘాలు తనని దాటుకు వెడుతోంటే ఎంతో సంతోషిస్తాడు. అక్కడి పార్కు-గ్లాస్ హౌసెస్ లోని వివిధ రకాల పువ్వుల్ని క్రోటన్సునీ ఎప్పటికీ మర్చిపోలేదు.

అసలు నీలగిరీస్ జీవితమే అట్లా వుంటుంది అతనికి. పూర్వం ఇంగ్లీషు నావెల్సులో, సినిమాల్లో చూసిన, వాళ్ల దేశ వాతావరణం కొంచెంగా కనపడుతోంది అక్కడ.

వెలుగు నీడలు

ఇద్దరూ కల్సి మాట్లాడుకుంటూ, నడుచుకుపోతుంటారు. ఎంతో సజీవంగా వుంటుంది ఆ జీవితం. కాని తన మరికి పట్నాల్లోని నిర్జీవపు బతుకు ఒక్కొక్కసారి మనసును కలచివేస్తూంటుంది.

సరోజిని కొన్ని యూకలిప్టస్ ఆకుల్ని తుంచి వాసన చూస్తుంది. దూరంగా బడగా కుర్రవాడు బేరికాయ తింటుంటాడు.

"ఈవేళ ఫాక్టరీకి పోవక్కర్లే?"

సరోజిని అడుగుతుంది.


"నైట్ డ్యూటీ" అంటాడు ముక్తసరిగా.

ఎదరవచ్చే గాడరీని తప్పించుకుందామనుకుంటాడు. కాని ఆ దేవాంతకుడు సులువుగా పోనీడు. అనుకున్నట్టుగానే ఆపి అద్దె అడుగుతాడు. "రెండు రోజుల్లో ఇచ్చేస్తా" నని సరిపుచ్చుతాడు.

"రెండు గదులకి పన్నెండు రూపాయలు. "దోపిడి! అంతా దోపిడి!! ఉండండి, యుద్ధ మైపోయింది, గీ అద్దెలు తగ్గుతాయి" అనుకుంటాడు మళ్ళీ.

వెల్లింగ్టన్ పార్కు సమీపిస్తారు. కాని ఎవరూ ఆగరు. మార్కెట్టు మీంచి కూనూరు పోతారు.

దూరంనించి చల్లనిగాలి మధ్యమధ్య ఇంగ్లీషువాళ్ల నవ్వుని మోసుకవచ్చి గిలిగింతలు పెడుతుంది. తలకి చుట్టిన మఫ్లరు తీసేసి సరోజని భుజంమీద పడేసి, ఆమె చీరతో పోల్చి చూస్తుంటాడు. సిగరెట్ కాల్చుకుంటూ, అలవాటు చొప్పున సరోజినికి ప్రెజెంట్ చెయ్యబోతాడు.


సినిమాలో సినిమా

కూనూరు చేరుతారు. సరోజిని అడుగుతుంది.

"సినిమాకి పోదామా?" అని.

"అరవ గోడేగా"

"పోనీ బ్లడ్ అండ్ సాన్డ్ కి"

మాట్లాడడు. తన కిష్టంలేని పని అని చెప్పేందుకు అతను అవలంబించే విధాన మది.



పార్కులో పచ్చికలో పడుకుంటారు. ఏవేవో కబుర్లు చెపుతాడు. అక్కడ ఇంకా వున్న తెలుగువాళ్ళ క్షేమాన్ని అడుగుతాడు. తాము తెరచిన లైబ్రెరీ సంగతి, తన వుపన్యాసము అన్నీ దొర్లుతాయి.

యూకలిప్టస్ గుబురు మాటునుంచి వచ్చే ఇండైరెక్టు సూర్యకిరణం సరోజిని జుత్తుతో ఆడుకోవడం చూసి ఎంతో సంతోషిస్తాడు.

మెయిల్ వచ్చే టైమవుతుంది. అద్భుత దృశ్యాలన్నిటికీ 'గుడ్ ఈవినింగ్' చెప్పి, ఇద్దరూ కలిసి ఇంటికి పోతారు.

హోటలువాడు చల్లని భోజనం పెడతాడు. "పాతిక రూపాయలు పుచ్చుకుని కూడా ఈ చలిదేశంలో ఇదేమిటి? 'యుద్ధమైంది. నీ రేటుకూడా తగ్గుతుందిలే' అనుకుంటాడు.

రాత్రి పనికి పోతాడు. ఫాక్టరీలో ఎవరో కలుస్తారు, ఫోర్ మన్ దూరంగా వున్నప్పుడు.

"రేపు ఫస్టునించి పాతికమందిని డిస్ చార్జి చేద్దామనుకుంటున్నారు!" అంటారు.

"ఏమి?"

"పడమట యుద్ధమైందిగా!"

"యుద్ధమైపోయింది ఇతని ఉద్యోగంకూడా పోయేలా ఉంది. అందులో చివరి బాచ్ లోని వాడు.

"యుద్ధమయిపోయింది. మళ్ళీ నిరుద్యోగం తప్పదు, స్వాతంత్ర్యం వచ్చేవరకూ" అనుకుని, సమాధాన పర్చుకుంటాడు మనస్సుని, ఇంటికి పోతూ.

హార్విక్ హాస్టల్,
విజయనగరం.

—శొంఠి కృష్ణమూర్తి.




# నృత్య శిక్షణ

కొమ్మూరి పద్మావతి

సోదరీ !

ఇదా నీ సందేహం ? ఇంతేనా ? నీభర్త నిన్ను నాట్యం నేర్చుకోమని తీరా ప్రారంభించాక వద్దన్నాడా ? దీనికి నా సలహా ఇమ్మంటున్నావు. నే నేం చెప్ప నమ్మా వెర్రిదానా ! అయినా నాకు తోచిన సలహా ఇస్తాను మరీ కోపగించుకోకు. ఏం ?

అసలు ముఖ్యంగా ఆలోచించవలసింది భర్త ఇష్టం. భర్తకి గనుక ఇష్టం లేకపోతే మరి పెద్ద చిక్కే కదూ ! నీకు నాట్యము చెయ్యాలని ఇష్టంలేకపోయినా నీ భర్తకి ఇష్టమయితే నువ్వు విధిగా సతమతం అయి నేర్చుకోవలసిందేకదా !

నా అభిప్రాయం ఏమిటంటే ఎంతో విశాలహృదయం గల నీ భర్త "నాట్యం నేరిస్తే తప్పు" అని కాదేమో వద్దన్నది. ఏమంటావు ?

ఇంతకీ యీ నాట్యమనే పిచ్చి ఏదో ఒక అంటు జాడ్యంలా అన్ని చోట్ల వ్యాపించింది.

కోపగించుకోకు మరి !

ఈ అంటుజాడ్యం ఉందే ఇంటింటా ఉంది. ఎంత చిన్న పిల్లలైనాసరే పెద్దపిల్లలైనా సరే నాట్యము నేర్చిఉండాలి, "మా అమ్మాయికి నాట్యంవచ్చు" అంటే ఏదో ఒక పెద్దపదవి లభించినట్లేఅనుకో. ఇంతకీ నిన్ను గురించి కాదు సుమా ! అసలు అందరూ అనుసరిస్తూన్న అంటు జాడ్యం విషయం చెప్తున్నా. పూర్వం పిల్లలకి పెళ్ళిసంగీతం చెప్పించేవారు. గొంతు ఎలాగఉన్నాసరే 'పాటవచ్చును' అనిపించాలి. అలాగే ఇప్పుడు 'నాట్యం వచ్చును' అనిపిస్తున్నారు.

ఎంతో పూర్వాచార పట్టుదలగల మా వాళ్లు యీమధ్యనే నాట్యంనేర్చినకోడల్ని తెచ్చుకున్నారు, ఇళ్ళల్లోనే కాదు యీ జాడ్యం, ఏ సినీమాకైనా వెళ్లు, నాటకానికి వెళ్లు, ఏ విందులకైనా వెళ్లు, నాట్యం ఉండితీరుతుంది.

నాట్యం చేసేవాళ్లు ఎలా ఉన్నా సరే, కొంగమెడలతో, కోతుల్లాగా ఎగురుతూ ఉంటే మనం చచ్చినట్టు చూచితీరవలసిందే.

అనుకరణకి ఆంధ్రులు ముందంజ వేస్తారు, అందులోనూ మన సోదరీ మణుల విషయం చెప్పాలా ?

ఈ డాన్సులు చూసి చూసి నాకు జబ్బు చేసిందంటే నమ్ము.

ఏ వీధివెంటవెళ్ళినా, కాస్త నిదానించి పరికించి పరీక్షగాచూడు, ప్రతీఇంట్లోనూ గజ్జెల చప్పుడు, తాళాల మోతలు, అబ్బ! మరీ చిన్న పిల్లలు "మరుశర బారికి తాళగజాల" అంటూ భరతనాట్య భంగి మాలతో అభినయిస్తూఉంటే చూడడానికి దుర్భరంగా ఉంది !

నడకలోనే నాట్యాలు ఒలికించే స్త్రీలు లే రనికాదు. గాని .... అబ్బ అందరూ నాట్యమేనా ? నాట్యానికికావలసిన అంగ సౌష్టవమూ కను ముక్కు తీరూ, ముఖ భావం ఉందా అనే విచక్షణే లేదుకదా ? కదలలేని లావుగా నడుం ఉన్నా సరే, చేతులూ కాళ్ళూ అష్టవంకరలుగా వక్రం గా ఉన్నా సరే నాట్యం నేర్చుకుంటూ ఉన్నారు అంతా.

వీధి కాక స్కూలు వెలిసిందనుకో. అక్కడ ఉన్న పిల్లలలో ఏ ముగ్గురు నలుగురో తప్ప తక్కినవాళ్లంతా అష్టా వక్రంగా చేతులు త్రిప్పుతూ అడుగులు రాక ఆయాస పడుతూ బాధ పడడం చూశాను.

ఈమధ్యనే ఒక స్కూల్లో ఇరవై మంది పిల్లలు నాట్యం నేర్చుకోవడం చూశాను. నాలుగేళ్ల దగ్గిరనించీ ఇరవై ఏళ్ల వయసు పిల్లలు ఉన్నారు.

ఇంతలో నడుం కిందికి వంచి లేచే నాట్యం టీచరు చెప్పింది. ఒకఅమ్మాయి పాపం వెల్లకిలా పడింది, నాకు నవ్వూ వచ్చింది ఏడుపూ వచ్చింది, ఆ దృశ్యం చూడలేక. ఊరుకోలేక ఒకరిద్దర్ని అడి గాను "ఎందు కింత కష్టం"అని. "శరీరా నికి వ్యాయామము" అన్నారు, వ్యాయా మానికి వేరే సాధన లేనట్లు! , వయసు పిల్లలు వక్రంగా నడుం తిప్పి నడుం వంగక వెనక్కీ ముందుకీ పడబోయి ఆయాసంతో అలిసిపోతూ కళ్లు తిప్పడం రాక వెర్రిచూపులతో, చూసేవాళ్లని భయ పెట్టి నానా బీభత్సం చేస్తున్నారు. యీ నాట్యంతో.

నిజం చెప్పవలసివస్తే నీకు నాట్యము బాగుండదు చెల్లీ !

నిన్ను నీ భర్త నాట్యం నేర్చుకో వద్దన్నది నీ నాట్యభంగిమాలు చూడలే కేమో! ఆలోచించు, ఇంట్లో నువ్వు నాట్యం అభ్యాసంచెయ్యడం చూసి భరిం చలేక బాధపడి వద్దని అన్నాడేమో !

మొన్న మా అమ్మ అన్నదిలే నాతో "నువ్వూ నేర్చుకోవే" అని. మనకేగాక మన పెద్దవాళ్లకికూడా ఆవరిస్తోంది యీ జబ్బు !

ఒక్కటి చెప్తా విను.


ఇంకా కొంతకాలంపోతే అందరూ నాట్యంతోనే కుశల ప్రశ్నలతో పలక రించుకునే స్థితి రాబోతూంది.

అప్పుడు తప్పనిసరి గనుక నువ్వూ, నీతో నేనూ వస్తాను, నాట్యం నేర్చు కుందాం ?

ప్రస్తుతం నేర్చుకోవడంమాని యీ వింత వింత నాట్య భంగిమాలు చూసి మనస్సులో దాచుకో. ఇంక శెలవు.





బాంబులు పడుతున్నా...!



- ఒక నీటిబొట్టు భూమి అంత పెద్దదని అనుకుంటే దానిలో ఉండే ఒక్కొక్క మాలిక్యూల్ పెద్ద నిమ్మకాయంత ఉంటుంది.

- ఆ మాలిక్యూల్ నుమళ్లీ భూమంత పెద్దదని అనుకుంటే దానిలో ఉండే ఒక్కొక్క ఏటమ్ పెద్ద నిమ్మకాయంత ఉంటుంది.

- తిరిగి ఆ ఏటమ్ సెంట్ పాల్ గుమ్మటమంత (దాని వ్యాసం 102 అడుగులు) పెద్దదని అనుకుంటే దానిలో ఉండే ఎలక్ట్రాను గుండుసూది తల అంత ఉంటుంది.




ఎడమవైపునఉన్నది సోడియమ్ ఏటమ్. కుడివైపుది కాల్షియమ్.

# పరమాణువు శక్తి

డి. ఏ. ఏ. 'యస్.' నారాయణరావు

ఒక పదార్థంలోని అవిభాజ్యములైన అతిస్వల్పకణాలను (molecule) అణువులంటారని, అదే ఇనుము, బంగారంవంటి మూలపదార్థాలయితే, ఆ అవిభాజ్యకణాలను పరమాణువు (atom) లంటారని అందరికీ తెలిసినదే. సృష్టిలో ఇప్పటివరకు 92 మూలపదార్థాలు (elements) కనుగొనబడ్డాయి. ఆ 92 మూలపదార్థాలకు చెందిన 92 రకాల పరమాణువులతోనే సృష్టి అంతా నిండి ఉంది. ఇదివరకు ఈ పరమాణువులు అవిభాజ్యములనీ, సృష్టికి ఇవే మూలములనీ అనుకునేవారు. కాని విజ్ఞానశాస్త్రాభివృద్ధిలో పరమాణువులు సహితం విభజింపబడగలవనీ, అవి అంతకంటె మూలములైన కొన్ని కణాలతో నిర్మింపబడినవని తెలిసింది. ఎలక్ట్రానులు, ప్రోటానులు, న్యూట్రానులు అన్నవి అటువంటి మూలకణాలు. ప్రతి పరమాణువుకూడా ఈ మూలకణాలతోనే నిర్మింపబడింది. అయితే ఒక పరమాణువుకి ఇంకొకరకం పరమాణువుకి భేద మేమిటంటే, వాటిలోఉన్న మూలకణాలసంఖ్యాభేదమే. 26 ఎలక్ట్రానులు, 26 ప్రోటానులు, 30 న్యూట్రానులు కలిసి ఇనుము పరమాణువు నిస్తే, 79 ఎలక్ట్రానులు, 79 ప్రోటానులు, 118 న్యూట్రానులు కలిసి బంగారము పరమాణువు నిస్తాయి. ఇలాగ ఈ మూలకణాలు వేరువేరు సంఖ్యాభేదాలతో కలిసి 92 రకాల పరమాణువుల నిస్తున్నాయి.

ఈ మూలకణాలలో ఎలక్ట్రానన్నది విద్యుత్కణము. దానిమీద ఋణవిద్యుదావేశం (negtive electric charge) ఉంటుంది. దానిబరువు చాలా తక్కువ. పరమాణువు లన్నిటికంటె తేలికైన ఉదజని పరమాణువు బరువులో 1/1810 వంతు ఉంటుంది సుమారుగా. ప్రోటానన్నది ధనవిద్యుత్తు (Positive electricity) తో కూడిన కణం. ఒక ఎలక్ట్రానుమీద ఎంత ఋణ విద్యుత్తు ఉంటుందో, ఒక ప్రోటానుమీద అంత ధనవిద్యుత్తు ఉంటుంది. ప్రోటాను బరువుమాత్రం ఎలక్ట్రాను బరువుకంటె చాలా ఎక్కువ. ప్రోటాను బరువు దరిదాపు ఉదజని పరమాణువు బరువంత ఉంటుంది. ఎలక్ట్రాను, ప్రోటానులు విద్యుత్కణాలై ఉండగా, న్యూట్రానులు ఏమీ విద్యుదావేశం కలిగిఉండవు. వీటికి బరువుమాత్రమే ఉంటుంది. ఒక్కొక్క న్యూట్రాను ఒక్కొక్క ప్రోటానుకంటె కొద్దిగా బరువుగా ఉంటుంది. కాని రెండూ దరిదాపు ఒకేబరువని చెప్పవచ్చును.

పరమాణువులో కేంద్రికమనే అతి సూక్ష్మభాగంలో ప్రోటానులు, న్యూట్రానులు ఉంటాయి. ఆ కేంద్రకం ధనవిద్యుదావేశం కలిగిఉంటుందన్నమాట. ఆ కేంద్రకంచుట్టూ ఎలక్ట్రానులు

వలయాలలో (సూర్యునిచుట్టూ గ్రహాలలా) తిరుగుతూఉంటాయి. అయితే పరమాణువులో మొత్తంమీద ఋణవిద్యుత్కణాలు, ధనవిద్యుత్కణాలు సమానంగా ఉండడంనుంచి, దానికి మొత్తంమీద విద్యుదావేశం ఏమీ అగపడదు.

పరమాణువు సుస్థిరమైన దనుకొంటూంటే, ప్రకృతిలో కొన్ని మూలపదార్థాలతాలూకు పరమాణువులువాటంతటఅవే విచ్ఛిన్నమై, కొన్ని కణాలను, కొన్ని శక్తివంతములైన కిరణాలను ఇస్తున్నాయి. ఆ పరమాణువులు ఇలాగ కిరణాలను, కణాలను ఇచ్చి, ఇతరపరమాణువులలోకి మారిపోతున్నాయి. దీనినే 'రేడియో యాక్టివిటీ' అంటారు. యురేనియము, రేడియం, యాక్టినియము, పోలోనియము అనే అన్నీకూడా ఇలాగే వ్యవహరిస్తాయి. రేడియము ఈగుణాన్ని చాలా ఎక్కువగా కలిగిఉంది. ఈ శాఖలో క్యూరీదంపతుల పరిశోధనలు చాలా వన్నెకెక్కినవి. రేడియమును కనిపెట్టిన వారు క్యూరీదంపతులే. ఈ రేడియో యాక్టివిటీ చూపెట్టే పరమాణువులనుండి అతిశక్తివంతమైన ఎలక్ట్రానులు, ప్రోటానులు మొదలైనవి వస్తూఉంటాయి. కాని ఈ రేడియో యాక్టివిటీలో పరమాణువులు చాలా కొద్దిగా విచ్ఛిన్నమవుతూ ఉంటాయి. మనము కొంత రేడియమును తీసికొని ఒకచోట ఉంచామంటే, అందులోని సగం పరమాణువులు విచ్ఛిన్నమవడానికే ఎన్నోవేల సంవత్సరాలు పడుతుంది.

కొన్ని పరమాణువులు ఒక రకంనుండి ఇంకొక రకంలోనికి వాటంతట అవి ప్రకృతిలోమారడమేకాక, సాధారణంగా సుస్థిరంగా ఉండే రకపు పరమాణువులనుకూడా కృత్రిమంగా మార్చవచ్చునని కనుగొన్నారు శాస్త్రజ్ఞులు. అలామార్చి చూపెట్టారు. నత్రజని మొదలయినవాని పరమాణువుల మీదకు ఎక్కువ వేగాలతోకూడిన ప్రోటానులను, ఆల్ఫాకణాలను మొదలగువానిని పంపి పరమాణువులను ఛేదించారు. కాని ఇలా పరమాణువులను ఇతర కణాలతో గ్రుద్ది ఛేదించడంలో, ఎన్నోకణాలనుపంపినా కూడా వాటిలో కొద్దిమాత్రమే పరమాణువులను గ్రుద్దగలుగును. అందుచేత చాలా కొద్ది పరమాణువులు విచ్ఛిన్నమయి మారుతాయి. కనుక ఈ పద్ధతిలో ఎక్కువ పదార్థాన్ని ఇంకొక రకపు పదార్థంలోకి మార్చలేము. శాస్త్రజిజ్ఞాసకొరకు అమిత ధన వ్యయాని కోర్చి ఇలాగ ద్రవ్యాంతరీకరణము కొద్దిగా చేయడంలో ఫలితులయ్యేరు శాస్త్రజ్ఞులు.

ఇటువంటి కృత్రిమ పరమాణు విచ్ఛేద సందర్భంలోనే న్యూట్రాను కణం కనుగోబడింది. పరమాణువులను ఇతరకణాలతో విచ్ఛేదించినపుడు, విద్యుదావేశం లేకుండా బరువు మాత్రమే ఉన్న కణాలు వెలువడడం ఛాడ్విక్ అనే శాస్త్రజ్ఞుడు 1932 లో సూచించేడు. బెరీలియము అను పదార్థాన్ని ఆల్ఫాకణాలతో (రేడియములో నుండి వస్తాయి ఆల్ఫాకణాలు) ఢీకొన్నప్పుడు న్యూట్రానులు వస్తాయి. ఇలాగ వచ్చిన న్యూట్రానులతో ఇతర పరమాణువులను ఢీకొల్పి వాటిని ఛేదించవచ్చును. కృత్రిమంగా పరమాణువు

లను ఛేదించడంతో న్యూట్రానులే అన్ని కణాలకంటె ఎక్కువ నేర్పు కలవని తరువాత తెలిసింది. దానితో న్యూట్రానుల నుపయోగించి అనేక పరమాణువులను ఛేదించడానికి శాస్త్రజ్ఞులు ప్రయత్నించి సఫలులయ్యేరు. ఆ సందర్భంలోనే ఫెర్మీ, హాన్, మైట్నరు అనే శాస్త్రజ్ఞులు న్యూట్రానులతో యురేనియము పరమాణువులను ఢీకొంటే ఏమి జరుగుతుందని జాగ్రత్తగా పరిశీలించేరు.

## యురేనియం

యురేనియము మూలద్రవ్యాలన్నిటిలోకి బరువైనది. దీనిపరమాణువు ఉదజని పరమాణువుకి 238 రెట్లు బరువుంది. 235 రెట్ల బరువున్న ఇంకొక తేలికరకం యురేనియముకూడా కొద్దిగా పైబరువు రకంతో కలిసి ఉంటుంది. తేలికరకం చాలా తక్కువగా (బరువు రకంలో 1/200,000 వంతు) ఉంటుంది. ఫెర్మీ, హాన్ మొదలయినవారు యురేనియము విషయంలో చేసిన పరిశోధనలలో కొన్ని వింత సంగతులు తెలిసినై. తేలికరకం యురేనియము పరమాణువులను కొన్ని న్యూట్రానులు ఢీకొన్నప్పుడు, అవి విచ్ఛిన్నమయి తక్కువ బరువుగల పరమాణువులలోకి మారిపోతాయనీ, అలా మారిపోతూ అవి న్యూట్రానుల నిస్తాయనీ, ఆ న్యూట్రానులు చుట్టుపట్ల ఉన్న యితర పరమాణువులను ఛేదిస్తాయనీ. ఇలాగ ఈ విచ్ఛేదం త్వరత్వరగా తేలికరకం యురేనియంపరమాణువులన్నిటికీ వ్యాపిస్తుందని తెలిసింది. ఈ విచ్ఛేదంలో చాలా ఎక్కువ వేడికూడా పుడుతుంది. తేలికరకం యురేనియము పరమాణువులను న్యూట్రానులు ఛేదించినపుడు, మళ్లా న్యూట్రానులు బహిర్గతమవడంవల్ల ఆ పరమాణువులన్నీ సులువుగా త్వరలో ఛేధింపబడుతున్నాయి. ఇలా అన్నీ త్వరలో విచ్ఛేదమవడంవల్ల ఎక్కువ ఉష్ణశక్తి పుట్టగలదు. న్యూట్రానులు ఇతర పరమాణువులను ఢీకొన్నప్పుడు ఈ విచ్ఛేదం ఇలా అన్ని పరమాణువులకి వ్యాపించదు.

తేలికరకం యురేనియమును బరువు రకంనుండి వేరుచేసి, ఆ తేలికరకమును సరియైనంత సంపాదించి, దానిమీదకు న్యూట్రానులను పంపినట్లయితే, కొద్ది కాలంలో ఆ పరమాణువులన్నీ కూడా విచ్ఛిన్నమైపోయి, విపరీతమైన ఉష్ణశక్తినివ్వవచ్చుననీ, ఆశక్తి నుపయోగించవచ్చునని ఒక ఆశ కలిగింది శాస్త్రజ్ఞులకు. అయితే ఈ రెండురకాల యురేనియములను విడదియ్యడం అసాధ్యంగా ఉండేది. తేలికరకాన్ని సరిపడినంత సంపాదించడం ఇంకొక కష్టం.

పరమాణువులోని శక్తి నుపయోగించడానికి వీలగుతుందేమోనన్న అనుమానముండడంచేత, అందుకు గల అడ్డంకులను తొలగించడానికి మిత్రమండలి శాస్త్రజ్ఞులు, జర్మను శాస్త్రజ్ఞులు కూడా 1939 నుండి తీవ్రపరిశోధనలు చెయ్యడం మొదలుపెట్టేరు. బ్రిటనులో నోబెలు బహుమానము పొందిన సర్ జార్జి థామ్సను అధ్యక్షతక్రింద శాస్త్రజ్ఞుల సంఘమొకటి ఏర్పడి దీని విషయం పనిచేసింది. బ్రిటిషు శాస్త్రజ్ఞులు అమెరికను శాస్త్రజ్ఞులు ఈ విషయంలో తమ అభిప్రాయాలను రహస్యంగా ఒకరికొకరు తెలియచేసుకొనేవారు. 1941 నాటికి పరమాణువులోని శక్తినుపయోగిస్తూ, శత్రుసంహారానికి బాంబులను

తయారుచేయవచ్చునని మిత్రమండలి శాస్త్రజ్ఞులకు ధైర్యం కలిగింది. ఏకర్స్, ఛాడ్విక్, హేల్బాన్, సైమన్, ఛార్లెస్ డార్విన్, కాక్‌రాఫ్ట్, ఆలిఫేంట్, ఫెదర్ అనే సుప్రసిద్ధ శాస్త్రజ్ఞులంతా దీనిగురించి పరిశోధనలు చేసేరు. 1941 లో కొందరు బ్రిటిషు శాస్త్రజ్ఞులు అమెరికా వెళ్లేరు. అక్కడ అమెరికను, బ్రిటిషు శాస్త్రజ్ఞులు కలిసి ఈ విషయమై పనిసాగించారు. డేనిష్ శాస్త్రజ్ఞుడు నీల్స్‌బోర్ అను నతడు జర్మను శాస్త్ర రహస్యాలను రహస్యంగా బ్రిటిష్ వారికి అందచేస్తూఉండే వాడు. ఆఖరికి 1943 లో ఆతడు జర్మను గెస్టపోను తప్పించుకొని, ఇంగ్లండు పారిపోయి, ఇతర శాస్త్రజ్ఞులతో కలిసి పనిచేశాడు. అలాగున ఈ శాస్త్రజ్ఞులంతా కలిసి 1945 నాటికి ఏటంబాంబును తయారు చేశారు. 'అందులో పరమాణువులోని శక్తి ఉపయోగపడుతూంది. పరమాణువులోని శక్తిని ఉపయోగంలోకి తేడానికి శాస్త్రజ్ఞులు చేసిన తీవ్రమైన కృషి తొలిసారి ఫలించడం ఏటం బాంబు నిర్మాణంలో నే.

### బాంబు సూత్రం

ఇదివరకు పేర్కొనబడిన కష్టాలన్నీ శాస్త్రజ్ఞులు దాటగలిగేరన్న మాట. ఏటంబాంబులో తేలికరకం యురేనియమును తగినంత తీసికొని, దానిమీదకు (బహుశా బెరీలియము రేడియములను కలపగా వచ్చిన) న్యూట్రానులను పంపుతారు. కొద్దిసెకండ్లలో ఆయురేనియములోని పరమాణువులన్నీ విచ్ఛిన్నమైపోయి, బాంబు ప్రేలుతుంది. దీనిని తయారుచేసేటప్పుడు విశ్వంలో ఎప్పుడూ వ్యాపిస్తున్న కాస్మిక్ కిరణాలు మొదలైనవి దీనిని ప్రేల్చకుండా జాగ్రత్తలు తీసికోవాలి. బాంబును విమానం నుండి వదలిపెట్టిన కొంతసేపటికి న్యూట్రానులు యురేనియము పరమాణువుల పైకి వెళ్ళి, బాంబును ప్రేల్చడానికి తగిన ఏర్పాట్లు జరుగుతాయి. బాంబు ప్రేలినపుడు పుట్టే ఉష్ణశక్తివిపరీతం. దాని టెంపరేచరు సూర్యుని టెంపరేచరంతవరకు అంటే ఐదారువేలడిగ్రీల వరకు పోతుంది. అందులోనుండి వచ్చే అపరిమితమైన ఉష్ణశక్తికిచుట్టుప్రక్కల నున్న వస్తువులన్నీ కరిగిపోతాయి. ఈ బాంబు ప్రేలినచోట చనిపోయిన మనుష్యులు పూర్తిగా ఆవిరిక్రింద మారిపోయారట. అంతేకాక బాంబు ప్రేలిన చోటునుండి ఎక్కువ ఒత్తిడితో గాలి ప్రవాహం వీస్తుంది. దానివలన దూరాన్నున్న అతిగట్టికట్టడాలుకూడా కూలిపోతాయి. కొన్ని చదరపుమైళ్ళ ప్రదేశమంతా ఇలాగ ఆనవాలులేకుండా ధ్వంసమైపోతుంది ఆ ఉష్ణానికి.

ఇంతశక్తి పరమాణువులోనుండి ఎలాగ వచ్చిందని చూడాలి. సాధారణంగా మన ముపయోగించే యంత్రాలన్నీ ఒకరకంశక్తిని ఇంకొకరకంలోనికి మార్చగా వచ్చినవే. ఎలక్ట్రిక్ ఫానులో విద్యుచ్ఛక్తి యాంత్రికశక్తిలోనికి మార్చబడుతూంది. ఇతరరకాల బాంబులలో రసాయనికశక్తి అనేది ఉష్ణశక్తిలోనికి, యాంత్రికశక్తిలోనికి మార్చబడుతూంది. పదార్థము వివిధరూపాల్లో వివిధశక్తిని కలిగి ఉంటుంది. ఆశక్తిని ఒకరూపంలోనుండి, ఇంకొకరూపంలోనికి మార్చడంలోనే పూర్వపు యంత్రాలు, బాంబులువచ్చేయి. కాని పైసందర్భంలో ద్రవ్యమే (matter)

శక్తిగా మారిపోయింది. ద్రవ్యంశక్తిగా మారగలదని శాస్త్రజ్ఞు లదివరకే తెలిసికొన్నారు. అలా ద్రవ్యమే శక్తిగా మారినపుడు, విపరీతమైన శక్తివస్తుంది. ఒక 'గ్రాము' ద్రవ్యం ఇలా మారినపుడు, ఇరవై మిలియను మిలియన్ల కేలరీల ఉష్ణ శక్తి వస్తుంది. యురేనియము పరమాణువు విచ్ఛిన్నమైనపుడు కొన్నికణాలు పరమాణువులువస్తాయి. విచ్ఛిన్నమవగా వచ్చిన ఈ కణాల మొత్తంబరువు యురేనియము పరమాణువు బరువుకంటె కొద్దిగా తక్కువగా ఉంటుంది. కాని ద్రవ్య నిత్యత్వసూత్రం (Law of conservation of mass) ప్రకారం ద్రవ్యం ఏదేనా మార్పు పొందినపుడు, దానిబరువు కొత్తగా వచ్చిన వానిబరువుకి సమానంగా ఉండాలి. ఇక్కడ అలాగకాకుండ కొంతబరువు తక్కువయిందంటే కొంతద్రవ్యం హరించిపోయిందన్నమాట. కాని ద్రవ్యం అలాగ హరించిపోడానికి వీలులేదే; అదేమైనట్లు? ఆహరించిపోయినద్రవ్యం శక్తిగా మారిపోయింది. అందువలననే విపరీతమైన శక్తివచ్చింది. నక్షత్రాలు మొదలైనవానిలోని విపరీతమైన ఉష్ణానికి కారణం పరమాణువులు విచ్ఛిన్నమై ద్రవ్యంశక్తిగా మారుతూండడమేనని శాస్త్రజ్ఞు లూహిస్తున్నారు.

ఏటంబాంబులో తీసికొన్న యురేనియములో 1/1000 మాత్రం ఇలాగ శక్తిక్రింద మారుతూంది. మిగతాదంతా ద్రవ్యంగానే ఉండిపోయింది. అందుకనే దీనిలో చాలా కొద్ది పదార్థం మాత్రం శక్తినివ్వడానికి ఉపయోగపడుతూందనీ; మిగతాది నష్టమైపోతూందనీ, ఇంకా ఎక్కువ భాగం పదార్థం శక్తినివ్వడానికి ఉపయోగపడినపుడు లాభదాయకంగా ఉంటుందని తెలియవస్తూంది.

శక్తిని ఒకరూపంలోనుండి ఇంకొక రూపంలోకి మార్చడంవలననే ఇదివరకు యంత్రాలనన్నీ నడుపుతూండగా, పరమాణువులోని ద్రవ్యాన్నే శక్తిగామార్చి మానవజీవితంలో ఉపయోగించ డానికి ఇదే మొదటిసారి.

కాని ఇలావచ్చిన శక్తి తొలిసారి వినాశనానికి ఉపయోగపడింది. అలాకాకుండా పరమాణువులోని శక్తి మానవాభ్యుదయం కొరకు, యంత్రాలు నడపడానికి, పరిశ్రమలు వృద్ధిచెయ్యడానికి, ఉపయోగపడగలదా అనే ప్రశ్న ప్రతివారిని వేధిస్తూంది. సుప్రసిద్ధ విజ్ఞాన శాస్త్రవేత్త ఐన్‌స్టయిన్ పది సంవత్సరాలలోగా పరమాణువులోని శక్తి మానవాభ్యుదయంకొరకు ఉపయోగపడగలదని సూచిస్తున్నాడు. అలాగే ఇంకా యెంతోమంది విజ్ఞానవంతులు, శాస్త్రవేత్తలు ఆశపడుతున్నారు.

యురేనియము, అందులో తేలిక రకం చాలా కొద్దిగా దొరుకుతుంది. యురేనియము చాలా ఖరీదైన పదార్థము. దీనినుండి శక్తిని పుట్టించడానికి ఖర్చు అపరిమితంగా అవుతుంది. ఎక్కువగాదొరకే ఇతరపదార్థమేదేనా ఇటువంటి ప్రవర్తనను చూపెడితే, అపుడు ద్రవ్యాన్ని శక్తిలోకి మార్చడం సులువు చవకఅవుతుంది. దాన్ని పరిశ్రమల్లోను ఇతర విధాలుగాను మానవాభ్యుదయానికి ఉపయోగింపవచ్చును. అలా జరిగిననాడు విజ్ఞాన శాస్త్రానికి పెద్ద దిగ్విజయం.

# రచయితల కొక హెచ్చరిక

[ఈ విషయంమీద రచయితలు ఏమైనా రాస్తే ప్రచురిస్తాము. సం. అం.]

రావు

ఇది సంధ్యాసమయం. ప్రపంచమంతటా మానవ జీవితంలో కొంత శాశ్వత పరివర్తన కలగబోతున్నది. వివిధ వృత్తులవారు, వివిధ విశ్వాసాలవారు ఒకసారి చుట్టూ కలయజూసుకోవలసిన సమయం వచ్చింది. రాజకీయాలూ, ఆర్థికాలూ, మతాలూ, ఉద్యోగాలూ, ఆచారాలూ వెనకఉన్నట్టు ముందుండబోవు.

ఈ సంధిలో రచయితల భావి పరిణామం ఏమిటి ?

ఇదివరకల్లా ఏదో బూటకం ఆడి భేషజంచేసి రాతగాళ్ళనిపించుకోవటానికి సులువుమార్గా లవలంబించాం. జీవితం మనకోసం వేచిఉండలేదు. జీవితప్రవాహాన్ని మనం తృణమాత్రం అరికట్టలేదు. అందులో కలిగిన మార్పులకి మనం ఏవిధంగానూ సహాయపడలేదు. కనీసం ఈరకంగా జరగబోతుందని జోస్యం కూడా చెప్పలేదు. మనలో ఎవరన్నా జోస్యం చెప్పిఉంటే అది నిజమయిన దాఖలాకూడా లేదు.

మన సమాజంకూడా మనఎడల అల్ప సంతుష్టే కనబరుస్తూ వచ్చింది. మనలో ఉన్న కొద్ది శిల్పానికి ఆహ్లాదం కనబరిచింది. మన అనుభవాన్నిగాని, వివేచనా శక్తినిగాని సమాజం స్తనశల్యపరీక్ష చెయ్యలేదు. బిరుదులూ, సన్మానాలూ చాలా చౌకగా లభించినాయి. మన ప్రేమ కథల్లో మానవప్రేమ లేకపోయినా, మన 'వాస్తవిక రచనల్లో అర్థంలేని ఊహలే జాస్తిగాఉన్నా సమాజం మనని ఆటే విమర్శించలేదు........ఆఖరుకు మనం అభ్యుదయరచనలు రాయటానిక్కూడా సులువుమార్గా లవలంబించాం.

ఇకముందు ఈ విధంగా వెళ్ళదనుకోవటానికి చాలా కారణాలున్నాయి. మొదటి ప్రబలమైన కారణం, ప్రజాసమూహాలని చరిత్ర తట్టి నిద్రలేపుతున్నది. "మనం ఏ ప్రపంచంలో ఉన్నాం ? ఈ ప్రపంచం ఏయే కేంద్రాల మీద పరిభ్రమిస్తున్నది ? మనజీవితాలకు కాలవలుగట్టి మురికికూపాల్లోకి ప్రవహింపజేస్తున్న శక్తులేమిటి ?" అనే సందేహాలు వారిని బాధించటం జరుగుతుంది. వాళ్ళకి అబద్ధపు సమాధానాలివ్వటానికి తయారుగా ఉండే సంఘద్రోహులున్నారు. మనరాతల్లో వారికి సమాధానాలు కనపడని పక్షంలో వారా దుష్ప్రచారాలనే నమ్ముతారు. అందుచేత మనం ముందుగా మన కనీసధర్మాలని గుర్తించటం అవసరం.

రాతగాడి కనీసధర్మాలేమిటి ? విజ్ఞానమూ, అనుభవమూ, వివేచనా, శిల్పమూ—ఈ నాలుగూ రాతగాడి ఆయుధాలు. విజ్ఞానం ఎప్పుడూ బయటినుంచి రావలసిందే. పుస్తకాలూ, సంపర్కమూ విజ్ఞానం పెంపొందిస్తాయి. అనుభవం



"ఇదే బొమ్మా?"
"ఇంకా పేరు పెట్టలేదు."
"అంచేతనే నాకు అర్థం కాలేదు."

విజ్ఞానాన్ని సమగ్రంచేస్తుంది. వివేచన చారిత్రకమైన అవశ్యకతను నిర్ణయిస్తుంది—ఎందుకంటే ఎంత విజ్ఞానానుభవాలతో కూడుకున్న రచనలయినా కాలానుగుణ్యమైన ఆవశ్యకతను గుర్తించనట్టయితే వ్యర్థరచనలే అవుతాయి. శిల్పం, లేక రచించేశక్తి పై మూటికన్నా అల్పమైనది.

ప్రస్తుతం మనలో శిల్పంమించి ఆటే దూరం వెళ్లినవారు అరుదు. మిగతా మూటిలోనూ ముఖ్యంగా మనం కృషి చెయ్యాలి. ప్రత్యేకించి విజ్ఞానానుభవాల్లో మనం సంతుష్టి ఆనేది పొందనేరాదు. ఓ పాతికసంవత్సరాలు రాయగారాయగా ప్రపంచాన్ని సింహావలోకనం చేసేశక్తి దానంతట అదే వస్తుందనుకోవటం కల్లోమాట.

ముందు విజ్ఞానం విషయంలో మన రచయితలం ఏ సామాన్యపుస్తకమ్యూనిస్టు చదివే పుస్తకాలుకూడా చదవం. రాజకీయాలను గురించి మనకు, రోజూ పత్రిక తిరగేసేవాళ్లకున్న జ్ఞానంకూడా లేదు. అనుభవం విషయంలో, ప్రజలతో కలిసి పనిచేసే కార్మిక కర్షక సంఘాల వారితో మాట్లాడే అర్హత కూడా లేని స్థితిలో ఉండి కవిశార్దూలాలూ, కథకసింహాలూ కాగలుగుతున్నాం. మన వివేచనగురించి వేరే వర్ణించనవసరం లేదు; ఏ వారపు దినపత్రికలయినా చదివి ఆ వారంలో వెలువడిన వార మాసపత్రికలు తిరగేస్తే జీవితానికీ, మనం రాసే విషయాలకూ సంబంధంలేదని ఇట్టే బోధపడిపోతుంది. మనం ఒక కథరాసినా, నవలరాసినా, వ్యాసంరాసినా, గీతం రాసినా సందర్భశుద్ధి ఉండటంలేదు.

ఏ చెత్తో రాసి మనం ఇంతకీర్తి

దురద తీర్చుకోగలుగుతున్నప్పుడు కష్ట పడి ఈ కృషి యావత్తూ ఎందుకు చెయ్యాలి? చెయ్యనిపక్షంలో మనం అప్రయత్నంగా సంఘ విద్రోహులం అయిపోయేకాలం వస్తున్నది. వెనకటి యుద్ధంలో కొన్నిదేశాలు తటస్థంగా ఉండగలిగినాయి. ఈ యుద్ధంలో తాట స్థ్యం వహించినవారు మానవద్రోహుల కింద చేర్చబడ్డారు. ఈమార్పే సంస్కార ప్రపంచంలోనూ రాబోతున్నది—వచ్చే సింది కూడానూ. రచనలకొక సాంఘిక విలవ దానంతట అదే ఏర్పడుతున్నది. అది రచనలమహిమకాదు, కాలమహిమ. కాలమహిమనికూడా సకాలంలో గుర్తించ లేని మనం రచయితల మనిపించుకునే టందుకు అర్హులం కాకుండా పోగలం. అప్రయత్నంగా మనం సంఘవిద్రోహుల కాంపులోకి వెళ్ళకుండా ఉండగలందుల కైనా మేలుకోవటం అవసరం. మేలు కున్నతరవాత మనం ఏ పక్షాన చేరు తామో నిర్ణయించుకోవటం మన చేతుల్లో ఉంది.

ప్రఖ్యాత రచయిత అనటోల్ ఫ్రాంసు వార్ధక్యంలో కమ్యూనిస్టు పక్షపాతి అయి పోయినాడు. మన ప్రఖ్యాత హిందీ రచ యిత ప్రేమచందు ఆఖరుదశలో ప్రజా రచయితగా మారాడు. ఈనాడు డజన్ల లెక్కన హిందీ రచయితలు కమ్యూనిస్టు పార్టీ పక్షపాతులైపోతున్నారు. మన దేశంలో కాంగ్రెసు ఉద్యమానికి పూర్వం రాజకీయాలను పాటించిన సారస్వత పరులు అరుదు. కాంగ్రెసు తెచ్చిపెట్టిన విప్లవం రచయితల్ని చాలాభాగం రాజ కీయవాదంలోకి దింపింది. కాని అది కూడా ఆటే దూరం వెళ్లలేదు. ఈ యుద్ధంలో ప్రజలబుర్రల్లో ఆలోచనలు రేపిన రాజకీయవర్గం కమ్యూనిస్టుపార్టీ. పూర్వం కాంగ్రెసు పిలుపువినని రచ యిత లేపౌరపాటు చేస్తూవచ్చారో ఈ నాడు కమ్యూనిస్టుపార్టీ పిలుపువినని రచయితలా పొరపాటే చేస్తున్నారు. అందుకని రచయితలందరూ కమ్యూనిస్టు పార్టీలో చేరిపొమ్మని నా సలహాకాదు— ఎవరు ఏ స్థితిలో ఏ పార్టీలో చేరతారో నిర్ణయించే భౌతికాంశాలు చాలా ఉం టాయి; వాటి నిక్కడ చర్చించటం అప్రస్తుతం. కాని నా సలహా అల్లా రచయితలు చెవులూ, మనస్సులూ మూసుకోవద్దని; రాజకీయ రంగంలో జరిగే దుష్ప్రచారాలకి మోసపోనూవద్దు, ఆ ప్రచారం గురించి నిర్లిప్తులుగానూ ఉండవద్దని.

క్రియకు, ఫలానివిషయాలు రాయి, అని రచయితకు ఎవరూ చెప్పలేరు, చెప్పరు. బియ్యానికి, ఈవిధంగా ఉడక మని ఎవరు చెబుతారు? రాసే ఉత్సాహ శక్తులు రచయిత అంతస్సులోనుంచే రావాలి. కాని ఆ అంతస్సుకు ఏర్పడే అంతరాయాలుగాని కల్మషంగాని బయటి నుంచే వస్తుంది. దాన్ని నేర్పుగా తొలగ దోసుకోమని హెచ్చరించేహక్కు ఎవరి కైనా ఉంది. ఆత్మనిర్ణయం చేసుకోమని హెచ్చరించటం నిర్బంధించటం కాదు.

తెలుగు రచయితలు ఈ విషయమై సావధానంగా ఆలోచించి, ఈనాటి జీవితానికి పరిణామంఇస్తున్న అసంఖ్యాక మైన శక్తుల్లో మనకళలు గైరుహాజరు కాకుండా చూడటమేకాక వాటికి ఉన్నత స్థానం ఉండేటట్టుకూడా చూసుకుంటా రని ఆశిస్తున్నాను.

# బ్రిటిష్ కార్మిక పక్షం

## అవతార అభ్యుదయాలు

ఇటీవల జరిగిన ఇంగ్లండు ఎన్నికలలో-కార్మికపక్షం అధిక సంఖ్యాబలంతో గెలిచింది. ప్రపంచ సంగ్రామ భారాన్ని తన భుజాస్కంధాలపై వేసుకుని మహత్తర విజయాన్ని సంపాదించి పెట్టిన చర్చిల్ మహామంత్రి శక్తిసామర్థ్యాలు ఇంగ్లండు ప్రజల నాకర్షించలేదు.

భారతీయ స్వాతంత్ర్యవాంఛ నడుగడుక్కూ అరికట్టుతూ శాయశక్తులా భారతీయ సంపదను ఇంగ్లండు ప్రజల స్వలాభానికి వినియోగించటానికి ప్రయత్నించిన అమెరీవారిని మోహపెట్టలేదు. ప్రజా సముదాయాన్ని ఇంతగా ఆకర్షించి అఖండ విజయాన్ని ఆకట్టుకొన్న యీ కార్మిక పక్షచరిత్ర ప్రతివారూ గమనించ తగివుంది.

ఈనాడు బ్రిటిష్ కార్మికపక్ష విజయానికి కారణం అదృష్టం సుతరాం కాదు. తంత్రాంగం అంతకంటే కాదు. నలభైనాలుగు సంవత్సరాలనుంచీ చేసిన సక్రమమైన కృషి; ప్రజాసేవ, ఆ విజయానికి కారణాలు.

1900 వ సంవత్సరం ఫిబ్రవరి 27-వ తేదీన ఒక నిరాడంబరమైన మామూలు ఇంట్లో కార్మికపక్షం జన్మించింది. ఆ పక్ష సంస్థాపనకు ముఖ్యులైన యిరువురిలో ఒకడు కీర్ హార్డీ. రెండవవాడు రామ్సే మేక్డొనాల్డు. హార్డీ కార్మికుడు. మాక్డొనాల్డు మితవాద పత్రికా రచయిత.

నిజానికి ఈపక్ష నిర్మాణంలో-పోషణలో ప్రథమగౌరవం హార్డీదే. మాక్డొనాల్డు ఆయనకు సహాయుడు. ఈ పక్షానికి రెక్కలు వచ్చినందువల్ల కలిగే లాభం తెలుసుకునే రామ్సే హార్డీకి సహాయంచేశాడు.

ఈ ఉభయులూ కలిసి ఆసమయంలో జరుగుతూన్న ట్రేడ్‌యూనియన్ మహాసభా ప్రతినిధులతో సమాలోచించి యీపక్ష నిర్మాణానికి ప్రాతిపదిక వేశారు. పార్లమెంటులో స్వతంత్ర కార్మికపక్షాన్ని ప్రవేశపెట్టి నడిపించాలన్నారు.

ఆలోచనే ఒక పెద్ద విప్లవంగా ఉండే రోజులవి. అందుకని కొందరీసూచనకు అభ్యంతర పెట్టారుగాని కీరు ఎలాగో వారి నొప్పించి కార్మికపక్షానికి పునాదివేశాడు. నామ్సే మాక్డొనాల్డును కార్యదర్శిగా నియమించారు. ఇంకేం, వ్యవహారం శరవేగంతో సాగిపోయింది.

కీరుహార్డీకి బాసటగా ఆర్థర్ హెండర్సను, సిడ్నీ బియాట్రిస్ వెబ్, ఫిలిప్ స్నోడెన్, జార్జి బెర్నార్డ్‌షా క్రమంగా ఒకరివెంట ఒకరు ఆ పక్షానికి అతిరథులు మహారథులూ అయినారు.

1900 లో జరిగిన యెన్నికల్లో పదిహేనుమంది అభ్యర్థుల్ని నిలబెట్టారు. కాని ఇద్దరు మాత్రమే గెలుపొంద కలిగారు. ఒకరు కీర్‌హార్డీ, ఇంకొకరు రిచర్డ్ బెల్.

1905 సంవత్సరంలో లండనులో చిన్న ఆఫీస్ ఏర్పాటు చేసుకొన్నారు. ఉత్తరప్రత్యుత్తరాలు వారే స్వయంగా వ్రాసుకునేవారు. అర్ధరాత్రివరకూ కూచుని పార్టీలో మంచి చెడుగులు విచారించుకొనేవారు. జీతాలు భత్యాలు లేని నౌకరిఅయినా ఎంతో శ్రద్ధ, ఆసక్తి వుండేవి వారికి.

పార్లమెంటు సమావేశంలో తొలిసారి కార్మిక ప్రతినిధులు ప్రవేశించినప్పుడు, బెల్ ఫోర్డ్ లాయడ్ జార్జి అది చరిత్ర ప్రసిద్ధమైన సంఘటనలని ప్రశంసించారు. కంసెర్వేటివ్ లిబరల్ పక్షాలవారికి వీరినిచూస్తే కాస్త నవ్వులాటగానే ఉండేది. కాని కార్మికులు నిరుత్సాహ పళ్ళేదు. నిరుత్సాహమంటే వారికి కిట్టనేకిట్టదు. పట్టుదల విడువకుండా పని సాగించారు.

1906 లో మళ్ళీ యెన్నికలు వచ్చినయి, దానిలో 19 స్థానాలు సంపాదించుకున్నారు. జె. ఆర్. క్లైన్సు, ఫిలిప్ స్నోడెన్, రామ్సే మాక్డొనాల్డు ఆ జయించినవారిలో కొందరు. ఇలాగే వీరదీక్షతో ముందుకు నడిచారు. అంతలోనే ప్రథమ ప్రపంచయుద్ధంవచ్చింది. దాంతో కార్మిక పక్షాభ్యుదయానికి అంతరాయం ఏర్పడింది. ఆనాటికే స్వతంత్ర కార్మికపక్షమని ప్రత్యేకవర్గం ఏర్పాటుచేసుకున్నాడు రామ్సే మాక్డొనాల్డు. ఆయనకు హార్డీకీ అభిప్రాయ భేదంవచ్చి హార్డీ అహోరాత్రాలు ప్రచారంచేస్తూ 1916 లో మరణించాడు. 1918 లో శాంతిసందేశం వచ్చేనాటికి దేశంలో మరి కొన్ని మార్పులు జరిగినవి. ఫేబియన్ సొసైటీ ప్రచారంవల్లనూ, రాబర్టు బ్లాచ్ ఫోర్డు రచనలవల్లనూ ప్రజాదృష్టిసామ్యవాదంవైపు మళ్ళింది. అదే సంవత్సరంలోనే ట్రేడ్ యూనియన్ వారు తమ సంకుచితదృష్టి వదలి ప్రజాసామాన్యానికి తమ సంఘంలో ప్రవేశం కలిగించారు. ఈ విధంగా కార్మికపక్షం బలం కూర్చుకొంటున్నా, విన్స్టన్ చర్చిల్ మాత్రం కార్మికపక్షానికి ప్రభుత్వ నిర్వహణశక్తి రాదని సవాల్ చేశాడు. అయితే 1923 వ సంవత్సరంలో ఎన్నికలు వచ్చినప్పుడు 191మంది ప్రతినిధులతో కార్మిక పక్షం మంత్రివర్గం నిర్మాణానికి పూనుకొని ప్రభుత్వభారం తలపై వేసుకుంది.

పక్షంలో ఉండే వృద్ధులు ఈ నిర్ణయాన్ని ఆమోదించకపోయినా, రామ్సే మాక్డొనాల్డు వారి సలహా త్రోసిరాజని మంత్రివర్గం ఏర్పాటుచేశాడు. తనకీ కార్యంలో తోడుగా 159 సభ్యులుగల మితవాద వర్గంతో చేతులు కలుపుకొన్నాడు. కాని వారి సహకారం కప్పల తక్కెడవంటిదని మాక్టొనాల్డు తెలుసుకోలేదు.

చివరకు పరిణామం అలాగే జరిగింది. ప్రభుత్వం రష్యాతో ఏదో సంధి చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నప్పుడు మితవాదవర్గంవారు సహాయ నిరాకరణం చేశారు. టోరీ లిబరల్ సమ్మేళనం కార్మిక ప్రభుత్వాన్నిగంగలో కలిపింది.

ఆ దెబ్బతో కార్మికవర్గం మరీ తీవ్రంగా పనిచేసింది. 1929 లో తిరిగీ 288 స్థానాలను పార్లమెంటుసభలో సాధించారు. మళ్ళీ ప్రభుత్వంలోకి వచ్చారు. ఈసారి దేశంలో దారిద్ర్యం వచ్చింది. ఆ ఆర్థిక సంఘర్షణలో కార్మిక బుద్ధికౌశలం మళ్ళీ తట్టుకోలేకపోయింది. అమెరికా అప్పుపెడతా

నంది. ఆ యేర్పాట్లను కార్మికవర్గం అంగీకరించలేదు. పర్యవసానం పద త్యాగం. ఈదెబ్బతో కార్మికపక్షం నశిం చిందని ఇతర పక్షాలవారు భావించారు.

1932 లో కార్మికపక్ష సమావేశం చాలా నిరాడంబరంగా జరిగింది. వారి తప్పులు దిద్దుకొన్నారు. పక్ష ప్రధా నాశయాలు పునర్విమర్శ చేసుకొని, వ్యక్తులకోసం కాక పక్షాదర్శాలకోసమే జీవించాలని నిశ్చయించుకొన్నారు. ఏకాభిప్రాయంతో ఏకీకృతశక్తితో గమ్య స్థానానికి చేరితీరాలని నిర్ణయించు కొన్నారు. చెదరిపోగా మిగిలిన యాభై ఒక్క మంది సభ్యులు పునః పనికి నడుం గట్టి ముందుకుసాగారు. ఈతూరి నాయ కత్వం జార్జి లాన్సుబరీ వహించాడు.

1935 లో మళ్ళీ ఎన్నికలు వచ్చినవి పార్లమెంటుకు. దానిలో 154 స్థానాలు సంపాదించింది కార్మికపక్షం. నేటి బ్రిటిష్ ప్రధానామాత్యుడైన క్లెమెంట్ అట్లీ పక్షనాయకుడైనాడు. పక్షంలో ఉన్న విద్రోహనిరాశా తరంగాలను అణచివేసి పునర్నిర్మించడమే ఆయన ఆశయం. ఆయన శక్తిసామర్థ్యాలలో పక్షసభ్యులకు విపరీత విశ్వాసం ఉన్నది. నిస్సంకోచంగా ఆయన్ను వా రనుసరిం చారు.

ఆనాడు వారి కేశాంతిప్రదాతతోనూ పనిలేదు. ప్రజాసిద్ధాంతాలకోసం పాటు పడే నాయకుడు—కావాలి. ఆ గుణా లన్నీ అట్లీ మహాశయునిలో ఉన్నవి.

అప్పుడు ఇంగ్లండు రాజకీయాలు నివురుకప్పిన నిప్పువలె అతిరహస్యంగా లోలోపల మండుతూ ఉన్నవి. వాటిని జాగరూకతతో గుర్తించి, లగువుబిగువు లెరిగి-సమయిజ్ఞతతో నడిపించగల చతు రుడే ఆ సమరంలో జయించగలడు. ఆ విషయంలో అట్లీ చూపించిన నేర్పు హెర్బర్టు మారిసన్ వంటి ప్రతిభా శాలుర ప్రశంసకు పాత్రమైంది. క్రమ క్రమంగా అట్లీనాయకత్వం దృఢపడ్డది. ఇంతలో మళ్ళీ మహా ప్రపంచసంగ్రామం వచ్చిపడ్డది. ప్రధానామాత్యుడు చర్చిల్ కార్మికపక్షనాయకులను తన మంత్రాం గంలోకి రమ్మని ఆహ్వానించాడు. దేశ క్షేమంకోసం వారా ఆహ్వానాన్ని అంగీ కరించారు. ఎర్నెస్టుబెవిన్. తన కార్య నిర్వహణంలో అప్రతిమాన వైదగ్ధ్యం చూపించాడు. నౌకాసైన్యాధికారిగా, అంతరంగిక కార్యదర్శిగా కార్మిక పక్షనాయకులే పనిచేశారు. వారి సేవా నిరతి, నేర్పు ప్రతిపక్షులనుగూడా తల లూపించింది. యుద్ధం పరిసమాప్తి ఐంది. ఇంగ్లండులో పార్లమెంటుకు ఎన్నికలు పెట్టారు.

కార్మికపక్ష చరిత్రలో 1945 లో ఎన్నికల ఫలితాలు చరిత్రప్రసిద్ధమైనవి. ఇంతటి మహా విజయం కలుగుతుందని ఎవ్వరూ తలంచలేదు. కాని బ్రిటిష్ ప్రజలు కార్మికపక్ష సిద్ధాంతాలలో— నాయకత్వంలో అపూర్వమైన విశ్వాసం చూపించి అధిక సంఖ్యాబలంతో వారిని యెన్నుకొన్నారు. వారు నలభైఅయిదు సంవత్సరాలుగా పడ్డ శ్రమ ఫలించింది. అట్లీ మహామాత్యుడు ప్రజావిశ్వా సాన్ని తప్పకుండా చరితార్థంచేసి తీర గలడని విశ్వసించవచ్చు.




ఏదో బతుకుతో వుండడంతప్ప; ఒకటి కావాలనిగాని, ఒకదానినించి తప్పించుకుందామని గట్టిగా ప్రయత్నించడంకాని చాలామంది మనుషులకి వింత. రోజూ చేసేపనులే అట్లా తిరిగి తిరిగి చేస్తోవుండడం, ఏదన్నా కష్టం వొస్తే ఏడవడం.—ఏమీ పట్టకండా, మనుషులసంగతీ, పరిస్థితులసంగతీ అర్థం లేకండా మాట్లాడడం, ఇంతే జీవితం. రైళ్లల్లో, క్లబ్బుల్లో, మనుషులు మాట్లాడుతోవుంటే, ఇంత ముఖ్యమైన సంగతినీ, ఇంత ఘోరమైన సంగతినీ, ఇంత గొప్పకళనీ, ఇంత అందమైన దృశ్యాన్ని, ఏదో తేలికగా మాట్లాడతారేమిటి, ఏమీ పట్టనట్టు,...వీరు చాలా గొప్ప వేదాంతులా అనిపిస్తుంది. ఏమీ మనసు పైపొరలనించి కిందికి తీసుకోరు.

...“ఈ కూరలో ఉప్పెక్కువయింది,
లోకంలో క్షామం ఎక్కువయింది.”

“షర్టు చాకలి తెల్లగా వుతికాడు... ఈ ఉదయం ఉషాకాంతి గొప్పగా వుంది.”

“బండీవాడు, ఒక అణా అన్యాయంగా కాజేశాడు......యుద్ధంపేర దేశానికి యాభైకోట్లు అప్పయింది.”

“సినీమాలో ‘మావారు తాసిల్దార్’ బావుంది...కృష్ణశాస్త్రిగారి ‘వెదకి వేసారి...’ బావుంది.”

ఈ వాక్యాలన్నిటికీ ఒకటే విలవనిచ్చి మాట్లాడతారు.

ఇట్లా చితకడంతప్ప, సుఖంలో బాధలోకూడా గొప్పగా జీవించడం అంటే ఏమిటోకూడా అర్థంకాదు. అందువల్లనే గొప్ప మోహాన్నిగాని ప్రేమనిగాని చూసినప్పుడు అర్థంకాక, తమకి అర్థమయ్యే, కామం, ధనం, మదం, చపలత్వం, ఇట్లాంటి కారణాలు ఆరోపిస్తో మాట్లాడతారు. దేహాలతో పూర్తిగా లోతుగా అనుభవించడం కూడా చాతకాదు. చాలామంది స్త్రీలకు, పిల్లల్నికన్న గొప్పతల్లులకు, శరీర వాంఛ అంటేకూడా తెలీదు. ఎదో భర్తచేసేపనిని చూస్తోవూరుకున్ని, భారం మోసి, పదినెలల తరవాత బాధపడి, ముక్కి, బైటపారేస్తారు. ఇదీసృష్టి. పురుషులూ అంతే. శరీరం మామూలై, ఏంసుఖంలేక, శరీరాన్ని తృణీకరించి, ఏదో మనసులో గొప్పగా బతుకుతున్నామని, వీడు వ్రాసినవీ, వాడు వ్రాసినవీ, లేకపోతే సూత్రాలూ, వేదాంతాలూ మాటాడుకుంటో తిరుగుతారు. నీతీ, పాతివ్రత్యం అనే మాటల్ని వాటి అర్థం ఏమాత్రం తెలీకనే, స్త్రీని తాకనంతమాత్రాన చాలా గొప్ప నీతిపరులమనుకుంటో బతుకుతారు.

...క్రమంగా ప్రజలకి దేహం నీచమయిపోయింది. కమ్యూనిజంలో దేహంతో పనిచేసేవాళ్ళకి ప్రాముఖ్యత వొచ్చిందని సంతోషిస్తే, దేహ ప్రాముఖ్యతకన్న వాళ్ళదరిద్రం వాళ్ళకి ప్రాముఖ్యతనిచ్చింది. దేహంతో పాటు పడడం ఘనతగాని, దేహంతో అనుభవించడం నీచమే అయింది. శుభ్రంగా తిని నిద్రపోయేవాడికన్న, మనసుతోనో ఆత్మతోనో అనుభవిస్తున్నాననేవాడు గొప్పవాడైనాడు; ఇది యీచదువుకివొచ్చిన ప్రాముఖ్యంవల్ల కలిగిన ఇబ్బంది. భార్యతో పక్కలోచేరిన మనిషికన్న, తెల్లార్లూ శృంగారకావ్యాలు చదివే మనిషి ఘనత కెక్కాడన్న మాట. ప్రియురాలితో సంగమం వర్ణించడంకన్న శృంగారాలు వ్రాసే కథకుడు గొప్ప. ఆశృంగారమూ వ్రాయకండా, వుత్తగసాలూ, వంటలూ, పిల్లలరొదలూ, లేకిసల్లాపాలూ వ్రాసేవాడు అంతకన్న గొప్ప. అసలు ప్రేయసిని, తల్లీ, దేవీ, పార్వతీ, యమునా, మబ్బూ, పరమాత్మా అనే కవులు అంతకన్న గొప్ప. దేహంలో కామరసం చేరకండా, శృంగారం, ప్రేమా, కవిత్వం, ఇట్లాంటి పదాలకి, దేనికీ అర్థంలేదన్న సంగతి, ఎవరి Sex జీవితాన్ని వాళ్లు కొంచెం గమనిస్తే సులభంగా అర్థమౌతుంది. కాని పవిత్ర సోదరులు మాత్రం, శుభ్రంగా ఆరోగ్యంగావున్న యువకులుకూడా, సోదరప్రేమా, గుణాల మీదిప్రేమా, ఆత్మసంయోగం, యీ 'రాట్' అంతా మాట్లాడుతూనే వుంటారు. మొత్తానికి జీవితమంతలోనూ కూడా, శరీరానుభవంకన్న, మానసికానుభవం, ఆత్మానుభవం, విలువకెక్కాయి. సుఖంగా చన్నీటిచెరువులో యీతలుకొట్టేవాడికన్న, గట్టునకూచుని నీటి చల్లదనాన్ని వర్ణించేవాడూ, ఆ నీళ్ళని మంత్రాలు చదువుతో, నెత్తిన చల్లుకునేవాడూ శ్రేష్ఠులైనారు. మూలపుస్తకంపట్టుకుని చదివి చదివి పరీక్షలు గట్టెక్కుతో, అన్ని సంతోషాలకీ, స్నేహాలకీ దూరమై ఎండిపోయే కుర్రాడు, సుఖంగా తిని, తిరిగి, గొప్పవిశాలత్వాన్ని, ఉత్సాహాన్ని వెలవరించే కుర్రాడికన్న గొప్ప. సుఖంగా తిరిగి నవ్వి, ప్రేమించి, తన జీవితమే కళకిందవెలిగే మనిషికన్న, మూలకూచుని మూలుగు మ్యూజింగ్సు వ్రాసే అతనికి విలువ ఎక్కువ.

యూరప్‌లో ప్యూరిటన్లూ, 'తూర్పు దేశాలతో యీ వేదాంతులూ సుఖాన్నే నాశనంచేశారు ప్రజలకి. ప్రజల్ని నరకభయాలతో దడిపించి, సుఖాలు వొదులుకోడంలో ఏదో సుగుణముందని మెప్పించి, అనుభవాన్నే అసహ్యంచేసి పెట్టారు. సుఖమనుభవించే మనిషికిఎంతకీ ఆనీచత్వం, ఆలోకువా, భయం వొదలక— యీదేహానికీ, ఆనమ్మకాలకీ సామరస్యం కుదరక, జీవితం చాలా బాధకరం అయిపోయింది. ఈ కొత్త restlessness కి చాలావరకు అదే కారణం. ఆ పాతమతస్తుల పుత్రులే టాల్‌స్టాయ్, గాంధీ. వారి మనమలు కమ్యూనిస్టులు.

సుఖంగా, సంపూర్ణంగా బతకడంకన్న ఏ ఉద్దేశ్యానికో, యత్నానికో, తననిచ్చేసుకున్నవాడివల్ల లోకానికి ఏ ఉపకారం జరిగినా, అతని జీవితం దుర్భరం. అతనివల్ల తాత్కాలికంగా ఏపని జరిగినా, దానివల్ల చివరికి అనర్థం తప్పదు.

జీవించడం ఆనందంకోసం అనే పథంనించి తప్పి, జీవించడం అర్పణకోసం అనే భావం ఆత్మహత్యా హేతువు. ఈనాటి దేశప్రజలకైనా సరే, ముందుయుగపునాటి వారికైనా సరే. విద్యకి, జ్ఞానానికి, ధనానికి, మర్యాదకి, మతానికి, ఈశ్వరుడికి, ఆత్మస్వరూపానికి-దేనికైనాసరే.

ఇట్లాంటి ఆశయాలు పెచ్చుపెరిగి, బళ్లల్లో బోధించి, అరణ్యానికిపోయి బతుకు పాడుచేసుకున్న శ్రీరాముణ్ణి గురువునిచేసి, జీవితంలోంచి సారాన్ని సుఖాన్ని సంతోషాన్ని పిండి పిప్పి చేశారు. నీ దేశంకోసం నీ ప్రాణాన్ని సుఖాన్ని అర్పించనీమనే యీ బోధనలే యీ లోకసంగ్రామాల్ని కలిగించాయి. ఈ బోధనలమత్తు నిషా ఎక్కకపోతే, లక్షలిట్లా ప్రాణాల్ని అర్పించరు. విపరీతమైన బలులుకోరే యీ రాక్షసి ఆశయాలు, దేశం, మతం, కర్తవ్యం, వీటితో ఘోరమౌతోంది ప్రపంచం. ఒక్క గుండుదెబ్బతోచచ్చి మన్నయ్యే నీకు, ఇంక ఆశయం యేమిటి; భక్తేమిటి? ముందుప్పుడో ఎవడో సుఖపడతాడో, నాశనమౌతాడో నీత్యాగంతో, కాని యీనాడునువ్వు నాశనంకావడం నిజం. బతికివుంటే, ఆదర్శాలో, కలలో, సుఖమో! చచ్చేవాడికి, ఇంకా మిగలకండా మన్ను అయ్యేవాడికి నీకెందుకు యీ గోల! ఎప్పుడో అప్పుడు చస్తాముకదా అంటారా, సుఖంగా ఇంటిదగ్గర అన్నీ తీర్చుకుచావక, ఇంకోళ్లని గాయంచేసి చంపి, నువ్వు కాళ్లు చేతులూ విరుచుకుని బాధపడి చావడమెందుకు?

ఈ కమ్యూనిజమూ అంతే. బిచ్చగాడి జీవితంలో, బీదవాడి జీవితంలో సుఖం లేకపోలేదు. చాలసార్లు, గుమాస్తా జీవితంలోకన్న, ధనవంతుడి జీవితంలోకన్న చాలా ఎక్కువసుఖం సంతోషం, తృప్తి, వున్నాయి. సంతోషం, సుఖం, అందం, అన్నీ బూర్జువా శబ్దాలైనాయి వాళ్లకి. జీవితంలో తిండీ, బట్టా, ఇల్లూ, ఎందుకు? అవి తీరింతరవాత సుఖపడడానికి. అందాలూ ఆనందాలూ అనుభవించడానికి. కమ్యూనిజం స్థాపించింతరవాతకూడా శ్రమ, శ్రమ, శ్రమ. పండించు, కల్పించు, తయారుచెయ్యి, కష్టించు, నిరంతర శ్రమ.

జీవితంలో బాధలున్నాయి. వాటినించి చాతనైనంతవరకు తప్పించుకోవాలి. ఇతరులని తప్పించాలి. వీలైనంతవరకు బాధలువున్నా, ఎంత సుఖం, ఎంతఆనందం, ఎంతశాంతి! బాధపడుతున్నామంటే రోజులో ఏ నాలుగు గంటలో పడ్డా, ఆబాధని మరిచి సుఖిస్తున్నామన్న సంగతి మరుస్తాము. అంతా 'ఆకలి, ఆకలి, ఆకలి.' జీవితంలోవున్న సుఖాలకి అంధులై, ఏదో మనసులో ఉద్రేకింపచేసుకున్న అన్యాయాలమీదా, ఆశయాలమీదా మనసు నిలిపి బాధని వడపోసి తాగి మత్తెక్కించుకుని, విలువల్ని నరుకుకుని, ఘోరరాక్షసులవుతున్నారు మనుషులు. పక్కదేశాలవాళ్ళమీద కోపాలు పెంచుకుని యుద్ధాలు, ధనికులమీది ద్వేషంతో విప్లవాలు, మతంమీది మమతతో ఉపవాసాలు - ముళ్ళమీద పడుకునే మూర్ఖులకి, అగ్నులలోమాగు అవివేకులకీ యీ ఉద్యమాలవాళ్ళకీ భేదం చాలా తక్కువ. మతాల్ని విరోధించే యీ

కమ్యూనిస్టులంత మూఢమతస్థులు వేరు లేరు. ధనాన్ని, కామాన్ని, దేనికి అధికమైన విలువనిచ్చిన మనిషిజీవితమూ ఇదేవిధం. నాకేమీ అఖర్లేదని, ఇంకా గోచిగుడ్డకీ, ఉలవలకీ, దిగేమనిషికీ, ధనార్జనే సాధనమనే మనిషి చాలా సమీపస్థుడు. సినీమాల Fox కోట్లు గడించారు. అతని జీవితచరిత్రచదివితే, అంతకన్న సుఖంకోరని బైరాగి కనపడడు. ఇట్లాంటి వెర్రిపట్టుదలలు, శక్తివంతుడికి పట్టినప్పుడు, దాన్ని ఆదర్శమని, లక్షల్ని నమ్మించి, యుద్ధాల్ని, విప్లవాల్ని, మతభూతాల్ని తయారు చేస్తాడు.

*

'నాకేంకావాలి.? నాకేంసుఖం!' అని యోచించుకునీ సిరఫడక, 'అతనికి ఇదివుంది, అత నిదిచేశాడు, అత నిది చెప్పాడు - అతనేం చెయ్యమంటున్నాడు? దేనికి అర్పిద్దాం? ఏంచేసి ఘనత కెక్కుదామనే' అశాంతే, యీ లోకపుleaders and preachersకు బోధనలకి చోటిస్తోంది. అన్నిట్లోకీ యీ యెగబాకడం, చదువుతో, ధనంతో, కీర్తితో, స్త్రీతో, ఉద్యోగాలతో, మతంతో, ఎదో బావుకుందామనుకోడం. ఇవన్నీ వుండాలి. కాని అవి తనసుఖానికి సాధనాలు కావడానికి. ఉన్నన్నాళ్లూ, అర్పణ, బాధ, యత్నం- ఇంతలో-చావు. తరవాత - ఏమిటో? ఆయశం, అర్పణ, భక్తి, సమస్తమూ నీ సుఖానికి. నీ విశాలత్వం, కవిత్వం, కలలు అన్నీ నీ సుఖానికి.

ఈనాటిబాధ, రేపటిసుఖానికి. చచ్చింతరవాత దాచుకోడమంత, తన సుఖాన్నీ, జీవితాన్నీ, దేనికో (సుఖాన్నివ్వంది) అర్పించుకోడమంత తెలివితక్కువ ఇంకేం లేదు.

ఎవరో వొకరు అక్కడక్కడ పుడతారు, మతాలకీ, దేశాలకీ, కవిత్వాలకీ. వాళ్ళకి దాంటో తప్ప సుఖంలేదు. వాళ్ల నాపని కానిచ్చుకోనిండి. చాలామంది యేగొడవా లేకండా హాయిగా బతకడానికి పుట్టాం. దేశాలైనా, మనుషులైనా, ఎదో ఎక్కణ్ణించో, వాణిజ్యంతోనో, కృషితోనో తెచ్చుకుందామని గోలపడక చుట్టూవున్న సుఖాన్ని చూసుకుంటే హాయిపడతారు. మేమిట్లా బోధిస్తోనే వుంటాం - భక్తీ, అందం, వైరాగ్యం, శృంగారం, త్యాగం - ఆమాటలు వినకండి.

భారతయుద్ధం చదివితే, సందేహం. ఆ యోధులు పదిమందీ ఒకరితో ఒకరు యుద్ధంచేసుకుని, ఉన్న అస్త్రాలేవో ప్రయోగంచేసుకుని విజయం నిర్ణయించుకుంటే సరిపొయ్యేదానికి యీ అక్షౌహిణీల్ని ఎందుకు వెంటపెట్టుకుపోయినారని! డాబుకీ, కీర్తికీ, చచ్చి యుద్ధభూమిని అలంకరించడానికి మాత్రమే అనిపించేది. అట్లానే యీ యత్నాలన్నీ యీనాడుకూడా! మా బోధనల్ని విని, మాకు ఘనతనీ, తృప్తినీ, ఇవ్వడానికి తప్ప మీ శిష్యరికం మీ కెందుకూ కొర కాను. మీసుఖం మీరు చూసుకోండి- అనే నామాటనికూడా వినకండి.

మనస్వేచ్ఛవల్ల, ఇంకోరిస్వేచ్ఛను, భార్యదిగాని, బిడ్డదిగాని, నౌకరుదిగాని, కుక్కదిగాని, స్వేచ్ఛను అరికట్టకండా, మన ప్రవర్తనవల్ల ఇతరులకి బాధకలగకండా బతకడమంత గొప్ప ఇంక కనపడదు.

ఈదేశంలో artistic sense పూర్తిగా

నశించింది — సుందరమైన ప్రదేశాలు — నదీతీరాలు,వృక్షచ్ఛాయలు,వాన కడిగిన కొండ ప్రదేశాలు, సరస్సులు-మైదానాలు-అన్నీ పొట్టభారం తీర్చుకోడానికి మాత్రం వుపయోగపడుతున్నాయి. "ఎంత అందంగావుంది? ఇక్కడ కొంచెం సేపు కూచుందామా?" అనుకున్నామా, కొంచెం సరిగాచూస్తే, అక్కడో తెలుగు సోదరుడు అంతకు ముందే ఆస్థలం అందంచూసి, అక్కడ కూచునిపోయిన మురికి గుర్తు కనపడుతుంది. స్త్రీలో అందంకూడా చాలా మంచి రసికులైన సోదరులలో— యిట్లాంటి భావాల్నే పురికొల్పుతోంది.


అంతేకాదు ఏ అందమైన విలువల్ని చూసినా అమితమైన కోపం. తమచేతికి చిక్కిందా దాన్ని ధ్వంసంచేసిందాకా నిద్రపోరు. దూరమైనదాన్ని, అది స్వంతమైన అపకారమైనట్లు మండి పడతారు. అమితమైన కసి. ఇంకోడికి అందంమీద విలవలూ, దృష్టీవున్నా సరే. కృష్ణశాస్త్రిగారూ—

"దారి తలయెత్తు నింతసౌందర్య లవము.

వదలిపోలేరు చంపెడువరకు వీరు."

నిజం. ఈ మనుషులేకాదు. మన కళని ఆరాధిస్తున్నామని మన పక్కన చేరే మిత్రులు! భక్తులుకూడా.

ఎన్నిచోట్ల, ఎంతమంది నోళ్లలోంచి వింటాము చుట్టూ జరిగే యీ స్త్రీ పురుష సంబంధాలసంగతి. ఎడ్వర్డు దగ్గిర్నించి ఏనాదిపడుచుదాకా—ఏ విషయంలోనూ ఏ సంబంధంలోనూ, "వాళ్ళ ఇద్దరికీ 'ప్రేమ' గావును" అనరు. ఎంత సంస్కారంవున్నా శృంగారం విలవ మనిషిదగ్గిర్నించీరాదు. ఆమాట 'ప్రేమ' అని వొప్పుకోడం వాళ్ళ self-respectకి ఆత్మగౌరవానికి అమితమై గాయంలాగు తోస్తుంది. ఆ లేచిపోవడానికిగాని ఆ మహాత్యాగానికిగాని, ఆత్మహత్యకిగాని, అర్థం-ఏదన్నా యోచిస్తారు, ఎన్నో వంకర్లుతిప్పి, బుద్ధిలేని కారణాలన్నీ ఆరోపిస్తారు, కాని సులభంగా, సహజంగా, సరళంగా కనపడే విషయం, వాళ్ళిద్దరిమధ్యా విడవలేని, అభ్యంతరాలు ఆగిచూడలేని. ప్రేమ అని అంగీకరించరు. బుద్ధిమంతులూ సాధారణంగావుండే complexes లేనివాళ్లు కూడా, స్త్రీ పురుష సంబంధంలో వుండే ధర్మాన్నేగాని, ఆధర్మానికి తప్పిన అందాన్ని ఒప్పుకోడం ఇష్టలేక, ఏవో నీచకారణాలు ఆరోపించే అలవాటునించి తప్పించుకోడం చాలా కష్టమైపోయింది. ఓనాటి రాత్రి, మహమ్మదీయ మతంపుచ్చుకుని మహారాణిఐన మగువసంగతి మాటల్లోకి వొచ్చింది. చూస్తున్నాను నామిత్రుడు ఏంవూహిస్తాడో అని.. ఇబ్బందులు, ఆశలు, పదవులు. అభ్యంతరాలు, అపవాదులు అన్నీ కారణాలుగా పేర్కొన్నాడు. ఒకదాని తరవాత ఒకదాన్ని నేను సహేతుకంగా కాదన్నాను. కాని చాలా స్పష్టమైన విషయం, చప్పున చంటిపిల్లలకైనా కనిపించేకారణం, వాళ్లుపడ్డ శ్రమని, చూపిన సాహసాన్ని, ఏమాత్రం గ్రహించినా స్పష్టమయ్యేది, వాళ్ళమధ్య గొప్ప ప్రేమ-ఒకరి నొకరు విడిచి వుండలేని మమత. ఆదే నిలవనీక హృదయాల్లో గొప్ప దాహమై, జీవితాల్లో అగ్నిఐ దహించకపోతే, అనివార్యాలైన ఇన్నిఅభ్యంతరాల్ని ఎదిరించవలిసిన అవసరంలేదు. దేశమంతా



‘నేనుతెచ్చిన ‘కుల స్త్రీ’ పత్రిక అమ్మాయికి ఇచ్చావా?’
‘ఆఁ. అప్పుడే చదువనుకూడా చదివి సంపాదకుడికి తన అభిప్రాయం కూడా రాసింది.’

మారుమోగిన యీ ప్రణయగాథని రైళ్ళల్లో, వూళ్ళల్లో, ఉల్లాసంగా చర్చించడం విన్నాను. అది జరిగిందని ప్రతివారికి బాధా, హేళనా. ఎడ్వర్డు చరిత్ర తరవాత, మన దేశంలోకూడా, ఐశ్వర్యవంతుల్లో పదవుల మర్యాదల్లో పాతుకుపోయిన హృదయాల్లోకూడా ఈనాడు ఇంకా ప్రేమవిలువలు; ఇంకా ఇంత స్ఫుటంగా, ఎక్కడో కథలలో కాక మనుష్య జీవితాన్ని పరిపాలిస్తున్నాయి అంటే నాకుకలిగే సంతోషాన్ని, గర్వాన్ని. తెలిపితే అర్థమాతుందా? అవినీతిఅనీ, అమర్యాద అనీ నేను హర్షిస్తున్నా నంటారుగాని!

మామూలు దోవనించి తొలిగి, సాహసంచేసి కలుసుకున్న స్త్రీ పురుష సంబంధం సంగతి తెలీగానే, "ఎంత ప్రేమ-అఖరికి ఎంత ఆకర్షణ!" అనిపిస్తుందినాకు. అవికాక వేరే తక్కువ కారణాలవల్ల వాళ్లు ఆ స్టెప్ తీసుకున్నట్లు తెలిస్తే ఆశ్చర్యమాతుంది. కాని చాలామందికి, కళ్ళఎదుట స్పష్టంగా కనపడేప్పుడుకూడా, ఆ పరిస్థితులనించి ఎటువూహించినా స్పష్టంగా ప్రేమేనని తేలేప్పుడుకూడా, కళ్లు గట్టిగా ప్రయత్నించి మూసుకుని వేరే కారణాల్ని చాలా శ్రమపడి ఆరోపించడానికి తమ బుద్ధి చాకచక్యాన్ని వినియోగించడం చూస్తాను. "ఒకరిమీద ఒకరికిఇష్టమవకూడదా?" అని అడిగితే "ఉండవొచ్చు లెండి. కాని...' ఆ ఇష్టం వుండడమనేది చాలా చివరికారణం.

ఎందువల్ల ఇంతకష్టం ఏ ఇతరవుద్దేశ్యము లేని sex ఆకర్షణని, మోహాన్ని వొప్పుకోడం? దానిమీది అసహ్యమా, లేక అది ఇతరులలో వుందని వొప్పుకుంటే, తమకి తమే లోకువైపోతారా?

Family అనే పుస్తకంలో—

"your pass" repeated the Japanese officer and his yellow hand pulled the professor's

sleeve. Slowly the latter turned and looked with sad eyes at the officer and the two soldiers with guns standing behind him and asked gently "Brothers, what do you want of me?"

"Who are you? your nationality?"

"I am a Utopian" said the professor after a slight pause.

"The name of your country" insisted the officer.

"Utopia is my country" said the professor in the same low and sad voice.

The Japanese officer had evidently never heard of Utopia. For one moment he was in suspense, then he asked, "Where is it? what kind of country?"

"It is a small isle" said the professor. "we are the smallest nation in the world...the utopians."

"What is it famous for?" asked the Japanese officer.

"What is manufactured there? what kind of goods? what sort of trade?"

"Friend!" said the professor, "We have no factories, no trades no armies, nothing, we are poor."

"But what are you doing there usually?"

"We are all poets and philosophers there" said the professor, and his voice broke.

A slight movement went across the officer's tense face. It began near the eyes and died somewhere behind his cheekbones.

Again he, looked at the professor, and said nothing more. Asking neither for pass nor passport, he trod wearily away.

ధనమూ, కీర్తీ, విలువలుగాక వేరే విలువలతో బతికే మనుషులు ప్రపంచానికి శత్రువులూ, ఉన్మత్తులూ ఐనారు. శరీరసుఖానికే బతికేవాడు నీచుడూ, పశువూ, ఏ ఆశయానికో, అన్వేషణకో, కళకో, జీవితాన్నర్పించే వాడు పిచ్చివాడు. పెదవివిరిచి గొప్పగా చిరునవ్వుతో, తోసేస్తారు అట్లాంటి మనుషుల్ని. ఇద్దరు మోహించుకుంటు న్నారన్నా, పెళ్ళికానివాళ్లు కలుసుకు న్నారన్నా, కోపం ఎందుకంటే- తెలుసు మనుషులకి వాళ్లు ఏదో తమకి అందని సుఖం అనుభవిస్తున్నారని. భార్యాభర్తల మధ్య రానిసుఖం, ఆనందం ప్రియులకి కలుగుతున్నాయని. గోజా గొట్టీలలో శవాలమల్లే బతకకండా, ఏదన్నా సుఖానికై ప్రయత్నించారా, మండిపడతారు మనుషులు. ఏ బాధని తీసెయ్యడమన్నా, కొత్త సుఖాన్ని య్యడమన్నా ఎంత కోపం!

"లేనివాండ్లకి తిండి, బట్ట..."
"పిల్లలకి ఈ చదువులుమాన్పించి"
"గుమాస్తాలకి యీ బండచాకిరి."
"ఆడదానికి యీ నీచపుసేవ..."
ఇవేవన్నాసరే ఎంత ద్వేషం!

"ఎవరో ఎక్కడో సుఖపడిపోతు న్నారు, మామూలు మత్తుబతుకు గాక, ఏదో సుఖానికై ప్రయత్నిస్తున్నారు. ఎట్లా భరించడం? ఊరుకుంటారేం చూస్తూ! అడ్డుపడరేం?"

అంటున్నట్టుంటాయి మనుషులకళ్లూ,



'అడయార్‌కి ఒక టిక్కట్టివ్వండి'
'యు అన్‌సివిలైజ్‌డ్ ...'
'క్షమించండి, నేను కండెక్టరనుకొన్నాను.'

మాటలూ. పశ్చిమదేశాలవాళ్ల భోగలాలసత్వం తలుచుకుని ఎన్ని నురగులు కక్కుతారు, యీ క్లబ్బువాలాలు!

అదిగాక ప్రజలందరికీ సమానంగా పంచాలి, అనే దారిలోంచి ప్రజలందరూ సమానులనే భావం వుత్పత్తి అవుతోంది. చాలా మనుష్యం అది. సమానులు కానీ కాకపోనీ, తిండి దొరక్కండా అడ్డపడడం, లోకంలో ఆహారంవుండగా అది అందరికీ అందకపోవడం అందకండా చూడడం అన్యాయం. అక్కడ ఆగలేదు ప్రజలు. ఆగనూ అక్కర్లేదు.

కాని ధనమూ, ధనంలేకపోవడం అనేదే భేదం. అదిపోవాలి. ఇంక ఏ భేదాలూ లేవు. జండావాడూ ఐన్‌స్టీన్, మా వెంకమ్మ, టాగూరు, జరమయ్య కాళిదాసూ, పి. సి. రే, పకోడీలమనిషి, జవ్హార్‌లాల్, అందరూ వొకటే మనుష్యులన్నా ఇబ్బందిలేదు. తెలివినీ, త్యాగాన్నీ, గొప్పకళనీ ఈ మనుషులు చేసే ప్రయత్నాలూ చవకచేయకపోతే! మనిషి వొంటిఅందం, మనసుఅందం, విశాలత్వం, తీవ్రయత్నం, వీటి విలువలు పోతున్నాయి. ఆ ప్రకారం, హిమాలయం, సూర్యోదయం, మారుతరుతం, వీటిల్లోనూ అందాలు నశించాలి. మనిషి సామాన్యుడే, సమానుడే. ఆకలిపాటలు తప్పతక్కిన ఏ మానవసృష్టి సామాన్యమైతే—పనుల్లో, మాటల్లో, ఆలోచనల్లో అందాలే వొదులుకుంటే, తిని, శృంగారమేలేక కని...బతుకు ఎంత దుర్భరం!

"కొందరన్నా భాగ్యవంతులుంటే, వాళ్లసంతోషాన్ని చూసైనా మేం సంతోషిస్తాము. ఏనాడో మేముకూడా సుఖపడతామని కలలు కంటాము. కాని అందరం సమానులమైననాడు ప్రయత్నించడానికీ, కలలుకనడానికీ ఏ ముండదు. జీవితానికి. ఎంత ఎడారి."

అంటాడు బెక్కెట్.

ఆకల్ని తీర్చుకునే ప్రయత్నంలో మనుషులిన్ని వంకర్లు తిరగవలిసిన అవసరంఏమో అని ఆలోచించకొద్దీ, ఇది వుత్త ఆకలిఅవసరం కాదనీ, లేనివాళ్ళ మీది జాలికాదనీ, ఇంకేవో మనుషులకే తెలీని యీర్ష్యలు ప్రోత్సహిస్తున్నాయని సందేహం కలుగుతుంది.

ఇప్పుడు మనుషులు అనుభవించేదల్లా, ఎవరో అనుభవించి వర్ణించి వొదిలిన ఎంగిళ్ళు-మరీ ప్రస్తుతం సినీమాల ఎంగిళ్ళ ఎంగిళ్ళు-రసంలేని వుత్త పులిస్తరాకు నాకుళ్లు, కుక్కకూడా దూరంనించి వాసనచూసి తల తిప్పిపొయ్యే డబ్బా మిగుళ్ళు.

# బ్రిటిష్‌వారి బాకీ*

సంగ్రహకర్త
కె. కె. రావు

ఈ నాడు బ్రిటను భారతదేశానికి సుమారు రు 1400 కోట్లు బాకీపడి ఉంది. మనదేశపు సాలుసరి ఆదాయంలో ఇది ఇంచుమించు సగం. రైళ్లూ, ఇతర ట్రాన్స్‌పోర్టులూ మినహాయిస్తే మనదేశపు పారిశ్రామిక పెట్టుబడి ఈ బాకీలో సగంకంటె ఉండదు. ఇది మనం సమృద్ధికొద్దీ ఇచ్చిన అప్పు కాదు; మన బానిసత్వాన్ని ఆసరా చేసుకొని ఆర్థిక–రాజకీయ వొత్తిడిచేత మనవద్ద బలాత్కారంగా పుచ్చుకున్న అప్పు.

నవంబరు 1939 లో, యుద్ధం సాగిన రెండునెల్లకి మనదేశానికీ బ్రిటనుకూ మధ్య ఒక ఆర్థిక ఏర్పాటు జరిగింది. దాన్ని అనుసరించి భారతదేశం ఇక్కడ చేర్చుకోబడిన సైనికులందరి ఖర్చులూ, వారు దేశంలో రక్షణసైన్యం కింద ఉన్నంతకాలమూ భరించి, వారిని దేశాంతరాలకు పంపగానే వారికింద–జీతాలూ, భత్యాలూ, తిళ్లూ, దుస్తులూ, పరికరాలూ వగైరాలకు–చేసిన ఖర్చు బ్రిటిషు ప్రభుత్వంనుంచి రాబట్టుకొంటుంది. ఈవిధంగా మనం పంపిన సైనికుల ఖర్చులు తామే భరించటానికి ఒప్పుకుని, బ్రిటిషు ప్రభుత్వంవారు మన రాజకీయ పార్టీలతో (కాంగ్రెసుతో) ఎటువంటి పరిష్కారమూ లేకుండా పని జరుపుకున్నారు. ఈ విధంగా సామ్రాజ్యంకోసం పోరాడగలగటమే గాక భారతదేశాన్ని కోల్పోవనవసరం లేకుండా చేసుకున్నారు. అధికారం వదలిపెట్టకపోయినా భారతదేశంమీద భారం లేకుండా చేసిన కీర్తి బ్రిటిషువారు దక్కించుకున్నట్టు ప్రపంచానికి కనపడ్డది. కొంత నరబలి భారతదేశం నించి పుచ్చుకుని యూరపులోనూ, మధ్య దూరప్రాచ్యాలలోనూ నిలబెట్టేస్తే పని గడిచిపోయేటట్టు కనిపించింది బ్రిటిషువారికి.

కాని యుద్ధం విస్తరించి ప్రపంచం అంతటా అంటుకుని సామ్రాజ్యవాదుల ఆలోచనలు తారుమారు చేసింది. మొదట్లో అంచనా వేసుకున్న మనుషులూ, డబ్బూ, పరికరాలూ, ధూపానికి రాలేదు. సామ్రాజ్యాన్ని బానిసత్వంలో ఉంచే ఉద్యమం చాలా భారీ అయి ఊరుకుంది.

జపానుతో యుద్ధం సాగించటానికి భారతదేశం ప్రధాన క్షేత్రంగా పరిణమించింది. భారత సరిహద్దులు కాయటానికి అంతులేని బ్రిటిషు, అమెరికను సైన్యాలను పంపవలిసొచ్చింది. స్టెర్లింగు బాలెన్సులు (బిటిషువారిఋణం) పాపం

* "India's Sterling Balances" By B. T. Ranadive
People's Publishing House, Bombay 4.

పెరిగినట్టు పెరగసాగింది. సైనికులకోసం, అంతులేని తిండి, గుడ్డ, శిబిరాలు, రైళ్లు(ఇప్పటికి ఇవే 10,000 అయినాయి). ఆయుధాలు, జేరాగుడ్డ, దోమ తెరలు, ఇనుము, ఉక్కు, కొయ్య, సిమెంటు, ఇటుకలు—ఒకటేమిటి, సమస్తమూ భారతదేశం సప్లయి చెయ్యసాగింది. అంతులేని కూలీలని ఈ పనిమీద నియోగించారు. ఈఖర్చంతా ఒడంబడిక ప్రకారం బ్రిటనుది. ఈబాకీ 1945-46 కు దాదాపు 1800 కోట్లు రూపాయి లవుతుంది!



సామ్రాజ్యవాదం బ్రిటను నెత్తిన కట్టిన ఈ బ్రహ్మాండమైన ఖర్చు ముందు భరించినది మనదేశం. మనచేతినుంచి అయిన ఈ ఖర్చు మనకు తిరిగి రాకపోగా బ్రిటిషు సైన్యాన్నికూడా మనం భరించిన వాళ్ళ మయినాం.

మన ఖర్చులు భారతదేశం నెత్తిన వెయ్యటం బ్రిటనుకు కొత్తకాదు. బ్రిటను తన వ్యాప్తికోసం చేసిన యుద్ధాల ఖర్చు(సిపాయి కలహం అణచటానికయిన ఖర్చుతోసహా) మనమీద పడుతూ వస్తున్నది. కాని ఈపనే ఈసారి చాలా దొంగెత్తుగా జరిగింది. ఈ దొంగతనానికి రిజర్వు బాంకు చాలా ఉపయోగపడింది. బ్రిటిషు ప్రభుత్వానికి అయే ఖర్చుకుగాను భారతీయ ప్రభుత్వం డబ్బు పుట్టించటానికి అంగీకరించింది. అంటే, బ్రిటను తాను ఇండియానుండి స్వీకరించే వస్తువులకయే ఖర్చు స్టెర్లింగు లెక్కన ఇంగ్లండులో ఇండియా ప్రభుత్వంపేర జమకట్టితే, ఆజమ ఆధారంమీద ఇండియా ప్రభుత్వం ఆ మొత్తానికి సరిపడా రూపాయినోట్లు అచ్చుగుద్ది ఆ డబ్బుతో బ్రిటను తరఫున వస్తువులు కొంటుంది. అయితే ఈ ఏర్పాటువల్ల కలిగిన నష్టం ఏమిటంటే ఇంగ్లండులో ఉన్న ఈ డబ్బు ఇండియాకు ప్రస్తుతం అక్కరకు రాదు. ఆ డబ్బుతో ఇండియా తనకు కావలసిన యంత్ర సామగ్రి వగైరా బ్రిటనునుంచి కూడా కొనలేదు. అదేమంటే నౌకల సదుపాయంలేదు, ఉన్న జాగా బ్రిటను తాలూకు యుద్ధ వ్యాపారానికి అత్యవసరం.

మనని ఇంతటితో పోనివ్వక 45 కోట్ల రూపాయల విలువగల మన డాలరు (అమెరికా) రిజర్వులుకూడా సామ్రాజ్యవాదులు అవుపోసన పట్టారు. ఆ డబ్బుకు సరిపడా యంత్రసామగ్రి మనం అమెరికానుంచి తెప్పించుకోవటానికి అనుమతించ లేదు. మనకు దక్కిందల్లా మన ప్రభుత్వమే జారీ చేసిన కాగితాల కట్టలు.

ఈ దోపిడి ఫలితంగా—

అన్ని వస్తువులకీ ధరలు హెచ్చిపోయినై. ఆగస్టు 1939 లగాయతు నేటివరకూ 900 కోట్ల రూపాయల నోట్లు కొత్తగా అమలులోకి వచ్చినాయి. యుద్ధానికి పూర్వం ఇందులో ఆరోవంతు నోట్లుమాటుకే చలామణిలో ఉండేవి. ఈ కాగితం డబ్బు జపాను యుద్ధంతో మరీ పెరిగి వచ్చింది. ఈ పెరుగుదల 1940–41 లో నెలకు రెండున్నర కోట్లు ఉన్నదల్లా, 41-42 కు 5 కోట్లకు హెచ్చి, 42–45 మధ్య నెలకి 20 కోట్ల పెరుగుదల అయింది.

ఈ కాగితం డబ్బు విలువగల వస్తువులు ఎగుమతి అయిపోగా, వస్తువుల మూల్యం కింద కూలిచేసి రైళ్ళూ, ఫాక్టరీలూ వగైరా నడిపిన వారికిచ్చిన ఈ దగా డబ్బుకు ప్రత్యామ్నాయంగా అవతల వస్తుసముదాయం లేదు. బ్రిటను వస్తువులు పంపదు. ఇక్కడ తయారయినవి కాస్తా బ్రిటను కింద ఖర్చయిపోయినాయి. దీనికి ఫలితంగా డబ్బు విలవ క్షీణించి, వస్తువుల ధరలు పెరగసాగినాయి. బతుకు తెరువు దుర్భరంగా ప్రియమైంది.

1942 లో రూపాయి విలవ 12 అణాలుంది. 1944 మే నెలకు 7 అణాలకు దిగింది! ఆ లెక్కనే ప్రజల జీవితావసరాలు ప్రియమైనాయి. ఈ రీతిగా శ్రామికుల సంపాదనలను క్షీణింపజేసి బ్రిటను తన యుద్ధఖర్చు గడుపుకున్నది. దీనికి నేరుగా గురి అయిన వారు పారిశ్రామిక పనివాళ్ళూ, గుమాస్తాలూ, చిన్న తరగతి వ్యవసాయదార్లూ, వ్యవసాయ కూలీలూ, ఉపాధ్యాయులూ, శిల్పులూనూ. బ్రిటను చేసిన 1400 కోట్ల ఖర్చునూ వీరిజీతాల తరుగుదల నుంచి రాబట్టుకో బడింది. తెలియకుండా వీరంతా చందాలు వేసుకున్నారన్నమాట. చందా ఏమాత్రమూ ఇచ్చుకోలేని తరగతివాళ్ల సంపాదనలు సగానికి పైగా దిగిపోయినాయి.

దారిద్ర్యమూ, మృత్యువూ విజృంభించిందంటే ఆశ్చర్యమేమిటి? బ్రిటను అప్పు పెరుగుతున్న కొద్దీ ధరలు తగ్గటమనేది అసంభవం గనక వస్తువులు దాచి హెచ్చు ధరల కమ్మటం క్షేమకరమైన వ్యాపారంగా పరిణమించింది. పనికిమాలిన కాగితం డబ్బూ, దాపరికమూ, హెచ్చు ధరల వ్యాపారమూ మధ్య నలిగి ఆహారపదార్థాల విలవ హెచ్చిపోయింది. బెంగాలులో బియ్యం పదింతల ధర కమ్మింది. తిండీ, గుడ్డా, ఇతర అవసరాలూ జనసామాన్యానికి అందకుండా పోయినాయి.

తిండిలేక బెంగాలులో 35 లక్షలు మరణించారు. మరి కొన్ని వేలమంది నిస్సత్తువకులోనై రోగాల వాతపడి చచ్చారు. బెంగాలు, బీహారు, కేరళ రాష్ట్రాలలో మృత్యువు విహరించింది. ఈ దౌర్భాగ్యపు పరిస్థితి త్వరలో అంతంకాని పక్షంలో దేశమంతటా కూడా విహరిస్తుంది.

ఇవీ మనం బ్రిటనులో దాచుకున్న స్టెర్లింగు బాలెన్సులూ! వీటికోసంగాను మనం చేసిన త్యాగం ఇదీ! ఇదంతా మన దాస్యానికి ప్రతిఫలం.

బ్రిటను మనకు బాకీఉన్న ఈ 1400 కోట్లే కాక మన భారం ఇంకా ఉంది. మనం వెనక బ్రిటనుకు బాకీఉన్న 300 కోట్లు పోగా ఈ 1400 కోట్లు అంటే మన భారం మొత్తం 1700 కోట్లన్న

మాట. దయా దాక్షిణ్యాలులేని బాకీ దారులాగా మన దేశంలో వేలకువేలు తిండికి మాడి చస్తున్న ఈ సమయంలో బ్రిటను మన బాకీ చెల్లవేసుకుంది. పైపెచ్చు ఈ అప్పు న్యాయమైనది కూడా కాదు. ఇందులో ఎక్కువ భాగం బ్రిటను తన వ్యాప్తికొరకు చేసిన యుద్ధాల తాలూకు అప్పు. రైళ్లు వగైరాలకు మన దేశకింద అయిన ఖర్చుల్లో కూడా దుర్వ్యయం ఎంతో ఉంది. దీనికి సాక్ష్యం బ్రిటిషువారే ఉన్నారు.

తమ పాత అప్పు నిలబెట్టి వసూలు చేసుకుని, ఆపైన ఇన్నివందలకోట్ల వస్తు సామగ్రీ వొలిచి బ్రిటిషు పెట్టుబడిదార్లు ఈ బాకీ రాసెయ్యాలనీ, అధమం తగ్గించాలనీ అంటున్నారు!

ఈ అప్పు చాలాభాగం ఇండియాను జపాను బారినుంచి రక్షించటానికి చేయబడిందనీ, ఇందులో కొంత భారత దేశాన్ని పారిశ్రామికంగా పైకి తెప్పించటానికి ఉపయోగించిందనీ......ఈ కారణాలచేత ఈ అప్పు పూర్తిగా వసూలు చెయ్యటం కేవలమూ అన్యాయమనీ అంటున్నారు! వస్తువుల ధరలు ఇండియా ఇంగ్లండుదేశాల్లో పోల్చిచూస్తే వాళ్ళ 6 పెన్నీలకి మన రూపాయి సమానమనీ, అయినా మామూలు మారకపురేటు 18 పెన్నీలకు రూపాయగా ఉంటున్నదనీ, అందుచేత ఈ అప్పులో మూడోవంతిచ్చినా న్యాయమేననీ చెబుతున్నారు!

1944 జూనులో 'ఇకనమిస్టు' పత్రిక ఇండియా బ్రిటనుల మధ్య జరిగిన ఆర్థిక ఒడంబడికనే తప్పుపట్టింది. ఈ ఒడంబడిక జరిగినప్పటికి భారతదేశం యుద్ధానికి చాలా ఎడంగా ఉందనీ, ఇటలీ జపానులు యుద్ధంలోకి దిగగానే పరిస్థితి మారినప్పుడే ఒడంబడిక సవరణ చేయకపోవటంవల్ల "విడ్డూరమైన" పరిస్థితులేర్పడ్డవనీ రాసింది. ఇంతేకాక ఈ అప్పును తగ్గించని పక్షంలో అసలే ఎగగొట్టవలసి వస్తుందనికూడా బెదిరించింది. ఈ అప్పు ఇవ్వటంలో భారతీయులెంత త్యాగంచేసి ఉండినప్పటికీ, అప్పు ఇవ్వటమూ త్యాగం చెయ్యటమూ జరిగిపోతూనే ఉంది గనక ఈ బాకీ తిరిగి తీర్చే విషయం చర్చ అనవసరమనికూడా 'ఇకనమిస్టు' పత్రిక సూచించింది!

ఈ తర్కమంతా కుతర్కం. 1939 లో చేసుకున్న ఒడంబడిక దురుద్దేశంతో చేసుకున్నది; భారతదేశంతో పరిష్కారం జరపకుండా, సామ్రాజ్యానికి భంగంరాకుండా, అంతులేని నరబలికోసం చేయబడినది. అధికారం భారతీయులకు వప్పగించ నవసరంలేకుండా ఉండగలందులకు ఈ ఖర్చు బ్రిటను భరించింది. ఇందువల్ల భారతదేశానికి మహోపకారం జరిగినట్టు నటించటం ద్రోహం. సామ్రాజ్యవాదుల అంచనాలు తప్పిపోతే ఆతప్పు మనదా? జపాను యుద్ధంలో దిగగానే యుద్ధం ఖర్చు పెరిగిందంటే పెరగదా? మలయా, సింగపూరు, బర్మా ప్రజలకు స్వాతంత్ర్యం ఇచ్చి, సాయుధులుగా వారు జపానును ప్రతిఘటించి నట్టయితే సామ్రాజ్యం విచ్ఛిన్న మవుతుందని అంతులేని సైనికులనూ, సామగ్రినీ ఇక్కడికి పంపారు. దానికి ఫలితంగా మలయా, సింగపూరు బర్మాలు జపాను పాలయినాయి. అందువల్ల జపానుతో యుద్ధం పదింతల ఖర్చయింది.

ఇండియాలోకూడా ఇటువంటి దౌర్భాగ్యపు వైఖరే అవలంబించారు. జపాను యుద్ధం ప్రకటించగానే భారతీయులలో యుద్ధచైతన్యం కలిగించి, జాతీయ ప్రభుత్వం ఏర్పరచి. తద్వారా ప్రజల త్యాగయుత సహకారం పొందటానికిబదులు, స్వార్థపరులై కాంగ్రెసు వారిచేతిలో రక్షణ ప్రయత్నం ఉంచటానికి అంగీకరించక, పెద్ద తుపాను లేపి, క్రిప్సు రాయబారం పడగొట్టి, దేశనాయకుల్ని జైళ్ళలో తోక్కి, దేశానికి వర్ణనాతీతమైన దుర్భరస్థితి తెచ్చిపెట్టారు. ఈ ప్రముఖుల ప్రతినిధులే ఈనాడు అప్పుతీర్చటం విషయం పేచీలకి దిగారు. ఈ అప్పు అనుకున్న దానికి పదింతలు కావటం కేవలమూ జపాను యుద్ధ ప్రకటనవల్ల కాదు, సామ్రాజ్యంలోని ప్రజలకి స్వాతంత్ర్యం ఇచ్చే వైఖరిలేక. దానికోసరమే 1939 ఒడంబడిక. జపాను యుద్ధం ప్రకటించిందని ఆ ఒడంబడికను మార్చారా? ఈ పేచీ అప్పు తిరిగి ఇవ్వటం దగ్గిరే.

ఇన్ని సంవత్సరాలూ భారతదేశం ఆత్మరక్షణకి సొంతాన ఖర్చుచేస్తూనే ఉందనీ, తమ సామ్రాజ్య తత్వం ధర్మమా అంటూ పారిశ్రామికంగా అథోగతిలో ఉండికూడా తప్పనిసరి అయి తన రక్షణకు కావలసిన దానికంటే కూడా ఎక్కువే ఖర్చు చేస్తున్నదనీ సామ్రాజ్యవాదులు మరిచిపోతున్నారు. ఈఖర్చు సాలుకు 400 కోట్లు అంటే ప్రతి భారతీయుడూ తలకొక పదిరూపాయలిచ్చుకుంటున్నాడన్నమాట. న్యాయంగా ఇది బ్రిటిషిండియాలోవారిమీదే పంచితే 15 రూపాయలకు తక్కువవుండదు. ఈ దేశంలో మనిషి ఒకటికి సంపాదన సాలుకు 75 రూపాయలు. అందులో రు 15 లు ఆత్మరక్షణకి! కరువులూ, కాటకాలూ రాక ఏమవుతుంది? ఇప్పటికే బ్రిటిషువారికి తృప్తిలేదు. ఇంకా మనం, ఒకచెంప నడుం విరిగినా, భరించవలసినంత మొయ్యటం లేదుట.

ఏ సామ్రాజ్యతత్వ మూలంగా యుద్ధ ప్రయత్నం సక్రమంగా నడవక, యుద్ధం దబ్బున తెమలకుండా పోయిందో, ఏ వైఖరి భారతదేశాన్ని అథోగతిలో, దారిద్ర్యంలో ఉంచిందో, ఏమైనా అంటే ఆ వైఖరినే అనాలి. భారతదేశం మరింత యుద్ధభారం మొయ్యలేకపోతే, దాని తప్పుకాదు.

యుద్ధం మూలంగా బ్రిటను సాలుసరి ఆదాయం నూటికి 76 పాళ్లు పెరిగింది, అమెరికాలో 112 పాళ్ళూ, కెనడాలో 54 పాళ్ళూ పెరిగితే, భారతదేశంలో 20 పాళ్ళే పెరిగింది. ఈ పెరుగుదల కూడా కొత్త కార్ఖానాల స్థాపనవల్ల కాక ఎక్కువభాగం రాత్రి అంగెలవల్ల పెరిగింది. పైపెచ్చు ఈ పెరుగుదల యుద్ధ పరికరాల నిర్మాణం ద్వారాసాగింది గాని, ఒకచెంప బొగ్గు మొదలైనవాటి ఉత్పత్తి తగ్గిపోయింది. నారలాటి పరిశ్రమలు కొన్ని సొంతం ఆపుదల కూడా అయినాయి, ఈ కథ ఇంకా ఉంది. యుద్ధానికి నేరుగా అవసరమైన మోటారు, రైలు, విమాన పరిశ్రమలకు అధికారు లనుమతి ఇవ్వలేదు. ఈ దేశంలో ఈ పరిశ్రమలు సాగితే నావలకు జాస్తి ఒత్తిడికూడా ఉండేదికాదు. ఈ పరిశ్రమలనే ఆస్ట్రేలియా సాగించగలిగింది. ఇండియాలో

మటుకు ఆఖరుకు గ్రేడీమిషను వారి సలహాకూడా అమలు జరపబడలేదు. ఇదంతా సాగితే దేశం సంపదలు పైకి వచ్చిపోతుందేమోనని అధికార్లు బెంగ పడ్డారు. అప్పు పెరిగిందంటే ఎవరిది తప్పు?

ఈ అప్పు ఇంత కావటానికి కారణం హెచ్చిపోయిన ధరలనీ, అందుచేత ఈ అప్పు కొంత కొట్టెయ్యాలనీ మరో వాదం. ఇంతకంటె నంగనాచితనం ఉండబోదు. ఎందుచేతనంటే ఈ ధరల పెరుగుదలకి కారణం కాగితాల రూపాయీలూ, కాగితాల రూపాయీల ద్వారా ధరలు పెరగటాని క్కారణం బ్రిటిషువారు వస్తువు లెగుమతి చెయ్యక పోవటం. ఈ పద్ధతి అవలంబించి తమ యుద్ధ ఖర్చు భారతీయులచేత చందా వేయించారు గాని మరో సగుద్దేశం ఇందులో ఏమీలేదు. ధరలు పెరగటం వల్ల నానా కష్టాలపాలూ అయింది భారతీయులు. ఇప్పుడు అప్పు తగ్గించుకోవాలట!

ఇంత తర్కంలేకుండా ఈ అప్పు ఎగ్గొట్టె ఉద్దేశంకూడా సామ్రాజ్యవాదులు పైకి అనేస్తూనే ఉన్నారు. ఇది బొత్తిగా అసాధ్యంకూడా కాదు. ఎందుచేతనంటే ఈ అప్పు స్టెర్లింగు లెక్కలో ఉంది, స్టెర్లింగ్ రూపాయ మారకంరేటు బ్రిటిషువారి చేతిలో ఉంది. గత యుద్ధంలో భారతదేశం 40 కోట్లు కూడబెట్టుకుంది. ఆ సమయంలో సవరు 15 రూపాయల మారకంరేటుంది. దాన్ని కాస్తా పదిరూపాయలకు దించారు. వెంటనే మారకపు బాంకులవారు రూపాయలుపోసిచౌకగా సవరులు కొనుక్కున్నారు. భారతదేశపు నిలవ అలాములు పలాములయిపోయింది. మన ఆర్థిక రాజకీయ ప్రాణాలు రెండూ వారి చేతుల్లో, ఉంటంమూలాన ఈ సారికూడా ఇటువంటి ఎత్తే ఎత్తవచ్చు.

మన నిలవని వ్యర్థపరిచేటందుకు మారకపు రేట్లే కాక ఇతర పద్ధతులు కూడా లేకపోలేదు. అందులో ఒకటి ప్లానులు తయారుచెయ్యటం—మనదేశం అభివృద్ధి అయేటందుకు! నూటయాభై సంవత్సరాలుగా మన దారిద్ర్యమూ దౌర్భాగ్యమూ పెంపొందించటానికే శ్రమిస్తున్న వీరీనాడు మన అభ్యుదయానికిగాను ప్లానులు వేస్తారంటే అనుమానించటాంకి మనకి హక్కున్నది.

ఇరవైయేళ్ళక్రితం బొంబాయి ప్రభుత్వం బొంబాయిలోని జనసమ్మర్దం తగ్గించటానికి ఒక ప్లాను వేసింది. ఒక చెంప దాదరు, మాటుంగా, మాహీమ్ ప్రాంతాలు ఖాళీగా ఉండగా, సముద్రంలో కొంత భాగం పూడ్చటానికిగాను ఇంగ్లండునుండి పాతయంత్రాలు కొన్ని తెప్పించి అనేక కోట్లరూపాయలు దుర్వ్యయం చేసింది. ఇప్పుడు రాష్ట్రీయప్రభుత్వాలు తయారుచేసే ప్లానులింతకంటె ఘనంగా ఉండబోవు. వీటి ఫలితంగా మనకు పెద్ద పరిశ్రమలకు మారుగా గృహపరిశ్రమలూ, ఇనుము ఉక్కులకు బదులు రోడ్లూ, మోటార్లకు బదులు ఎవరూ నివసించని ఇళ్లూ రావచ్చు. లేదా ఈ డబ్బంతా పెట్టి చవుకబారు వస్తుసామగ్రి మననెత్తిన ఇంగ్లండునుంచి తెచ్చి తొక్కవచ్చు. అక్కడితో మన పరిశ్రమలు మూలబడి దేశమంతటా నిరుద్యోగం తాండవించవచ్చు.

బ్రిటన్ వుడ్సు సమావేశంలో కీన్సు

ప్రభువు మాటతప్పమని భరవసా ఇచ్చాడు గాని ఎప్పుడో, ఏమిటో చెప్పలేదు. అవకాశం దొరికితే సామ్రాజ్యవాదులు ఈ అప్పులో చాలావరకు దిగమింగి మిగిలిన దానికింద తయారు వస్తువులూ, దిక్కుమాలిన ప్లానులూ ఇచ్చి తృణమో కణమో తప్ప యంత్ర సామగ్రి ఇవ్వరు. చూస్తూ చూస్తూ భారతదేశంలో ముఖ్య పరిశ్రమలు సాగటం వారికెంతమాత్రమూ మనస్కరించదు.

ఈ బాకీ వసూలు చెయ్యటంలో మనకు బ్రిటిషు ప్రజలయెడల సానుభూతి లేకపోవటమనేదికూడా లేదు. శత్రువును పరిమార్చటానికి మనం చెయ్యగల త్యాగం చేశాం. బ్రిటిషు ప్రజలను పిండి అప్పు వసూలుచేసుకోవాలనే తలంపు మనకేమీలేదు.

ఏమంటే బ్రిటను ఈ అప్పు తీర్చగల స్థితిలోనే ఉంది.

బ్రిటను రోజూ యుద్ధంకింద ఒక టిన్నర కోట్ల సవరు ఖర్చుచేస్తున్నది. మనబాకీ 100 రోజుల యుద్ధఖర్చుమాత్రమే. యుద్ధానికి పూర్వం బ్రిటను సాలుసరిరాబడిలో ఇది ఆరోవంతు. బ్రిటనుకున్న మొత్తం అప్పుమీది వడ్డీకి మనబాకీ రెట్టింపుకంటె లేదు. ఆ బాకీలో మన బాకీ నూరులో 8 వంతునకంటె లేదు. ఈ బాకీ ఇవ్వలేమని గోలెత్తటం బ్రిటిషు ప్రజలనీ, భారతీయులనూ వంచించటమే.

అదీకాక ఈ బాకీయావత్తూ ప్రస్తుత ఆదాయంలోనుంచే బ్రిటిషువారు చెల్లువెయ్యనవసరం లేదు. వారు మన దేశంలో టీ తోటల్లోనూ, ఇనుము, బొగ్గు గనుల్లోనూ, నార, బట్ట ఫాక్టరిలలోనూ, పారిశ్రామిక సంస్థల్లోనూ చాలా పెట్టుబడులు చేసి ఉన్నారు. ఈ పెట్టుబళ్లను చెందినవాటాలు కొంత అప్పుకింద భారతీయుల పరం చెయ్యటం ధర్మం. కొద్దిమంది బ్రిటిషు పెట్టుబడిదార్లు ఇండియా దారిద్ర్యాన్ని దోచుకునే అవకాశం పోతుందేమోగాని బ్రిటనుకెంతమాత్రమూ నష్టంలేదు.

కిందటి యుద్ధంలో అమెరికాబాకీని బ్రిట నీవిధంగానే తీర్చుకున్నది. ఈ యుద్ధంలోకూడా బ్రిటను తన డాలరు రిజర్వులతో అమెరికానుండి వస్తువులు కొనుక్కున్నది. ఈ అప్పుగురించి వితర్కించే బ్రిటిషు పెట్టుబడిదార్లు భారతదేశంలో తమకున్న పెట్టుబళ్ల ఊసే ఎత్తరు. ఎత్తితే తమ ప్రజలకు తెలిసిపోదా—ఈ పెట్టుబళ్ళతో సహం బాకీ తీరిపోతుందని.

మనబాకీ సాంతం పరిష్కారం కావటం బ్రిటిషు ప్రజలకి క్షేమకరం. బ్రిటిషు పెట్టుబడిదార్ల వాటాలతో కొంత అప్పు రహితమయితే బ్రిటను తాలూకు ప్రస్తుతాదాయంలోనుండి పెద్ద చెల్లులుండక యుద్ధప్రయత్నం సుకరంగా సాగిపోతుంది. భారతదేశం పారిశ్రామికోన్ముఖం కావటం కూడా వాళ్ళకి క్షేమమే. భారతీయ దారిద్ర్యం మీద యుద్ధప్రయత్నంమీదా ఆధారపడిన బ్రిటనులో యుద్ధంపూర్వం పది లక్షలమందికి పనులుండేవికావు. ఆ రోజులు తిరిగిరాకుండా ఉండటం అక్కడి ప్రజలకి మేలు. భారత దారిద్ర్యం బ్రిటిషు ప్రజల పరమ శత్రువు. బ్రిటనులో ప్రస్తుతం ఉన్న పారిశ్రామిక పనీ, జీతాలూ కుంగిపోకుండా ఉండాలంటే భారతప్రజల క్రమాభివృద్ధికి

బ్రిటిషు ప్రజలు చేయూత ఇవ్వాలి. బ్రిటిషువారి యంత్రసామగ్రికి ఇండియా క్రయస్థానం అవుతుంది. పరిశ్రమలు విస్తరించే అవకాశం ఏర్పడుతుంది. లేని పక్షంలో రెండు దేశాల ప్రజలకీ దుష్కర్మ తప్పదు.

భారతదేశం యుద్ధంభారంతో కుంగిపోయింది. సామ్రాజ్యవాదులు పారిశ్రామికంగా మననడుము విరగ్గొట్టటం చేత చెప్పరాని బాధలకి లోనయినాం. యుద్ధానంతరం దేశగతి ఇంకా అన్యాయమవుతుంది. అప్పుడే పారిశ్రామిక వస్తువుల దిగుమతి సాగి మన కర్మాగారాలు ఒక్కొక్కటే మూలబడుతున్నాయి. ఇంతకాలమూ నడిచిన యుద్ధపరిశ్రమల స్థానే కొత్త పరిశ్రమలేర్పడి పనివాళ్ళకి కొత్త అర్జనోపాయాలేర్పడాలి. లేనట్టయితే నిరుద్యోగంతో దేశం అల్లాడిపోగలదు.

యుద్ధానంతరం మన దేశస్థితిగతులు విషమించకుండా ఉండాలంటే స్టెర్లింగు రిజర్వుతో యంత్రాలుకొనుక్కొని భారతదేశం ముందడుగు వేసుకోవాలి. 1400 కోట్లంటే మాటలుకాదు. దానితో భారతీయ పరిశ్రమలు ఇప్పుడున్నదానికి మూడింతలు చేసుకోవచ్చు.

బ్రిటిషువారు మన దేశంలో-ముఖ్యంగా ఉక్కు, బొగ్గుపరిశ్రమల్లో—పెట్టుబడిచేసిన మొత్తాలు వెంటనే భారతీయులపరం కావాలి. మన ముఖ్యపరిశ్రమలు బ్రిటిషువారి చేతుల్లోనుంచి తొలగటం అత్యవసరం. ఇందువల్ల ఇక్కడినుంచి ఏటా ఎగుమతి అయే అంతులేని లాభాలు అరికట్టటమే ఎక్కువైనసంగతి. వీటితోనే ఎంత పారిశ్రామికవ్యాప్తి అయినా జరుగుతుంది. మనకు రాజకీయంగా శత్రువై ఉన్న బ్రిటిషు పెట్టుబడిదారును ఈ విధంగా బలహీన పరచటంకూడా మనకు మంచిదే. పోతే మన కత్యవసరమైన యంత్రాలు వగైరా ఈ బాకీతోనే రావలసి ఉంది. ప్రస్తుత పరిస్థితిలో ఈ యంత్రాలు మన కత్యవసరం. మన కనీసపు అవసరాలు నిర్ణయించటానికి ప్రజావిశ్వాసానికి పాత్రమైన జాతీయప్రభుత్వం ఏర్పడాలి. ఆ ప్రభుత్వం వేసే అంచనాలు పూర్తి అమలులోకి రావటానికి కొన్ని ఏళ్ళు పట్టినా ప్రారంభం వెంటనే కావాలి. ఈ అప్పు పాతిఉంచటానికిగాను బ్రిటిషు పెట్టుబడిదార్లు తిరగా బోర్లా తోయ్యటానికిగాని ఏమాత్రమూ వీల్లేదు.

బాకీ రద్దుచెయ్యటానికి చాలా సంవత్సరాల వాయిదాలిచ్చి నట్టయితే బ్రిటిషువారికి భారంగా ఉండదు. పైగా ఇక్కడి బ్రిటిషు పెట్టుబడులు భారతీయులపరం చెయ్యటంవల్ల అప్పు కొంతభాగం తీరేపోతుంది.

ఈ స్టెర్లింగును బంగారంగానూ, డాలర్లుగానూ మార్చుకోవటానికికూడా అవకాశం ఇస్తే భారతదేశం తనకు కావలసిన యంత్రసామగ్రి అమెరికా వగైరా దేశాలనుండికూడా తెప్పించుకోగలుగుతుంది. దీనివలన మనకు కావలిసిన యంత్రాలన్నీ బ్రిటనునుంచే కొనుక్కొని అక్కడ కరువువచ్చే పరిస్థితులేర్పడచటానికి బదులు ఇతర దేశాలనుంచికూడా కొనుక్కోవటానికి వీలవుతుంది. ఇది బ్రిటిషు ప్రజల క్షేమానికి మాత్రం విరుద్ధంకాదు.

బ్రిటిషుప్రజలూ, భారతప్రజలూ పరస్పర సానుభూతితో సంప్రదించి ఈ అప్పు తీర్చటం బ్రిటనుకు భారమవుతుం

దనే తీర్మానానికి వచ్చేపక్షంలో ఇందులో కొంత వదిలేసుకోవటానికి మనం ఒప్పుకోకపోం. కాని ఈ విధంగా కొంత అప్పు కొట్టేయ్యటంవల్ల భారత దేశాన్ని దోపిడిచేసేవాళ్లకు బలం చేకూరుతుందనే అనుమానంమటుకు మనకు కలగకుండా ఉండాలి. భారత దేశాన్ని సంకెళ్ళలో ఉంచి, దేశ నాయకుల్ని జైళ్లలో తోక్కేవారి కోసం భారతీయులు ఈషన్మాత్రం కూడా సానుభూతి చూపలేరు. రెండు దేశాలకీ పరస్పర సానుభూతి కలగాలంటే ఇక్కడా అక్కడాకూడా ప్రభుత్వాలు మారాలి.

ఈ స్టెర్లింగు అప్పు ప్రత్యేక భారతీయ వ్యక్తుల పేరలేదు, ప్రభుత్వపరంగా ఉన్నది. అందుచేత ఈ బాకీ మొత్తాన్ని సవ్యంగా వినియోగపరిస్తే మనదేశంలోని ముఖ్యపరిశ్రమలు ప్రభుత్వపరంగా నడిపే సదవకాశం దానంతట అదే ఏర్పడుతుంది. ఆమీదట మన పారిశ్రామికాభివృద్ధి ఒక నిర్ణీతమైన పద్ధతిలో జరగటానికి వీలుంటుంది. దీనివల్ల భారతదేశం పెట్టుబడిదార్ల దురాశకు గురికాకుండా తప్పుకోగలుగుతుంది; పారిశ్రామిక నిర్మాణం విచ్చలవిడిగా సాగటానికి మారుగా ప్రజల యోగక్షేమాలకి అనుకూలంగా జరుగుతుంది.

యుద్ధం అయిపోలేదు. బ్రిటిషు సైనికులకింకా మనం వస్తువు లందిస్తూనే ఉన్నాం. అప్పు పెరుగుతూనే ఉంది. దానివెంట ధరలూ దారిద్ర్యమూకూడా పెరుగుతూనే ఉన్నాయి. దీన్ని ఆపుదల చెయ్యాలి-అంటే మనం వస్తువులివ్వమని కాదు, ఇంగ్లండులో పేరే స్టెర్లింగుకు ప్రత్యామ్నాయంగా కాగితాల రూపాయలుజారీ కావటం ఆగాలి. భారత దేశానికి విరివిగా ఆహారపదార్థాల దిగుమతి అవసరం. నౌకల మీద ఒత్తిడితగ్గింది గనక సైన్యానికి కావలిసిన ఆహారపదార్థాలు ఇతరచోట్లనుంచి ప్రభుత్వం దిగుమతిచేసుకోవాలి. ఈ పని చేస్తే బ్రిటిషువారికి అప్పుకూడా వృధాగా పెరగదు, మన ఆహార ధరలుకూడా దిగిపోతాయి.

మనకి యంత్రాలూ, ఇతర వస్తువులూకూడా కావాలి. మెడిటరేనియను మార్గం తెరుచుకున్నది గనుక మన అప్పు కింద వీటిని బ్రిటను సప్లయి చెయ్యటాని కాటంక మేమీలేదు. బ్రిటనుకు ఇవ్వటానికి అవకాశంలేని పక్షంలో అమెరికా ఇస్తుంది, స్టెర్లింగును డాలరుకింద మారిస్తే. బ్రిటను వస్తువులకు వస్తువులే మారకం ఇవ్వచ్చు. అది సాధ్యంకాని పక్షంలో భారతదేశంలో రూపాయలు అప్పుపుట్టించుకోవచ్చు. కాని, బ్రిటను వైఖరిచూస్తూ బ్రిటనుకు రూపాయలు అప్పు ఎవరిస్తారనేది సమస్య. బ్రిటను భారతదేశంతో రాజీకివచ్చే యెడల అది సాధ్యంకావచ్చు. ఈ రూపాయల అప్పువల్ల లాభం ఏమిటంటే కొత్త నోట్లు అచ్చువెయ్య నవసరంలేకుండా ఉన్ననోట్లే అప్పిచ్చి వాటితో మనం బ్రిటనునుండి వస్తువులు కొనుక్కోగలుగుతాం. ధరలు లేచిపోవు. ఈ పని చెయ్యటానికయినా సామ్రాజ్యతత్వమే అటంకంకా ఉంది.

ఈ తప్పు తగ్గించటానికి వీల్లేదని మన పెట్టుబడిదార్లూ పారిశ్రామికులూ ఆందోళనచేస్తున్నారు. మన ప్రజలు ఈ ఆందోళనను బలపరచటంలేదుగాని బలపరచటం ప్రజలకు విహితమైనది.

# ఆ లోకంలో

పాలెపురామన్న

ధర్మదేవుడు: ఎవడీ దోషి?

చిత్రగుప్తుడు: వీడా, యాత్రార్థం వెళ్లే పుణ్యపురుషుల్ని యిబ్బంది పెట్టి, పుణ్యకార్య నిరోధం సల్పిన పాపి!

దోషి: చిత్తం. బుక్కింగ్ స్టాప్ చేశానండి, అంతే! స్టేషన్ మేష్టార్ని గావుండి.

ధర్మ: రైలుకంపెనీ ఏజెంటు వచ్చే వరకు అనామతుగా వుంచండిరా వీణ్ణి!

* * *

చిత్రగు: అన్నవిక్రయ పాపమేగాక మట్టికలిపి అన్నంపెట్టిన పాపి, ప్రభూ!

యము: ఏమంటావ్ నీవు?

జీవి: అయ్యా, రేషన్ ఆఫీసరు అట్లానే సప్లయి చేయించాడు ప్రభూ!

యము: ఛీ—పాపిష్టి యుద్ధంఏస్కృతి క్రింద శిక్షార్హుడో వెత కవయ్యా, చిత్రగుప్తా.

* * *

చిత్రగు: వీడు, అర్ధాంగిని చావ మోదిన పాపి!

నేరస్తుడు: అయ్యా, ఆదేదో రిపోర్టట, దానివల్ల తనకు ఆస్తివస్తుందిట నన్ను నీచంగానూ నిరసనగాను చూట్టం సాగించింది!

యము: ఏమిటది, చిత్రగుప్తులూ?

చిత్ర: 'రావు' కమిటి రిపోర్టు గామాలు ప్రభూ!

యము: సరే, 'రావూ' వస్తాడుగా, వాయిదావెయ్యి!

* * *

యముడు: వీళ్ళెవరే? యిక్కడ పోట్లాడుకుంటున్నారు.

జీవులు: చిత్తం, ఇవి ప్రజాయుద్ధపు రోజులు కావండి!






(గతసంచిక తరువాయి)

విజయ అలానే కూర్చున్నది మాట్లాడకుండా. విలాసుడు శ్లేషగా సారం లేని నవ్వు నవ్వి అన్నాడు:—"తమ కైతే పని గడుపుకోవటంకోసం తల్లీ—కొడుకుల ఉపమానం తెచ్చారు. వింటానికికూడా చెవుల కింపుగాఉంది. కాని, నేను ఒకటి అడుగుతాను చెప్పండి—మీరు ముసల్మానులై ఉండి, మీ మామ గారి చెవిదగ్గర మోహరం మేళాము పెట్టితే ఆయన సహిస్తాడా? సరే ఆయన సహించనీ సహించలేకపోనీ మా కిక్కడ మీతో వాగటానికి తీరికకూడా లేదు. నాన్నగారి ఆజ్ఞ జరిగితీరవలసిందే. కలకత్తానించి వీరిని తీసుకువచ్చి, ఇక్కడ చెవికింద మేళం పెట్టటానికి మేమెంతమాత్రం వొప్పుకోము."

అతని ఈ అశిష్టవ్యంగ్యమూ, అనవసరపు ఉద్రేకమూ చూసేవరకు ఆగంతకుని దృష్టి తీక్ష్ణమయింది. అతను విలాసునివంక చూస్తూ "తమ నాన్నగారెవరో, ఈ ఆజ్ఞ ఇవ్వటానికి వారికేమి అధికారమున్నదో నాకు తెలియదు. కాని, మీరు మోహరం ఉపమానం తెచ్చారే—దానికి ఒక్కమాట చెప్పుతాను. ఇది హిందువుల ఉత్సవం అయింది కాని మహమ్మదీయుల మోహరమే అయితే మీరేం చేసేవారు? ఇది నోరులేని స్వజాతీయులమీద అత్యాచారం చేయటం కాదా?" అని అడిగాడు.

విలాసుడు ఒక్కమాటుగా కుర్చీమీదనించి ఎగిరి లేచాడు. గుడ్లు ఎర్రచేసి బిగ్గరగా అరిచాడు:—"నాన్నగారి విషయంలో నువ్వు కొంచెం వొల్లు దగ్గర పెట్టుకుని మాట్లాడమని హెచ్చరిస్తున్నాను. లేకపోతే ఆయన ఎవరో, ఆయన అధికారమేమిటో ఇంకో విధంగా చూపించవలసి ఉంటుంది!"

ఆగంతకుడు ఆశ్చర్యంతో విలాసుని ముఖంవంక చూశాడు. అతని ముఖాన భయపడ్డ చిహ్నాలేవీ కనిపించలేదు. కాని, అవి విజయ ముఖాన కనిపించినవి. తన ఇంట్లోకూచుని, అపరిచితుడైన తన అతిథిపట్ల ఇలా అమర్యాదగా ప్రవర్తించినందుకు కోపంతోనూ, సిగ్గుతోనూ విజయముఖం ఎర్రబడింది. ఆగంతకుడు ఒక్కక్షణం మాత్రమే విలాసునివంక చూశాడు. ఆ తర్వాత అతన్ని

బొత్తిగా లెక్కచెయ్యకుండా విజయవేపుకు చూస్తూ అన్నాడు:—"మామగారు పెద్ద భాగ్యవంతులు కాదు. వారి పూజాప్రయత్నాలు కూడా చాలా కొద్దివి. ఐనా మీ బీదప్రజలకు సంవత్సరాని కంతకూ ఇదొక్కటే ఉత్సవం. బహుశా మీకు కొంచెం ఇబ్బందిగా ఉండవచ్చు. కాని వారిముఖం చూసి అయినా మీరీ కాస్తై ఇబ్బంది సహించలేరా ?"

విలాసుడు కోపంతో పిచ్చివాడయి, గుప్పిటబిగించి బల్లమీద గట్టిగా గుద్ది, చీత్కారం చేశాడు:—"ఉహుఁ, ఏమాత్రం సహించలేరు! ఎంతమాత్రం సహించలేరు! కొద్దిమంది మూర్ఖరైతుల పిచ్చిని సహించటానికై ఎవ్వరూ జమీందారీ చెయ్యరు. నువ్వు చెప్పవలసింది ఇక నేమీ లేకపోతే వెంటనే నడువు. అనవసరంగా మాకాలం వ్యర్థపుచ్చకు" అని వాకిలివేపు వేలుచూపాడు.

అతని ఈ భయంకర ఉత్తేజం చూసి ఆగంతకుడు క్షణకాలం విస్తుపోయాడు. వెంటనే అతనినోట జవాబు రాలేకపోయింది. కాని, ఈ పరిస్థితిలో విజయ అందుకున్నది. ఆమె తండ్రిదగ్గర నిరుపయోగమైన శిక్షణ పొందలేదు! ఆమె శాంతంగానూ, నెమ్మదిగానూ విలాసునివంక చూసి అన్నది:—"మీనాన్నగారు నన్ను తన సొంతకూతురులాగా చూస్తారు కాబట్టే, ఈ పూజ ఆపమని ఉత్తరువిచ్చి ఉంటారు; కాని, నా ఉద్దేశంలో నాలుగు మూడు రోజులు కొంచెం గోలగా ఉంటేమాత్రం ఏమా అని—"

ఆమె చెప్పేది పూర్తి కాకముందే విలాసుడు ఇంకా బిగ్గరగా అరిచాడు:— "అది మనం సహించలేని గోల! మీ కిదివరకు తెలియదు కాబట్టే —"

విజయ నవ్వుముఖంతో అన్నది:—"అయితే మానెలెండి, కొంచెం గోల— మూడురోజులేగా! మీరిక్కడ నాకు ఇబ్బందిగా ఉంటుందని చూస్తున్నారు గాని కలకత్తాలో అయితే ఏమి చేసేవాళ్లు? అక్కడ ఎనిమిది ఝాములూ చెవుల దగ్గర ఫిరంగులు పేల్చినా చూస్తూ ఊరుకుండవలసిందేగా ?" అని, ఆ వచ్చిన యువకునివంక చూసి నవ్వుతూ—"మీ మామగారితో చెప్పండి, వారు ప్రతి సంవత్సరం చేసుకుంటున్నట్టు ఈ సంవత్సరమూ చేసుకోమని. నాకు ఎంతమాత్రం ఆటంకంలేదు." అన్నది.

ఆగంతకుడూ, విలాసబాబూ ఇద్దరూ విస్మయంతో నోట మాటలేక విజయ ముఖంవంక చూస్తూ ఉండిపోయారు.

"అయితే తమరిక వెళ్ళిరండి!" అని విజయ చెయ్యి ఎత్తి చిన్న నమస్కారం పెట్టింది.

అపరిచిత యువకుడు తనను తను సంబాళించుకునిలేచి నుంచుని, విజయకు ధన్యవాదాలిచ్చి, ప్రతి నమస్కారంచేసి, విలాసునికి కూడా నమస్కారంచేసి మెల్లగా వెళ్ళిపోయాడు. కోపంతో ఉన్న విలాసుడు అది గమనించనట్టు కళ్ళు పక్కకు తిప్పాడనుకోండి; కాని వారిద్దరిలో ఎవ్వరు కూడా, ఈ వచ్చిన యువకుడే వారి ముఖ్యమైన ఆసామి జగదీశుని పుత్రుడైన నరేంద్రనాథుడని తెలుసుకోలేక పోయారు.

# 5

అతను వెళ్ళిపోయిన తర్వాత కొన్ని నిమిషాలవరకూ విజయ పరధ్యానంగానూ, నిశ్శబ్దంగానూ ఉండి హఠాత్తుగా తలపైకెత్తేవరకు ఆమె బుగ్గలమీద అకారణంగానే ఎర్రటిరంగు కనిపించింది. విలాసుని చూపు ఇంకా దేనిమీదనో ఉండిపోయిందిగాని లేకపోతే అతని ఆశ్చర్యానికీనీ, అభిమానానికినీ అంతు ఉండేదికాదు. విజయ మళ్ళీ ఆగిపోయిన ప్రసంగాన్ని తెచ్చి మందహాసంచేస్తూ అన్నది:

"మన ప్రసంగం పూర్తికానేలేదు. అయితే ఆ తాలూకా తీసుకోవాలనేగా మీ నాన్నకి అభిప్రాయం?"

విలాసుడు కిటికీలోంచి బయటికిచూస్తూ ఉన్నాడు. అటునించి తిరగకుండానే—"ఊఁ" అన్నాడు.

"దీన్లో పేచీ లేమీ లేవు కదా?"

"ఊహుఁ."

"ఇవ్వాళ సాయంత్రం వారిటు వస్తారా?" అని అడిగింది మళ్ళీ విజయ.

"నేను చెప్పలేను."

విజయ నవ్వుతూ—"మీకు కోపంరాలేదు కదా?" అని అడిగింది.

విలాసుడు ముఖం తిప్పుకుని గంభీరంగా జవాబిచ్చాడు—"కోపం తెచ్చుకోకపోయినా తండ్రి అవమానానికి కొడుకు బాధపడటం అస్వాభావికంకాదు."

ఈ మాట విజయను నొప్పించింది; ఐనా, ఆమె నవ్వుముఖంతోనే అన్నది:—"కాని, దీనివల్ల మీ నాన్నగారికి అవమానం జరిగిందనే భావన మీకెంగకు కలిగింది? వారు నామీది ప్రేమవల్ల నాకు కష్టంగా ఉంటుందని అనుకున్నారు. నేను ఆ పెద్దమనిషితో నాకలాంటి దేమీలేదని చెప్పాను. ఇందులో మానావమానాలకి తావెక్కడ ఉంది, విలాసబాబూ!"

విలాసుడు గాంభీర్యాన్ని ఒక్కవీసంకూడా తగ్గించకుండా, తల అడ్డంగా తిప్పుతూ అన్నాడు:—"సరే, లేకపోతే పోనివ్వండి. ఇక మీ యెస్టేటు బాధ్యత మీరే తీసుకోవాలంటే తీసుకోండి—ఇకముందు మా నాన్నగారిని నేను హెచ్చరించవలసి ఉంటుంది—లేకపోతే నేను పుత్రకర్తవ్యం నెరవేర్చినవాణ్ణి కాను."

ఈ ఆశించని పెళుసుజవాబు వినేవరకు విజయ ఆశ్చర్యంతో మాట్లాడలేకపోయింది. కొంచెంసేపు అలానేఉండి చాలా బాధపడుతూ—"విలాసబాబూ! ఈ మామూలు విషయాన్ని మీరింత పెద్దదాన్ని చేస్తారని నేననుకోనేలేదు. ఒకవేళ నేను అర్థం చేసుకోవటంలో పొరపాటుపడి, ఏదైనాతప్పు చేసిఉంటే, నేను దాన్ని వొప్పుకుంటాను. ఇకముందు ఇలాంటిది రానివ్వను" అని విజయ విలాసుని ముఖంవంక చూసి ఒక్క నిట్టూర్పు విడిచింది. తప్పును వొప్పుకోవటం మూలకంగా పేచీలన్నీ తీరిపోతవని ఆమె అనుకున్నది. కాని ఆమెకు ఒక్క విషయం తెలియలేదు. దుష్టవ్రణంలాంటి వ్యక్తులు కొందరున్నారనీ, వాళ్ళకు ఇతర్ల

లోట్లలో ఏమాత్రం చోటుదొరికినా ఇక వదలకుండా కూర్చుంటారనీ! అందు చేతనే, విలాసుని ఈ జవాబు వినేవరకూ ఆమెకు అతని హింసాప్రవృత్తి అర్థంకాలేదు.

"అయితే పూర్ణగంగూలీకి కబురు చెయ్యండి, రాసవిహారి బాబు ఇచ్చిన ఆజ్ఞకు విరుద్ధంగా ప్రవర్తించటం నావల్ల కాదని!" అన్నాడు విలాసుడు.

విజయ ఈ జవాబువిని కాసేపు మెదలకండా ఊరుకుని, తర్వాత మెల్లగా- "ఇది అంతకంటే ఎక్కువ అన్యాయంకాదా? సరే, నేను వారికి ఉత్తరం రాసి వారి అనుమతి తీసుకుంటాను" అన్నది.

"ఇప్పుడిక అనుమతి తీసుకున్నా ఒకటే, తీసుకోకపోయినా ఒకటే. మీరు గనక ఈ గ్రామంలో వారికి పరిపతి లేకుండా చెయ్యదలచుకుంటే నేను కూడా నా ఈ అప్రియకర్తవ్యాన్ని నెరవేర్చవలసి ఉంటుంది."

విజయ అంతరంగం ఒక్కమాటుగా కోపంతో నిండిపోయింది. కాని ఆమె అది దిగమింగి—"తమ కర్తవ్యమేమిటో చెప్పతారా?" అని తొణకుండా అడిగింది.

"తమ జమీందారీ వ్యవహారాల్లో వారిక చేయిపెట్టకుండా ఉండటమే" అన్నాడు విలాసుడు.

విజయ క్షణకాలం మౌనంగాఉండి, మరో దిక్కుకు చూస్తూ, శాంతంగా- "సరే, మీరు చెయ్యగలిగింది చేసుకోండి. కాని, నేను మాత్రం ఇతర్ల మత విషయాల్లో జోక్యం చేసుకోను," అన్నది. ఆమె గొంతు ఎంత మెత్తగా ఉన్నప్పటికీ ఆమెలోపల ఉన్న కోపం దాగలేదు.

"మీ నాన్నగారికే గుండె ఉంటేదికాదు ఈమాట అంటానికి." అన్నాడు విలాసుడు బిగ్గరగా.

విజయ తిరిగి నుంచుని విలాసుని ముఖంమీద చూపునిలిపి—"మా నాన్నగారి సంగతి మీకంటే నాకు బాగా తెలుసు, విలాసబాబూ! ఆ విషయమై ఇక తర్కించటంకూడా అనవసరం. నాకు స్నానానికి వేళ అయింది. నేను వెళ్లుతున్నాను," అని వాగ్వాదమంతా ఒక్కమాటతో కట్టిపెట్టి బయలుదేరగానే క్రోధోన్మత్తుడైన విలాసుని అసలురూపు బయటపడింది. అతను మహా కటువుగా- "అసలు స్త్రీజాతే ఇంత కృతఘ్నజాతి" అని జాలివేశాడు.

విజయ ఒక్క అడుగు ముందుకు వేసిందల్లా మెరుపులాగా వెనక్కుతిరిగి ఒక్కక్షణం ఆ బర్బరుని ముఖంవంక చూసి, మళ్లీ మెల్లగా వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళటంతోపాటు విలాసుడు కూడా కొయ్యలాగా అయిపోయాడు.

విలాసుడు పితృభక్తి ఎక్కువగా ఉండటంచేత ఈవివాదం పెట్టుకున్నాడని ఎవ్వరూ అనుకోనక్కరలేదు. ఈ రకంవారికి, ఛిద్రం కనపడితే చాలు దాన్ని పెద్దదిచేసి దుర్బలులను పీడించటంలోనూ, భీతులను భయపెట్టి ఇంకా వ్యాకుల

పాటు చెందించటంలోనూ ఆనందం పొందుతారు. ఆ హేతువెంత చిన్నదైనా ఫర్వాలేదు, ఎంత అసంగతమైనదైనా చిక్కులేదు. కాని విజయ వెంట్రుకవాసి కూడా తగ్గకుండా అతన్ని నిర్లక్ష్యంచేసి అసహ్యంతో వెళ్ళిపోగానే, ఈ తెచ్చి పెట్టుకున్న కలహమెంత క్షుద్రమైనదో అతనికి అర్థమై తనముందు తానే చిన్న పోయాడు. అతను ఇంకా కాసేపు అలానే కూర్చుని, ముఖం మాడ్చుకుని, మెల్లగా అక్కడినించి వెళ్ళిపోయాడు.

మధ్యాన్నం రాసవిహారి కొడుకును వెంటబెట్టుకుని విజయ దగ్గరకువచ్చాడు. "జరిగింది మంచిదికాదు తల్లీ! నా ఆజ్ఞకు విరుద్ధంగా ఉత్తరువివ్వటంవల్ల నేను కొంత చిన్నపోవలసి వచ్చింది. సరే, జమీందారీమీది కాబట్టి ఈ విషయమై నేనెక్కువ చర్చించదలచుకోలేదు. కాని, మాటిమాటికీ ఇలాంటివి జరుగుతూ ఉండేటట్టయితే నా ఆత్మగౌరవం కాపాడుకోటంకోసం నేను వైతొలగవలసి ఉంటుంది. ఈ మాట ముందుగానే చెప్పితే మంచిది." అన్నాడు రాసవిహారి.

విజయ ఏమీ మాట్లాడలేదు. ఒకవిధంగా తప్పు ఒప్పుకున్నది, జవాబివ్వకుండా. అప్పుడు రాసవిహారి బాగా చల్లబడి జమీందారీకి సంబంధించిన విషయాలు ఎత్తాడు. కొత్త తాలూకా కొనే విషయమై ఒక నిర్ణయానికి రాగానే జగదీశుని ప్రసంగం తెచ్చాడు:—"జగదీశుని ఇల్లు నీవు సమాజానికి ఎలానూ దానం చేశావు. అలాంటప్పుడు ఈ దసరాపండగ కాగానే మనం దాన్ని ఎందుకు స్వాధీనం చేసుకోకూడదు, తల్లీ?" అని అడిగాడు.

విజయ తల తిప్పుతూ—"తమకు ఏది మంచిదని తోస్తే అది చెయ్యండి. ఐతే మనం డబ్బు కట్టటానికి ఇచ్చిన గడువు అయిపోయిందా?" అని అడిగింది.

"ఎప్పుడో అయింది. జగదీశుడు చిల్లర అప్పులు తీర్చుకోటంకోసం మీ నాన్న దగ్గర పదివేల రూపాయలు తీసుకుని ఆస్తి అంతా తాకట్టు పెట్టాడు. ఎనిమిది సంవత్సరాల్లో తీర్చేమాట. ఇప్పుడు తొమ్మిదో సంవత్సరం గడుస్తున్నది, తల్లీ" అన్నాడు రాసవిహారి.

విజయ కొంచెంసేపు తలవంచుకుని మాట్లాడకండా కూర్చుని, ఆ తర్వాత మెల్లగా అన్నది:—"వారి కొడుకు ఇక్కడే ఉన్నాడని విన్నాను; ఇంకా ఏమైనా గడువు కావాలంటారేమో ఒకమాటు పిలిపించి కనుక్కుంటే పోదా?"

రాసవిహారి తల ఆడిస్తూ—"అది కుదరదు—అసంభవం—అదే గనక—"

తండ్రిమాట పూర్తికాకుండానే విలాసుడు గర్జించాడు. అతను ఇంత సేపటినించీ ఎలానో ఓపికపట్టాడు కాని ఇక ఉండలేకపోయాడు. అతను కర్కశంగా—"వీలుంటే మాత్రం మనం ఎందుకు ఒప్పుకుంటాము? డబ్బు తీసుకునేటప్పుడు ఆ తాగుబోతువాడికి గుర్తు ఉండనక్కర్లేదా, ఏ షర్తులు పెట్టుతున్నామో, తీర్చగలుగుదుమో లేదో నని?" అన్నాడు.

విజయ విలాసుని వంక ఒకమాటు చూసి, తర్వాత రాసవిహారి వైపుకు తిరిగి శాంత దృఢస్వరంతో అన్నది:—"వారు మా నాన్నగారి స్నేహితులు. వారిని గురించి అమర్యాదగా మాట్లాడవద్దని మా నాన్నగారు చెప్పిపోయారు—"

విలాసుడు మళ్లీ గర్జించాడు:—"వారు వెయ్యి చెప్పిపోనీయి, అతను మాత్రం పక్కా—"

రాసవిహారి కొడుకుకు అడ్డువచ్చి—"నువ్వు ఊరుకోరా, విలాస్!" అన్నాడు.

"ఇలాంటి వెధవ సెంటిమెంట్లు నేనెంతమాత్రం వొప్పుకోను—ఇందువల్ల ఎవరికి కోపమొచ్చినా సరే, ఎవరేమి చేసుకున్నా సరే, నేనేమీ లెక్కచేయను. నేను సత్యం చెప్పటానికెప్పుడూ భయపడను. సత్యమైన పని చేయటానికి ఎప్పుడూ వెనకాడను." అన్నాడు విలాసుడు.

రాసవిహారి ఉభయపక్షాలనూ శాంతపరచటంకోసం, బలవంతాన నవ్వు తెచ్చుకుని మాటిమాటికీ తల ఆడిస్తూ అనటం మొదలుపెట్టాడు:—

"అది నిజమే, అది నిజమే. ఈ స్వభావం మా వంశంలోనే జీర్ణించిఉంది! చూశావా తల్లీ, విజయా! ఇందుకోసమే నేనూ మీతండ్రీ దేశానికంతకూ కూడా ఎదురు నిలబడి సత్యధర్మం స్వీకరించాము. మేమెంతమాత్రం భయపడలేదు."

"చనిపోయే ముందు మా నాన్నగారు, ఈ అప్పుకోసం వారిఇల్లు స్వాధీనం చేసుకోవద్దని నాదగ్గర మాట తీసుకుపోయారు" అని అంటూ ఉండగానే విజయ కళ్ళలో నీరు తిరిగింది. స్నేహమయుడైన తండ్రి జీవించి ఉండగా ఏదైతే అసంగతమని భావించిందో, ఇప్పుడదే ఆమెకు జవదాటరానిదిగా తోచసాగింది.

"అయితే ఆ అప్పు వారే ఎందుకు వదిలిపెట్టలేక పోయారూ?" అని అడిగాడు విలాసుడు.

విజయ దానికేమీ జవాబివ్వకుండా, రాసవిహారి వంకచూస్తూ మళ్ళీ—"జగదీశబాబుగారి కుమారుని పిలిపించి ఇదంతా వారికి చెప్పటం మంచిదని నా అభిప్రాయం" అన్నది.

రాసవిహారి జవాబివ్వకముందే విలాసుడు సిగ్గువిడిచిన వాడిలాగా మళ్ళీ మాట్లాడాడు:—"అతను ఇంకో పదిసంవత్సరాలు గడువు అడిగితే అదికూడా ఇవ్వవలసి ఉంటుందా ఏమిటి? అలాగయితే ఇక గ్రామంలో సమాజం స్థాపించటం గంగలో కలిసినట్టే!"

విజయ దీనికికూడా జవాబివ్వకుండా రాసవిహారి నుద్దేశించి—"తమ రొకమాటు ఆయన్ని పిలిపించి ఈ విషయంలో ఆయన అభిప్రాయమేమిటో కనుక్కుంటారా?" అని అడిగింది.

రాసవిహారి మహాధూర్తుడు. అతను తనకొడుకు ప్రవర్తనకు లోలోపల విరక్తి చెందినప్పటికీ, పైకి అదేమీ కనపడకుండా దాచి, అతని అభిప్రాయమే సరిఅయినదని రుజువు పరచటానికి ముందుగా ఉపోద్ఘాతం మొదలుపెట్టాడు:—
"చూడు తల్లీ! మీఇద్దరి అభిప్రాయభేదాల్లో మూడోవాళ్లు వేలుపెట్టటం అంత

మంచిదికాదు. ఎందుకంటే, మీమంచి, ఇవ్వాళ కాకపోతే రేపయినా మీరే స్థిరపరచుకోవలసి ఉంటుంది. ఈ ముసలివాడి అభిప్రాయంతో మీకు పనే ఉండదు. కాని, అడిగారు కాబట్టి చెప్పతున్నాను—ఈ విషయంలో మాత్రం పొరపాటు నీదే తల్లీ! జమీందారీ సాగించటంలో విలాసుని ముందు నేనుకూడా ఎన్నోసార్లు తగ్గిపోతూ ఉంటాము. సరే, నేను ఒక్కటి అడుగుతాను చెప్పూ? ఈ విషయంలో ఎవరికి గర్జు జాస్తి? నీకా, జగదీశబాబు కొడుక్కా? అతనికి ఋణం తీర్చుకోగల సామర్థ్యమే ఉంటే ఒకమాటు నీదగ్గిరికివచ్చి కనపడకూడదా? నువ్విక్కడికి వచ్చావనికూడా తెలుసుకదా, అతనికి? ఒకవేళ మనకై మనము రాయబారమేపోతే అతను తప్పక ఎక్కువకాలం గడువు కోర్తాడు. అతను డబ్బు ఎలానూ ఇవ్వలేడు—ఇది తేలిపోయినదే. కాని, మన సమాజ ప్రతిష్ఠాపనకూడా ఎప్పటికీ ఆగిపోతుంది. కొంచెం బాగా ఆలోచించిచూడు తల్లీ! ఇది మంచిదే నేమో!''

విజయ మెదలకండా కూర్చున్నది. ఆమె మనసులోని భావం ఊహించి ముసలి రాసవిహారి—''సరే అతనికి తెలియకండా ఏమీచేయము. ఒకవేళ అతను ఎక్కువ గడువు అడిగితే అప్పుడు ఆలోచించిచూద్దాము. ఏమంటావు?'' అన్నాడు.


''సరే!'' నన్నది విజయ తలతిప్పి. కాని, ఆమెముఖాన్ని బట్టిచూస్తే ఈ ప్రస్తావన ఆమె ఎంతమాత్రం ఆమోదించలేదని తెలుస్తూనే ఉన్నది. రాసవిహారి ఇవ్వాళ విజయను బాగా అర్థంచేసుకోగలిగాడు. ఈ పిల్లవయసు కొద్ది అయినా, తనతండ్రి ఆస్తికి తానే యజమానిననికూడా ఆమెగ్రహించిందని తెలుసుకున్నాడు. ఇలాంటి పిల్లను స్వాధీనపరచుకోటానికి కొంతకాలం పట్టుతుందనికూడా రాసవిహారి గ్రహించాడు. అందుచేత ఈ విషయమై ఎక్కువ లాగులాడకుండా సాంధ్యోపాసన నెపంపెట్టి అక్కడనించి లేచాడు. విజయ నమస్కారంచేసి, కుర్చీమీదినించి లేచి, నిశ్శబ్దంగా నుంచున్నది. రాసవిహారి ఆమెను ఆశీర్వదించి వెళ్ళిపోయాడు. విజయ ఒక్కక్షణం అలానే మాట్లాడకుండా నుంచుని, తర్వాత-''నేను చాలా ఉత్తరాలు వ్రాయవలసి ఉంది-మీకు నాతో ఏమీ అవసరమైన పనిలేదు కదా?'' అని అడిగింది.

విలాసుడు మొరటుగా—''ఏమీలేదు, మీరుపోవచ్చును'' అన్నాడు.

''మీకు టీ పంపించమని చెప్పేదా?''

''ఊహుం, అక్కర్లేదు.''

''ఐతే, నమస్కారం!'' అని విజయ రెండుచేతులూ జోడించి ఇంట్లోకి వెళ్ళిపోయింది.




[నమ్మక మున్నవారికి మాత్రమే]      సెప్టెంబరు నెలకు

(అశ్వని, భరణి, కృత్తిక 1 పా)




ఈ మాసం ప్రారంభంలో మీవృత్తి వ్యాపారాలు అంత ప్రోత్సాహకరంగా కనిపించవు. ప్రయాణాలు. శ్రమ కనుపించినా తృప్తికరమయిన ఫలితం లభిస్తుంది. ఎవరయినా దుర్మార్గులు అనవసరంగా కలహాలు రేపుతారు. సాధ్యమయినంతవరకు జాగ్రత్తగా ఉండడం మంచిది. కుటుంబంలో ఖర్చులు జాస్తి అవుతవి. 14,19 తేదీల మధ్య కొంచెం అనారోగ్యం చేసే సూచన ఉంది. మిమ్మలను కొందరు నష్టపెట్టవలెనని ప్రయత్నాలు చేస్తారు. కాని భగవదనుగ్రహం మీయందు ఉండుటవల్ల వారి ఆటలు ఏమీ సాగకుండా పోతవి. 15, 16 తేదీల తరువాత వృత్తి వ్యాపారాలు బాగుంటవి. ధనాదాయం పెరుగుతుంది. స్పెక్యులేషన్, లాటరీ మొదలయిన వాటిలో ప్రవేశించవద్దు. 16, 17, 22 తేదీలలో ఖర్చు అధికం, బంధుమిత్ర సమాగమం, శుభవార్త.

స్త్రీలకు: తొందరపడి మీ రహస్యాలను ఇతరులకు చెప్పడంవల్ల మీకు ఆశాభంగం కలుగుతుంది. పిల్లల ఆరోగ్యంగురించి శ్రద్ధగా ఉండండి. మీకు ఉల్లాసంగా ఉండాలంటే తెలుపు, ఎరుపురంగు పుష్పాలు వస్త్రాలు ధరించండి.

(కృత్తిక 2, 3, 4 పా, రో, మృగశిర 1, 2 పా)




ఇతరుల వ్యవహారాలు ఏమీ పైన పెట్టుకోవద్దని హెచ్చరిక చేస్తున్నాను. మేలు చేయబోయి విరోధాలు తెచ్చుకొంటారు. ఈ మాసంలో వృత్తి ధన విషయాలు చాలా ఉత్సాహకరంగా ఉంటవి! పెద్ద మనుష్యులు, అధికారులు అయినవారి సహాయం లభిస్తుంది. మీ ప్రయత్నాలు కొంతవరకు కార్యరూపంలోకి వస్తవి. మీ దేహారోగ్యాన్ని గురించి శ్రద్ధ తీసుకొనటం మంచిది. నీచులతో కలహాలు వస్తవి. బంధుమిత్రులకు సహాయం చేయవలసి రావటంవల్ల శ్రమ, ఖర్చు అధికంగా ఉంటవి. మీరాశికి గురుదృష్టి ఉన్నందువల్ల కార్యసిద్ధి, అధికారుల ప్రాపకం, సంఘంలో గౌరవం లభిస్తవి. కాని క్రూరగ్రహబలంకూడా ఉంది. కనుక

చోరభయం, కొన్ని సమయాలలో మనసులో చింతకూడా ఉంటవి. 19,20,21 లలో అయిన వారితో విరోధాలు, ఖర్చు, అశుభవార్త.

స్త్రీలకు: 7, 14 తేదీల మధ్య శుభ వర్తమానం వింటారు. గృహంలో ఆనందం లభిస్తుంది. 19, 22 ల మధ్య బంధువులు యింటికి వస్తారు. పిల్లల మూలంగా సంతోషం.

(మృగశిర 3,4 పా, ఆర్ద్ర, పునర్వసు 1,2,3 పా)




మీరు ఎన్నాళ్ళ నుంచీ ప్రయత్నించినా నెరవేరకుండా నిలచిన పనులు ఈ మాసంలో కార్య రూపంలోకి వస్తవి. మీకు ఈ మాసంలో శనిపీడవదలిపోతుందనేది గ్రహించండి. డబ్బుపెట్టుబడి పెట్టాలిసిన పనులు కొన్ని పైన వేసుకొంటారు. ఈ సమయంలో కొందరు నీచులు మీ రహస్యాలను గ్రహించుటకు యత్నింస్తారు. మీరుమాత్రం తొందరపడకుండా జాగ్రత్తగా ఉండడం మంచిది. కాని భాగస్తులను క్రొత్తవారిని చేర్చుకొనేవిషయంలో వారి అంతస్తు తెలుసుకొని చేర్చుకొనండి. మిత్రులతో విరోధాలు తెచ్చుకోటం సంభవిస్తుంది. వృత్తివ్యాపారాలు ఈ మాసంలో సామాన్యంగా ఉంటవి. 16,17 తేదుల తరువాత కొంచెం శ్రమ, ఉత్సాహభంగం కనిపిస్తవి. 11,13,15,16లలో విలువగల వస్తువులు కొనటం, శుభవార్తాశ్రవణం, దైవకార్యాలు.

స్త్రీలకు: మీ ఆరోగ్యాన్నిగురించి శ్రద్ధగా ఉండండి. కుటుంబంలో బాధ్యతలు ఎక్కువవుతవి. 16,18,19 తేదీలలో శ్రమజాస్తి, ఊదా. ఆకుపచ్చని వస్త్రాలు మీ ఉల్లాసాన్ని కాపాడుతవి.


(పునర్వసు 4 పా. పుష్యమి, ఆశ్లేష)




మీ రాశికి ఈ మాసం ఎక్కువ ప్రోత్సాహకరంగా కనుపించదు. పంద్రెండవ యింట పాపగ్రహాలు ఉన్నందున పనులలో ఆలస్యం, శ్రమ, ధనవ్యయం కనిపిస్తవి. కాని వృత్తివ్యాపారాలలో అభివృద్ధి వస్తుంది. ధనాదాయంకూడా బాగుంటుంది. కుటుంబంలో ఖర్చుకూడా అధికం కావడంవల్ల చివరకు ఏమీ మిగలకుండాపోతుంది. చేతికి రావలసిన పైకం సమయంలో రాక శ్రమపడతారు. గ్రామాదులనుండి వచ్చే ఉత్తరాలు, వార్తలు ఉత్సాహాన్ని కలిగిస్తవి. మీరు ఇతరులకు హామీలు ఉండడం, అప్పులు ఇవ్వటం పైన పెట్టుకోవద్దు. కొందరు అనవసరంగా మీపైన అపవాదులు మోపుతారు కాని మీ కేమీ భంగం కలగదు. 18,19,21,22 లలో బంధు విరోధం, చోరభయం, అనారోగ్యం.

స్త్రీలకు: తొందరపడి ఎవరికీ వాగ్దానాలు చెయ్యవద్దు. మీ విరోధులు కొందరు అనవసరంగా కలహించడానికి యత్నిస్తారు. మీరు విశేషం తెలుపు, మబ్బురంగు వస్త్రాలనే ధరించండి, శుభం.

(మఖ, పుబ్బ, ఉత్తర 1 పా)




ధైర్యంచేసి ఏ పనైనా చేస్తే విశేషంగా ఫలించే సమయం ఇది. గురువు మీకు ద్వితీయస్థాన

మందున్నాడు. అధికారులతో పరిచయం లభిస్తుంది. వృత్తి ఉద్యోగాలలో అభివృద్ధి ధనాదాయకం కలుగుతవి. కుటుంబంలో సంతోషకార్యాలకై ధనవ్యయం విశేషంచేయవలసి వస్తుంది. కోర్టు కచ్చేరీలలో అనుకూలం కలుగుతుంది, స్థిరాస్తికొనే ప్రయత్నాలు కొంతవరకు సఫలమవుతవి. సంఘంలో గౌరవం, పలుకుబడి సంపాదిస్తారు. 26,27,29 లలో ధనవ్యయం, సంచారం, కలహాలు.

స్త్రీలకు: మీరు సాధ్యమయినంతవరకు ఇతరుల హృదయాన్ని తెలుసుకొని ప్రవర్తించండి. మీ స్నేహితురాండ్రు కొందరు మీ రహస్యాలను మీవల్ల తెలిసికొనుటకు యత్నిస్తారు. జాగ్రత్త. విలువగల నగలు వస్త్రాలు కొంటారు. పుణ్యకార్యాలు నెరవేరుతవి.

(ఉత్తర. 2,3,4, పా, హస్త, చిత్త, 1,2 పా)




కొంతవరకు మీకు ఈ మాసం మిశ్రఫలితాలతో కూడుకొని ఉంటుంది. వృత్తి ఉద్యోగాలలో పూర్వంకన్నా మేలుగా ఉంటుంది. ధనాదాయం తృప్తికరంగాయున్నా ఖర్చులు మితి మీరడంవల్ల కొన్ని సమయాలలో నిరుత్సాహపడవలసి వస్తుంది. వృత్తిలో తరచూ పొరపాట్లుచేయడం సంభవిస్తుంది. తగుజాగ్రత్తగా ఉండడం మంచిది. 16,20, తేదీలమధ్య మీ ఆరోగ్యం సాధారణంగా ఉంటుంది. కొందరు మోసగాండ్రు మీ మనసులోని ఆలోచనలను మీవల్ల తెలిసికొనుటకు మిత్రులవలె దగ్గరచేరుతారు. అట్టివారి విషయంలో జాగ్రత్త అవసరం. కుటుంబంలో ఆనందం లభిస్తుంది. విలువగల వస్తువులు కొంటారు. పశ్చిమ దిశనుంచి సంతోషవార్తలు వస్తవి. 15,16,18 19 తేదీలలో విషకీటభయం, కార్యసిద్ధి, విలాస సుఖం.

స్త్రీలకు: మీరు ఎంత జాగ్రత్తగా ఉన్నా మీ మీద కారణంలేని నిందలు మోపుతారు. కాని నిజం తెలిసిన తరువాత వారే తలలు వాల్చుకొంటారు. నలుపు, ఎరుపు రంగుల వస్త్రాలు శుభసంతోషాలను కలిగిస్తవి. నగలు వస్త్రాలు, ఈమాసం కొనవద్దు.

(చిత్త 3, 4 పా, స్వాతి, విశాఖ 1, 2, 3 పా)



మీకు మనసులో అనవసరమయినభయం, మీరు ప్రయత్నిస్తే నెరవేరని పని అంటూ ఉండదు. ప్రస్తుతం రవి లాభమందు ఉన్నాడు. గొప్పవారి ద్వారా కార్యసిద్ధి ధనప్రాప్తి కలుగుతవి. వ్యాపారంలో ఉత్సాహం అభివృద్ధి ఉంటవి. కొన్ని సందర్భాలలో నీచులవల్ల నిరుత్సాహం, ధనవ్యయం కలిగే సూచన ఉంది. కోర్టుకచేరీలలో శ్రమ అధికంగా కనుపించినా పర్యవసానంలో అనుకూలం అవుతుంది. ప్రస్తుతం సాహసకార్యాలకు దిగితే చివరకు ప్రతికూలం అయితీరుతుంది. ప్రయాణం చేస్తారు. ఆయుధాలు మొదలయినవి ఉపయోగించునప్పుడు తగు జాగ్రత్తగా ఉండండి. అనవసరమయిన సంచారం వల్ల ఉష్ణాధిక్యత. 22, 23, 25 తేదీలలో ధన వ్యయం, పుణ్యకార్యాలు, భోజనసుఖం,వృత్తిలో అభివృద్ధిసూచన.

స్త్రీలకు: ఈ మాసంలో మీ కుటుం

బంలో సంపూర్ణమయిన ఆనందం లభిస్తుంది. బంధువులవల్ల గౌరవం, గొప్పవారి సహవాసం లభిస్తుంది. ఆప్తులు ఇంటికివస్తారు. ఉల్లాసముతో కూడిన శ్రమ.


(విశాఖ 4 పా, అనూరాధ, జ్యేష్ఠ)




ఈమాసం గ్రహాలు మీ అదృష్టాన్ని సూచిస్తున్నవి. ఈ సమయంలో మీరు ఏవయినా క్రొత్త ప్రయత్నాలు మొదలుపెడితే సులభంగా నెరవేరి కొంతవరకు లాభిస్తవి. శుభసూచనతో పాటు కొంత చెడుశకునములున్నా ఉన్నవి. అనవసరంగా ఇతరుల వ్యవహారాలు పైనవేసుకొనటం అందువల్ల వినోదాలు శ్రమ తప్పవు. మీవృత్తి వ్యాపారాలలో చాలా అనుకూలమయిన పరిస్థితులు ఏర్పడతవి. మీరు సాహసం చేసి లాటరీ, స్పెక్యులేషన్ వంటి పనులలో దిగితేనష్టపడతారు. ప్రయాణంలో శ్రమఅధికం, ఫలం స్వల్పం. 13,14,27, 28 తేదీలలోమాటతొందరవల్ల కలహం, అధికమయిన ఖర్చు, బంధువులరాక.

స్త్రీలకు : ఈ మాసం కుటుంబంలో మీవల్ల కొన్ని ముఖ్యమయిన పనులు నెరవేరుతవి. పాటివారిలో మెప్పు పొందుతారు. ఎరుపురంగు వస్త్రాలు సంతత ఆనందాన్ని కలిగిస్తవి.

(మూల, పూ-షాఢ, ఉ-షాఢ 1 పా)




ప్రస్తుతం మీ రాశ్యధిపతి శత్రుక్షేత్రమందున్నాడు. అయినప్పటికీ ప్రస్తుతం రవి బుధులు బాగున్నారు గనుక ఏమీ ఫరవా ఉండదు. ఇతరుల సలహాలను నమ్మి మీ కార్యాలు చెరుపుకొంటారు. ఉద్యోగ వ్యాపారాదులలో కొన్ని విఘ్నాలు వస్తవి. పెద్దవారితో కలహాలు మనస్సుకు విచారం ధన వ్యయం సంభవిస్తవి. భార్య ఆరోగ్యం సరిగా యుండకపోవడంవల్ల అధిక ఖర్చు శ్రమ. 18, 20 తేదుల తరువాత మీకు చేతికిరావలసిన పైకం ధారాళంగా వస్తుంది. కొందరు మిత్రులు సహాయం చేస్తారు. వృత్తిలో అభివృద్ధి తృప్తికరమైన మార్పులు కలుగుతవి. కోర్టు వ్యవహారాలు కొంతవరకు అనుకూలమవుతవి, శుభ కార్య ప్రయత్నాలు నిదానంగాద కాని నెరవేరవు. 18, 19, 26, 27 లలో నీచులతో కలహం. శుభ కార్యాలకై వ్యయం.

స్త్రీలకు:—ఇంటిలోని వారి అనారోగ్యం కారణంగా మీ మనశ్శాంతికి భంగం కలుగుతుంది. గౌరీ పూజ చేసుకొనండి. శుభం కలుగుతుంది. తెలుపు, ఎరుపు రంగుల వస్త్రా, పుష్పాలు మంచిది.

(ఉ-షాఢ 2,3,4 పా, శ్రవణం, ధనిష్ట 1, 2 పా)




మీకు ఈ వారం తృప్తికరమైన మంచి మార్పులు రావటానికి తగిన కాలం. ఈ సమయంలో అశ్రద్ధగా ఊరుకొంటే తరువాత విచారించి ప్రయోజనం ఉండదు. మీ రాశికి గురు దృష్టి పూర్ణంగా ఉంది. అధికారులు మొదలయినవారి సహాయంవల్ల వృద్ధిలోకి రావలసిన సమయం. లోగడ చేసిన ధన వ్యయం, శ్రమ ఫలించి సంపూర్ణమైన సుఖం, లాభం కలుగుతవి. మీఆరోగ్యమునుగురించికూడా శ్రద్ధగా

ఉండవలసిన సమయం. సాధారణంగా వాతము ఉష్ణమునకు సంబంధించి ఉంటుంది. పణిమందిలో గౌరవము పలుకుబడి సంపాదిస్తారు. నీచులు మిమ్ములను నిష్కారణంగా కలహాలకు దించుటకు యత్నిస్తారు. 9, 10, 23, 24 ల లో చోర భయం, విందు భోజనం, సాటి వారిలో గౌరవం.

స్త్రీలకు:—మీరు కావలెనని బాధ్యతలు పైన పెట్టుకోవద్దు. కుటుంబ విషయాలలో జాగ్రత అవసరం. క్రొత్త వస్తువులు మొదలయినవి కొంటారు. సంతత ఆనందాన్ని పొందటానికి లక్ష్మీ పూజ ముఖ్యంగా చేసుకోవండి.

(ధనిష్ఠ 3,4 పా, శతభిషం, పూ.భాద్ర, 1, 2, 3 పా)




మీ పనులు వ్యవహారాలు ఈ మాసంలో మీరే జాగ్రత్త తీసుకోటం మంచిది. ఇతరులను నమ్మి విడిచిపెడితే తరువాత విచారించవలసి వస్తుంది. మీ వల్ల ఉపకారం పొందినవారు కొందరు తిరిగి మీఅపకారానికి ఎదురుచూస్తారు. 2, 3 వారాలలో ధనానికి కొంచెం కొరత కనిపిస్తుంది. భాగస్తులతో కలహాలు వచ్చి మనసును కలవర పెడుతవి. అన్నిహంగులు ఉండికూడా అనుభవానికిరావు. 10, 11 తేదుల తరువాత మీవృత్తి వ్యాపారాలలో స్థిమితం ఏర్పడి ధనాదాయం మొదలయినవి తృప్తికరంగా ఉంటవి. వాహనభయం కలిగే సూచనఉంది. దైవభక్తి పుణ్యకార్యాలు చేస్తారు. 4, 5, 9, 10, 13 తేదీలలో అకారణభయం, ధనకష్టం, అకాలభోజనం, క్రొత్త వారితో పరిచయం.

స్త్రీలకు: మీ ఆరోగ్యాన్ని గురించి శ్రద్ధగా ఉండండి. మీరు ఈ మాసం క్రొత్త వస్త్రాలంకారాలు కొనవద్దు. మీ రహస్యాలు ఇతరులకు తెలియకుండా ఉండటానికి యత్నించండి. మబ్బువన్నె కాని నలుపురంగు వస్త్రాలు కాని ధరించడం మంచిది.

(పూ. భాద్ర 4 పా, ఉ. భాద్ర, రేవతి.)




ఈ మాసం కొంత వరకు అనుకూలమయినదే: మీరు చేసిన ప్రయత్నాలు ఫలించుటకు ఇది తగిన కాలం. మిత్రులవల్ల సహాయం లభిస్తుంది. లోగడ మీ శత్రువర్గంలో ఉన్నవారు మీయందు అనుకూల భావం చూపిస్తారు. ధనాదాయం బాగున్నట్లు కనుపించినా కుటుంబంలో ఖర్చులు విశేషం కావడం వల్ల చివరకు ఏమీ మిగలకుండా పోతుంది. శుభకార్య ప్రయత్నాలు అనుకూలమవుతవి. వృత్తి వ్యాపార సందర్భాలలో కలతలు వచ్చే సూచన ఉంది. భార్యాపిల్లల ఆరోగ్యం గురించి జాగ్రత్తగా ఉండడం మంచిది. 19, 20 తేదుల తరువాత వృత్తిలో స్థిమితం ఏర్పడి మంచి ఆదాయం వస్తుంది. సంఘకార్యాలు నెరవేరుతవి. 20, 21, 26, 27 లలో ఆడంబరాలకై ధనవ్యయం, పుణ్యకార్యాలు, మిత్రులవల్ల సహాయం, శుభవార్తా శ్రవణం.

స్త్రీలకు: విరోధులు అనవసరంగా మీతో కలహించటానికి యత్నిస్తారు. కాని మీరు తొందరపడతగిన సమయం కాదు. వస్త్రాలు, నగలు మొదలయినవి కొనటంలో పొరపాటు రాకుండా చూచుకోవండి.


—భాస్కరాచార్య.

# ఆంధ్రజ్యోతి పజిల్స్

శ్రీ. శ్రీ.

[ప్రస్తుతం వినోదంకోసమే. ఇంకా విత్తంమీద కాంక్ష లేదు.]

## పజిలు నెం. 3



**అడ్డము :—**

1. తల తిరుగుడు.
3. పిల్లి లేని పినతల్లి.
5. ఏటంబాంబు కాబోలు ఈఫిలింసంస్థ.
8. స్త్రీని దీనితో పోలుస్తారు.
10. ధన విపర్యాసం.
12. అప్పులున్నవారినుంచి తెచ్చుకోవచ్చు.
14. జల తరంగిణిలో తీగ.
16. సూర్యుడు కాంతిలేని కవి.
18. మెదటా తుదీలేని జాబులు.
20. అటువంటివే కొలతలు.
22. మనం అందరం.
24. గజేంద్రునికి లభించింది.
26. చిలకమర్తివారి నవలలో బంగారం లేదు.
28. అర్థరహితము (కాని, అర్థ సహితముకూడా.)
30. క్రాస్‌కి ఇంకోవర్డ్, అదే ఈపజిల్.
32. లవణరాజుకత (ఆద్యంతాలు మాత్రం.)
35. ఏనుగుల కన్నీటిలో రాళ్లు.
37. సగం విఫలత (సగం సఫలత కూడా.)
39. మనది పూర్తిగాకాని మనస్సు.
41. సువాసన ద్రవ్యం.
43. భార్యల తప్పులో ఉంది (భర్తల తప్పులో కూడా)
45. యమునమారి రోగం ఇదికావచ్చు.
46. నారద వీణ.

**—నిలువు :**

2. జగతల ప్రతాపన్‌నుంచి దీన్ని మినహాయించండి.
4. పోలేని కవి.
6. రాలేని రాణులు,
7. కథానాయిక కన్నతల్లి.
9. సగం అవతల.
11. భూమి ఖరీదు
13. కొత్తమోస్తరు ప్రారంభం.
15. సగం ఇవతల,
17. —నారాయణ.
19. బ్రహ్మతోకలిసి పట్టుకోవచ్చు జాగ్రత్త!
21. బ్రహ్మవ్రాతకి జాగా.
23. జోడు.
25. ఒక ఇంటిపేరు,
27. —చెడ్డది వితంతువు.
29. గంటచూపించే కంటకం.
34. ప్రేమవాసన కాబోలు!
33. నోరుంటే కాస్తుంది.
84. వాహినీయోగి.
36. భూగోళశాస్త్రంలోని పదం.
38. —మాసినవాడు గాడిద.
40. వికారంలేని తిథి.
42. కేసరీకుటీరం ?
44. తలపులకు స్థానం.

## ఆగస్టు నెల సొల్యూషన్

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 ప | ర | మ | 2 ప | ద | 3 సో | పా | న | 4 ము |
| ర | | | చ్ఛ | | మ | | | స్లి |
| శు | | 5 సా | గ | | 6 యా | 7 స | | ము |
| 8 రా | మి | రె | డ్డి | | 9 జి | మ | లో | వా |
| మా | | | | | | | | గు |
| 10 వ | రు | 11 న | 12 కు | | 13 జ | 14 రి | మా | నా |
| తా | | 15 తి | క్క | | 16 న | క్క | | య |
| ర | | | తో | | కు | | | కు |
| 17 ము | ప్పా | తి | క | మూ | డు | వం | తు | లు |

## సూత్రం భాష్యం

"పార్టీలో (కమ్యూనిస్టు) నే నేందుకు చేరాను?"

—అనిసెట్టి సుబ్బారావు.

సెక్యూరిటీకోసం. చేతావాతా నిప్పవాగ్నికక్కుతూ, హాయిగా నిద్రపోవటానికి వీలున్న పార్టీ ఇదొక్కటే. అదీ కాక ఈనాడు తమరు బ్రహ్మచారులు కాదుగదా.

"కామ్రేడ్ మన్నవ వెంకట్రామయ్య కున్నది ఎకరంనర. అంతా ఇస్తానంటే బలవంతాన ఆపి రు 200 లు ఇవ్వమన్నాం."

—ప్రజాశక్తిలో మా విలేఖరి.

అనుభవం! పాడుగుక్కోసి పాలుతాగితే ఎట్లా ముందు ముందు? అదీకాక ఎకరం ఎకరంనరవాళ్లు చాలామంది పార్టీలలోనూ, ఆశ్రమాలలోనూ చేరాలనిచూస్తారు. వాళ్ళని ఇలా జాగర్తగా పట్టుకురావడంలోనే ఉంది తెలివి!

బి. ఎన్. కె. ప్రెస్, 43, ఆచారప్పన్ వీధిలో బి. నాగిరెడ్డిగారిచే ముద్రింపబడి
అదేచోట బి. ఎన్. గుప్తగారిచే ప్రకటించబడింది. ఎడిటర్ : చక్రపాణి.

# సుందర్

[నాటకం]

## సౌరీస్ రచన

జీవితాన్ని, ఒకకళగా భావించి అదే పరమాపధిగా జీవితాన్ని గడిపిన ఒక కళాజీవి చరిత్ర. విచిత్రమైన సన్నివేశాలు.

పాలవంటి తెల్లని చేతికాగితము. సర్వాంగసుందరమై[illegible] ముద్రణ.

వెల మూడురూపాయలు మాత్రం

పోస్టు ఖర్చులు మాపి.

## యువ బుక్ డిపో

గవర్నరుపేట, బెజవాడ. ఆచారప్పన్ వీధి, మదరాస్,



**ఉబ్బసముతో బాధపడువారికి నా సలహా ఇదే**



"తాత్కాలికంగా ఉపశమనము కలిగించే మందులను వాడడం చాలా వెఱ్ఱితనం."


అప్పటికప్పుడు వెంటనే గుణమిచ్చు యే గాక, ఉబ్బస వ్యాధియొక్క మూలకారణము లను రూపుమాపి శాశ్వతంగా నయము చేయునది పురోహిల్‌వారి శ్వాసహరి మాత్రమే. శ్వాసహరిని వాడుట ప్రారంభించిన వెంటనే, దగ్గుపోయి, శ్వాస ధారాళమగుటయేగాక, జీర్ణకోశము, ఊపిరితిత్తులు క్రమేణ బలపడి, ఉబ్బసము పూర్తిగా తగ్గిపోవును.

ఉబ్బసము. ఊపిరిసలుపకుండుట, నడుము నొప్పి, గొంతుకలో నసకలిగించు దగ్గు, మొదలగు గుండెజబ్బులకు శ్వాసహరి (పీలిరంగు ప్యాకెట్టు) ను వాడుడు. మలబద్ధకము, పులితేపులు. వీటిచే బాధపడు ఉబ్బస వ్యాధిగ్రస్తులగువారు శ్వాసహరి కాంపౌండు (ఎరుపురంగు ప్యాకెట్టును) వాడుడు.

అందరు కెమిస్టులవద్దను, **3, 6, 12** నొప్పుల సైజులలో, రు. **3-6-0** రు. **5-12-0.** రు. **10-0-0** ధరలు గలిగినవి లభించును

మద్రాసు స్టాకిస్టులు :— మెసర్సు: అప్పా & కో., చైనాబజారు రోడ్డు.

,, అమృత రత్నాకర ఫార్మసీ, గోవిందప్పనాయక్ వీధి,




తయారు చేసేవారు:

డాక్టర్ పురోహిత్ ఫార్మసీ,

కొల్హాపూరు.

**PUROHIT**

**SHWAS-HARI**



నాగయ్య... జయమ్మ... బానుమతి
నారాయణరావు... లింగమూర్తి... శివరావు
వాహినీ వారి
స్వర్గసీమ
Directed by
B.N.REDDI
CAMERA.......... BARTLEY
SOUND.......... DINSHAW
ART.............. NAGOOR